www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 276

మంగళవారం | 21-1-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ. 12.40 తదుపరి అష్టమి; నక్షత్రం: చిత్త రా. 11.37 తదుపరి స్వాతి; వర్జ్యం: శేషం ఉ.7.20, పున: తె.5.54; దుర్ముహూర్తం: ఉ.9.05-9.50, రా.10.14-11.03; అమృతఘడియలు: సా.4.23-6.11; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.00

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విక్టరీ ర్యాలీలో ట్రంప్ డ్యాన్స్



అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న ట్రంప్



మెలానియాను ముద్దాడుతూ..

బైడెన్ నిర్ణయాలన్నీ రద్దు

కొన్ని గంటల్లోనే చేసేస్తా.. స్వర్ణయుగం ఆరంభమైంది

అమెరికా మళ్లీ గొప్ప దేశంగా మారబోతోంది.. అందుకే దేవుడు నన్ను బతికించాడు

అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమేస్తా.. మూడో ప్రపంచ యుద్ధాన్ని అడ్డుకుంటా..

దేశంలో ఇక ఆడ, మగ రెండే జెండర్లు.. డొనాల్డ్ ట్రంప్ ఉద్వేగ భరిత ప్రసంగం


47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ నేత ప్రమాణం.. ప్రపంచ దేశాల అతిరథమహారథులు హాజరు

గండరగండడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా ఆసీనుడయ్యారు. పలు ఎగుడు దిగుళ్లు చూసిన రాజకీయ జీవితంలో పలుమార్లు పదవీచ్యుతి ప్రయత్నాలను, పలు నేరారోపణలను, హత్యాయత్నాలను అధిగమించి మరోసారి శ్వేతసౌధం అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

వాషింగ్టన్ డీసీ, జనవరి 20: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథుల సమక్షంలో సోమవారం క్యాపిటల్ బిల్డింగ్‌లో జరిగిన వేడుకలో రిపబ్లికన్ నేత 47వ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్‌తో అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్‌లో తీవ్రమైన చలిగాలులు వీస్తుండటంతో క్యాపిటల్ బిల్డింగ్ లాన్‌లో వేడుకగా జరగాల్సిన కార్యక్రమాన్ని లోపల హాల్లోకి మార్చారు. బయట సాంస్కృతిక కార్యక్రమాలు, మిలిటరీ పరేడ్ యథావిధిగా సాగాయి. ప్రమాణస్వీకారం సందర్భంగా, అంతకుముందు

మిగతా 2వ పేజీలో...

మీకు జీవితాంతం రుణపడి ఉంటా



మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగువాడిగానే పుడతా

జ్యూరిక్‌లో తెలుగు పారిశ్రామికవేత్తల భేటీలో సీఎం

2047 నాటికి నం.1గా తెలుగుజాతి

ఇంతమంది యూరప్‌లో ఉన్నారనుకోలేదు

జైల్లో ఉన్నప్పుడే ఈ విషయం తెలుసుకున్నా

నా కోసం 53 రోజులూ ప్రదర్శనలు చేశారు

ఎన్నికల్లో సొంత డబ్బు ఖర్చు చేసి కూటమి అభ్యర్థుల్ని గెలిపించుకున్నారు: బాబు

పెట్టుబడుల వేట, 'బ్రాండ్ ఏపీ' ప్రచారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. దావోస్‌కంటే ముందే... స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. స్విస్‌లోని భారత రాయబారితోనూ చర్చలు జరిపారు. జ్యూరిక్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు.



దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్న చంద్రబాబును అక్కడి విమానాశ్రయంలో కలిసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు. చిత్రంలో మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఉన్నారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

స్విస్ పారిశ్రామికవేత్తలకు లోకేశ్ ఆహ్వానం

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుజాతిలోనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్తూ మధ్యలో, జ్యూరిక్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "దాదాపు 12 దేశాల నుంచి మీరంతా వచ్చారు. ఒకప్పుడు విమానాశ్రయానికి వస్తే ఎవరూ కనబడేవారుకాదు. ఇప్పుడు ఒక్కసారిగా ఎయిర్‌పోర్టుల్లో

మిగతా 13వ పేజీలో...

జ్యూరిక్‌లో బాబు బిజీబిజీ

పెట్టుబడిదారులతో వరుస సమావేశాలు

స్విస్‌లో భారత రాయబారి మృదుల్‌తో భేటీ

టీ-సీఎం రేవంత్‌రెడ్డితో మాటామంతీ

ఏపీలో వరల్డ్ క్లాస్ పీజీఏ గోల్ఫ్ సిటీ

ఎవరికి నచ్చినా.. నచ్చకున్నా..
లోకేశ్ కాబోయే సీఎం!

దావోస్ భేటీలో మంత్రి భరత్ ఉద్ఘాటన

మందలించిన చంద్రబాబు

సమయం, సందర్భం లేకుండా మాట్లాడొద్దు

మనం పెట్టుబడుల కోసం వచ్చాం

రాజకీయాలు మాట్లాడితే ఏమనుకుంటారు?

మరోసారి ఇలా చేస్తే ఊరుకోను: సీఎం

లోకేశ్‌కు 'డిప్యూటీ' ఊసు ఎత్తొద్దు

టీడీపీ నేతలకు దావోస్ నుంచి ఆదేశం

బాబోయ్.. చలి!

నాడు దావోస్‌కు దూరంగా జగన్

అదేమని అడిగితే వింత కబుర్లు

2014-19 మధ్య ఏటా దావోస్‌కు బాబు

జగన్ అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"మీకు తెలుసా!? ఈ సమయంలో దావోస్‌లో మైనస్ 5, మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. మూడువేల మంది దాకా ప్రతినిధులు ఉంటారు. అంత చలి ఉంటే స్నానం చేస్తామా?"... జగన్ హయాంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్‌నాథ్ పలుకులివి! 'మీరు దావోస్ ఆర్థిక సదస్సులో ఎందుకు పాల్గొనడం లేదు' అనే

మిగతా 13వ పేజీలో...





కాకినాడ పోర్టు డీల్ రివర్స్!

వాటాలను కేవీరావుకు తిరిగిచ్చేసిన అరబిందో

మూడు రోజుల క్రితం గుట్టుగా బదిలీ.. వివాదంలో పైస్థాయి వ్యక్తుల మధ్యవర్తిత్వం

సెజ్‌ను మరిచిపోవాలంటూ కేవీరావుకు షరతు.. దీనికి బదులుగా పోర్టులో వాటాలు బదిలీ

పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకున్న కేవీ రావు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

'కాకినాడ సీ పోర్టు' మళ్లీ అసలు యజమాని కేవీ రావుకు దక్కింది. వైసీపీ హయాంలో బలవంతంగా వాటాల బదిలీ... కూటమి సర్కారు వచ్చాక దీనిపై సీఐడీకి కేవీరావు ఫిర్యాదు... ఆపై ఈడీ కూడా రంగంలోకి దిగిన సమయంలో విషయం కీలక మలుపు తిరిగింది. కేవీ రావు నుంచి అప్పట్లో బలవంతంగా లాక్కున్న వాటాలను 'అరబిందో' సంస్థ తిరిగి ఆయనకే అప్పగించింది. మూడు రోజుల కిందట వాటాల బదిలీ పూర్తయినట్లు సమాచారం. విషయాన్ని అటు సీఐడీ, ఇటు ఈడీ లోతుగా లాగకుండా ముందు జాగ్రత్తగా వాటాలను తిరిగి ఇచ్చేశారని ప్రచారం జరుగుతోంది. కానీ... దీని వెనుక జరిగింది వేరని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... కాకినాడ పోర్టులో మనీలాండరింగ్‌పై ఈడీ ఆరా తీస్తుండటం... అరబిందో ప్రతిష్ఠ దెబ్బతినే పరిస్థితి తలెత్తడం... తీగ లాగితే భారీగా డొంక కదిలే పరిస్థితి ఉండటంతో కాకినాడ సీపోర్ట్ డీల్ 'రివర్స్' అయ్యింది. ప్రస్తుత పరిస్థితులను కేవీరావు పూర్తిగా తనకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పైస్థాయి వ్యక్తులు కొందరు రంగంలోకి దిగి... ఇద్దరినీ కూర్చోబెట్టి కొత్త 'డీల్'కు ఓకే చెప్పించారు. అప్పట్లో... రూ.2500 కోట్ల విలువైన 2.15 కోట్ల షేర్లను జగన్ బ్యాచ్ రూ.494 కోట్లకే లాగేసుకుందని కేవీ రావు ఆరోపించారు. దీనిపై సీఐడీకి కూడా ఫిర్యాదు చేశారు. అదే సమయంలో కేవీరావుకు చెందిన... 8వేల ఎకరాలున్న కాకినాడ సెజ్ పూర్తిగా అరబిందోకు సొంతమైంది. తాజాగా...

మిగతా 14వ పేజీలో...

దమ్ముంటే 5 ఏళ్ల జగన్ పాలనపై
విచారణ జరిపించండి



అమిత్ షా వ్యాఖ్యలకు ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది

జగన్ పాలన విపత్తు అయితే ఐదేళ్లూ ఎందుకు ఉపేక్షించారు?

పోలవరం రివర్స్ టెండరింగ్‌పై ఏనాడైనా మాట్లాడారా?

ఉక్కుకు ఆర్థిక ప్యాకేజీ ఉద్ధరణ కాదు: షర్మిల 12

'అభయ' హంతకుడికి
జీవిత ఖైదు!

మరణించేదాకా జైల్లోనే..

కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసులో సియాల్దా కోర్టు తీర్పు.. 50 వేల జరిమానా

హతురాలి తల్లిదండ్రులకు రూ.17 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం 2

వద్దన్న తల్లిదండ్రులు.. తీర్పుపై అసంతృప్తి

మరణశిక్ష వేసే దాకా పోరాడతామని వెల్లడి

మేమే దర్యాప్తు చేస్తే ఉరిశిక్ష పడేది: మమత

ప్రియుడికి విషమిచ్చి హత్య..
ప్రియురాలికి మరణశిక్ష

2022 నాటి కేసులో కేరళ కోర్టు తీర్పు

భారీగా బదిలీలు



ఒకే రోజు 27 మంది ఐపీఎస్‌లు, 25 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం

సీఆర్‌డీఏ కమిషనర్‌గా కన్నబాబు

కాటమనేని భాస్కర్‌కు ఐటీ బాధ్యతలు

దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు సన్నద్ధం!?

జీఏడీ పొలిటికల్ సెక్రటరీగా ఎంకే మీనా

ఎక్స్ అఫిషియో ఎస్‌సీఎస్‌గా సాయిప్రసాద్

శాంతి భద్రతల ఏడీజీగా మధుసూదన్

హర్షవర్ధన్‌కు తిరుపతి జిల్లా బాధ్యతలు

పీఆర్‌జీ చైర్మన్‌గా మీనా, టెక్నికల్‌కు శ్రీకాంత్

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒకే రోజు భారీ సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. నిరీక్షణలో ఉన్న కొందరికి పోస్టింగులు ఇవ్వడంతోపాటు ఎక్కువ మందికి స్థాన చలనం కలిగించింది. తద్వారా పాలనలో మరింత వేగం పుంజుకునేలా చర్యలు చేపట్టింది. మొత్తంగా 25 మంది ఐఏఎస్‌లు, 27 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన

మిగతా 12వ పేజీలో...



గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కార్టూన్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆ శాఖ ఉన్నతాధికారులు

క్లస్టర్ వ్యవస్థకు
కొత్తరూపు

పంచాయతీల ఆదాయం, జనాభా ప్రాతిపదికన కొత్త గ్రేడ్లు

గ్రేడ్ల ఆధారంగా సిబ్బంది కేటాయింపులు 12

గ్రామ పంచాయతీ వ్యవస్థలో సమూల మార్పులు

వ్యవస్థ బలోపేతానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం

అధ్యయనం కోసం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

మార్చిలోగా లక్ష సీసీ కెమెరాలు

నేరాలను అరికట్టడమే లక్ష్యం

ఇప్పటికే క్రైం హాట్ స్పాట్స్‌లో 18 వేలు ఏర్పాటు

సైబర్ తప్ప మిగిలిన నేరాలు తగ్గాయి

డ్రోన్ల వినియోగంతో సత్ఫలితాలు: డీజీపీ



కాకినాడ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రవ్యాప్తంగా నేరాలను అరికట్టేందుకు మార్చి 31లోపు లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే క్రైం హాట్ స్పాట్స్‌లో 18 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం' అని డీజీపీ ద్వారకా తిరుమల రావు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో సోమవారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ డిపోలను ఆ సంస్థ ఎండీ హోదాలో పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడారు. 'రాష్ట్రంలో సైబర్ నేరాలు మినహా మిగతా నేరాలు

మిగతా 12వ పేజీలో...

అమెరికాలో తెలుగు యువకుడి హత్య

ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా దుండగుల కాల్పులు.. కారు, డబ్బు ఇవ్వాలంటూ ఘాతుకం

మృతుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసి 2

తండ్రి క్యాబ్ డ్రైవర్.. భూమినంతా అమ్మేసి ఇద్దరు పిల్లల్ని అమెరికాకు పంపిన వైనం

జగన్ బెయిల్ రద్దు పిటిషన్

వేరే ధర్మాసనానికి బదిలీ



సీబీఐ అభ్యర్థనతో సుప్రీం విచారణ 27కి వాయిదా

14



డయాఫ్రం వాల్ నిర్మాణంలో ట్రెంచ్ కటింగ్ పనులు

నిపుణుల మాటకే ఓటు

టీ-16 మిశ్రమం వాడాలని జలసంఘం ఆదేశం

పీపీఏ ద్వారా జల వనరుల శాఖకు సమాచారం

ఊపందుకున్న డయాఫ్రం వాల్ పనులు

మూడో రోజూ ట్రెంచ్ కట్టర్‌తో తవ్వకాలు

14

అమెరికాలో తెలుగు యువకుడి హత్య!

- ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా దుండగుల కాల్పులు
- కారు, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఘాతుకం
- మృతుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసి



నల్లగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత చదువు పూర్తిచేసుకున్న కుమారుడు, త్వరలో మంచి కొలువు సాధించి, కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటాడని ఆశించిన ఆ తల్లిదండ్రులకు దిగ్భ్రాంతికరమైన వార్త చెవినపడింది! తమ కుమారుడు ఇక లేడని.. దేశం కాని దేశంలో దుండగుడి కాల్పులకు ప్రాణాలొదిలాడని తెలియడంతో కంటికిమంటికీ ధారగా రోదిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చంద్రమౌళి కుటుంబం నల్లగొండ తిరుమలనగర్ కాలనీలో స్థిరపడింది. ఐదేళ్ల క్రితం చంద్రమౌళి, జీవనోపాధి కోసంతన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వచ్చి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు రవితేజతో పాటు కూతురు ఉంది. రవితేజ(27) హైదరాబాద్‌లో బీటెక్ చేశాడు. తనకున్న భూమినంతా విక్రయించి కుమారుడిని 2022లో కుమార్తెను 2023లో ఎంఎస్ చదివేందుకు అమెరికా పంపాడు. రవితేజ అక్కడ మాస్టర్స్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తాత్కాలికంగా ఓ చైనీస్ రెస్టారెంట్‌లో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భారత కాలమాన ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఫుడ్ డెలివరీ చేసేందుకు కారులో ఓ కస్టమర్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరు దుండగులు రవితేజపై కాల్పులు జరిపి, ఆయన కారును అపహరించుకుపోయారు. ఇక్కడ తెల్లవారుజామునే లేచి ఉదయం నడకలో ఉన్న రవితేజ తండ్రి చంద్రమౌళికి అమెరికాలోని సమీపబంధువు నుంచి ఫోనొచ్చింది. అమెరికాలో దుండగుల కాల్పులకు రవితేజ చేతులకు బుల్లెట్ గాయాలయ్యాయని, ఏ ప్రమాదం లేదని చెప్పాడు. అయితే, కొద్దిసేపటికే జరిగిన ఘోరం ఆయనకు తెలిసిపోయింది. 'ఎన్నో కలలతో అమెరికా వెళ్లిన మా కుమారుడు, విగతజీవిగా వస్తాడని అనుకోలేదు. ఈ విషాదాన్ని మా గుండెలు తట్టుకుంటాయా? మాకు ఇక దిక్కెవరు?' అంటూ సువర్ణ-చంద్రమౌళి దంపతులు రోదించారు.

వెస్ట్ బ్యాంక్ చేరుకున్న పాలస్తీనా ఖైదీలు

టెల్‌అవీవ్, జనవరి 20: అమెరికా-ఖతార్-ఈజిప్ట్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ ఇప్పటికే ముగ్గురు బందీలను విడిచిపెట్టగా ఇజ్రాయెల్ 90 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది. వీరిలో 69 మంది మహిళలు, 21 మంది టీనేజర్లు ఉన్నారు. ఇజ్రాయెల్ విడుదల చేసిన వారిలో 62 సంవత్సరాల ఖలీదా జరార్ కూడా ఉన్నారు. పాలస్తీనా విమోచనం కోసం పోరాడుతున్న లెఫ్టిస్ట్ పాపులర్ ఫ్రంట్ నాయకురాలైన జరార్‌ను ఎలాంటి కోర్టు ఆదేశాలు లేకుండానే ఆరు నెలలుగా నిర్బంధంలో పెట్టారని ఆరోపణలున్నాయి. రెడ్‌క్రాస్ బస్సుల్లో ఖైదీలంతా వెస్ట్ బ్యాంక్‌లోని రమల్లాకు చేరుకున్నారు.

యూజీసీ కొత్త రూల్స్‌ను రద్దు చేయండి: స్టాలిన్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్ల నియామకంపై రాష్ట్ర గవర్నర్‌కే సంపూర్ణ అధికారాలు కల్పిస్తూ యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనల్ని తక్షణమే రద్దు చేయాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. తమిళనాట ఇప్పటివరకూ వైస్‌చాన్సలర్లను నియమించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్‌కమిటీ సిఫారసుల మేరకు, గవర్నర్ ఆమోదం పొందే పద్ధతి ఉండేదని పేర్కొన్నారు. యూజీసీ కొత్త నిబంధన ప్రకారం వీసీల నియామకం కోసం సెర్చ్‌కమిటీలను ఏర్పాటు చేసే అధికారం పూర్తిగా గవర్నర్‌కే ఉంటుందని, రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఈ నిబంధనల్ని వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఇదే విధమైన లేఖను ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాల సీఎంలకు కూడా పంపించారు.

అమిత్ షాపై ఆరోపణల కేసులో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ, జనవరి 20: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఝార్ఖండ్ కోర్టులో నమోదైన పరువు నష్టం దావాపై విచారణ కొనసాగకుండా స్టే విధించింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చాయిబాసాలో రాహుల్ ప్రసంగిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను హంతకుడని విమర్శించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై నవీన్ ఝా అనే బీజేపీ కార్యకర్త రాంచీ మేజిస్ట్రేటు కోర్టులో పరువు నష్టం దావా వేశారు. విచారణ నిమిత్తం హాజరు కావాలని ఆ కోర్టు ఆదేశించింది. దీనిపై రాహుల్ ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ ఉత్తర్వులు ఇచ్చింది. కేసును కొట్టివేయడానికి మాత్రం నిరాకరించింది. మళ్లీ సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా మొత్తం విచారణపై స్టే విధించింది.

ఫోన్ చార్జింగ్ తక్కువగా ఉంటే.. ఉబెర్ బాదుడు!

- ఢిల్లీ ఆంత్రప్రెనర్ ప్రయోగంలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 20: ఉబెర్, ఓలా, జెప్టో, బ్లింకిట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఆధారిత యాప్‌లు.. వినియోగదారులు వాడే ఫోన్లు, వాటి ఖరీదు ఆధారంగా వస్తు/సేవల ధరలను నిర్ణయిస్తున్నాయన్న ఆరోపణలు చాలాకాలంగానే ఉన్నాయి! తాజాగా ఢిల్లీకి చెందిన రిషభ్‌సింగ్ అనే ఔత్సాహిక పారిశ్రామికవేత్త.. ఫోన్ మోడల్‌తోపాటు, మన ఫోన్‌లో ఉన్న బ్యాటరీ శాతం ఆధారంగా కూడా ఉబెర్ ప్రైసింగ్ విధానం మారిపోతోందని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. టెక్ ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించి 'ఇంజనీర్ హబ్' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను స్థాపించిన రిషభ్‌సింగ్.. ఉబెర్ ధరల విధానంపై ఒక ప్రయోగం చేశారు. అందులో భాగంగా రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు, రెండు ఐఫోన్లలో ఒకే అకౌంట్ ద్వారా, ఒకే చోటు నుంచి, ఒకే సమయంలో ఉబెర్‌లోకి లాగిన్ అయ్యారు. ఫోన్ ప్లాట్‌ఫామ్‌ను (అది ఆండ్రాయిడా, ఐఫోనా అనేదాని) బట్టి 13 నుంచి 50 శాతం దాకా డిస్కౌంట్లు వచ్చాయని.. అంతేకాక, బ్యాటరీ శాతం తక్కువగా ఉన్న ఫోన్లలో ఎక్కువ ధరలు కనిపించాయని ఆయన తన వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. తన ప్రయోగానికి సంబంధించిన ఫొటోను కూడా షేర్ చేశారాయన. అందులో నాలుగు ఫోన్లలో నాలుగు రకాల ధరలు కనిపించడం గమనార్హం. బ్యాటరీ సమాచారం ఆధారంగా ఉబెర్ ప్రైసింగ్ అల్గారిథమ్ వినియోగదారుల అత్యవసర పరిస్థితిని సొమ్ము చేసుకుంటోందని మండిపడ్డారు. ఉబెర్, ఓలా వంటి యాప్‌లు తమ ఫోన్ ప్లాట్‌ఫామ్, బ్యాటరీ స్థాయుల ఆధారంగా ధరలు నిర్ణయిస్తున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని రిషభ్‌సింగ్ అభిప్రాయపడ్డారు.



బైక్‌లపై అత్యంత ఎత్తయిన మానవ పిరమిడ్

- ప్రపంచ రికార్డు సృష్టించిన భారత ఆర్మీ డేర్‌డెవిల్స్ జట్టు

న్యూఢిల్లీ, జనవరి 20: ద్విచక్ర వాహనాలపై అత్యంత ఎత్తయిన మానవ పిరమిడ్ ఆకృతిని ఏర్పరచి భారత ఆర్మీ డేర్‌డెవిల్స్ జట్టు రికార్డు సృష్టించింది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో 40 మంది సభ్యులు గల డేర్‌డెవిల్స్ జట్టు 9 బైక్‌ల సాయంతో 20.4 అడుగుల ఎత్తున మానవ పిరమిడ్‌ను ఏర్పరచింది. అంతేకాకుండా అదే ఆకృతిలో నిలబడి భారత జెండాను ఎగురవేస్తూ విజయ్‌చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రయాణించింది. ఈ ప్రదర్శనతో భారత ఆర్మీ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు గిన్నిస్ బుక్, ఆసియా బుక్, లిమ్కాతో పాటు మొత్తం 33 ప్రపంచ రికార్డులను డేర్‌డెవిల్స్ జట్టు నమోదు చేసింది.

బైడెన్ నిర్ణయాలన్నీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అభిమానులతో ర్యాలీలో ట్రంప్ ఉత్సాహభరితంగా ప్రసంగించారు. ఈ క్షణం నుంచి అమెరికా స్వర్ణ యుగం ప్రారంభమైందని ప్రకటించారు. మళ్లీ అమెరికా గొప్ప దేశం అవుతుందని భరోసా ఇచ్చారు. ప్రపంచం మొత్తం అమెరికాను చూసి కుళ్లుకుంటుందని మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తనపై జరిగిన హత్యాయత్నాన్ని ట్రంప్ గుర్తు చేసుకున్నారు. బుల్లెట్ తన చెవిని చీల్చుకుంటూ వెళ్లిందని, అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మార్చే గొప్ప కార్యాన్ని నెరవేర్చడానికే దేవుడు తనను రక్షించాడని ట్రంప్ వ్యాఖ్యానించారు. అధ్యక్షుడిగా భారీ నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. వలసలపై భారీ ఎత్తున నియంత్రణలు పెడతామని, అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతామని వ్యాఖ్యానించారు. దేశంలో అక్రమంగా ఉంటున్న లక్షల మంది నేరగాళ్లను వెంటనే వెళ్లగొడతామన్నారు. చమురు తవ్వకం మీద బైడెన్ నిర్ణయాలను తిరగదోడతామని ప్రకటించారు. మెక్సికో సరిహద్దుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తామని, సాయుధ బలగాలను మోహరిస్తామని చెప్పారు. సరిహద్దు దాటి వచ్చి ఆశ్రయం కోరేవారు ఇక నుంచి కోర్టు విచారణ తేదీ వచ్చేవరకు సరిహద్దుల్లోనే ఉండే విధంగా పాత విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న వ్యక్తులకు అమెరికా గడ్డపై పిల్లలు పుడితే ప్రస్తుతం ఆటోమాటిక్ పౌరసత్వం ఇస్తున్నారని, దాన్ని ఎత్తేస్తామని అన్నారు. మంగళవారం సూర్యుడు అస్తమించే సమయానికి అమెరికాపై జరుగుతున్న దాడి ఆగిపోతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల అమెరికా పతనానికి తెర పడిందని తక్షణమే తెర పడిందని చెప్పారు. క్యాపిటల్ భవనంపై దాడికి సంబంధించిన కేసుల్లో దోషులు/అభియోగాలు ఎదుర్కొంటున్న 1500 మందికి పైగా బాధితులకు ఉపశమనం కల్పిస్తానని పునరుద్ఘాటించారు. ఓవల్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోపే బైడెన్ సర్కారు తీసుకున్న మూర్ఖపు నిర్ణయాలను రద్దు చేస్తానని వెల్లడించారు. ఆయన ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయాలూ అమలు కాకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలనూ అదుపు చేస్తానన్నారు. మూడో ప్రపంచ యుద్ధంగా రాకుండా అడ్డుకుంటానని స్పష్టం చేశారు. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తానని ట్రంప్ చెప్పారు. దేశంలో ఆడ, మగ రెండు జెండర్లు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. జాన్ ఎఫ్ కెనడీ, రాబర్ట్ ఎఫ్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్య కేసు ఫైళ్లను బహిర్గతం చేస్తానని తెలిపారు. ప్రభుత్వంలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు రాబోయే రోజుల్లో ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తానని వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే పాలనాపరమైన అనేక ఆదేశాలు జారీ చేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. 250 ఏళ్ల అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడు ఎదుర్కోనన్ని పరీక్షలను తాను ఎదుర్కొన్నానని చెప్పారు.



అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ట్రంప్

భారీ ర్యాలీ.. డ్యాన్స్ చేసిన ట్రంప్!

ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు డొనాల్డ్ ట్రంప్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్ డీసీలో ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో ట్రంప్ తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్(ఎంఏజీఏ) షర్టులు ధరించిన వేల మంది ట్రంప్ అభిమానులు దేశం నలు మూలల నుంచి వాషింగ్టన్‌కు వచ్చి వర్షం, మంచును లెక్క చేయకుండా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతానని ప్రకటించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అత్యంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటానని, అమెరికా ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాగా ర్యాలీలో కళాకారులు వైఎంసీఏ పాటను పాడుతూ నృత్యం చేశారు. బ్యాండ్ సభ్యులు డ్యాన్స్ చేస్తుండగా.. ట్రంప్ కూడా తనదైన శైలిలో స్టెప్పులు వేశారు. ఆయన డ్యాన్స్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. బ్యాండ్ సభ్యులు ట్రంప్‌తో కరచాలనం చేశారు. 1970వ దశకానికి చెందిన డిస్కో పాట (వైఎంసీఏ)కు ట్రంప్ ప్రచారంలో భాగంగా నిర్వహించే మాగా ర్యాలీల్లో విశేష ప్రాధాన్యం దక్కింది. ఈ ర్యాలీలో ట్రంప్‌తో పాటు దిగ్గజ పారిశ్రామికవేత్త, టెస్లా, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నారు. తన కుమారుడితో కలిసి వేదికపైకి వచ్చిన మస్క్.. కొన్ని శతాబ్దాల పాటు అమెరికాను పటిష్ఠ దేశంగా ఉంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చివరి గంటల్లో జో బైడెన్ క్షమాభిక్షలు

అమెరికా అధ్యక్ష పదవీకాలం మరికొన్ని గంటల్లో ముగుస్తుందనగా జోబైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ ఆంటోనీ ఫౌచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లె తదితరులకు ముందస్తు క్షమాభిక్ష ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులకూ ఉపశమనం కలిగించారు.



ట్రంప్‌కు బైడెన్ స్వాగతం

ఉదయమే వైట్‌హౌస్‌కు వచ్చిన ట్రంప్‌కు దిగిపోతున్న అధ్యక్షుడు బైడెన్ సాదర స్వాగతం పలికి, తేనీటి విందు ఇచ్చారు. తెలుగింటి అల్లుడు, కొత్త ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తమిళ ఇంటి ఆడపడుచు, దిగిపోతున్న ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ సాదరస్వాగతం పలికారు. జేడీ వాన్స్ వెంట ఆయన సతీమణి ఉష చిలుకూరి కూడా ఉన్నారు. ట్రంప్ వెంట ఆయన సతీమణి మెలానియా ట్రంప్ ఉన్నారు. ట్రంప్ భార్యబుగ్గపై ముద్దు పెట్టుకొనే ప్రయత్నం చేయగా ఆమె హ్యాట్ అడ్డం రావడంతో ఆగిపోయారు. శ్వేతసౌధంలో విందు అనంతరం ట్రంప్ బైడెన్‌తో కలిసి ఒకే వాహనంలో ప్రమాణ స్వీకారానికి వెళ్లారు.



అమెరికా ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న జేడీ వాన్స్, ఆయన పక్కన సతీమణి ఉషా చిలుకూరి

ప్రధాని ప్రత్యేక దూతగా హాజరైన జైశంకర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ ప్రత్యేక దూతగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ హాజరయ్యారు. ట్రంప్‌ను అభినందిస్తూ ప్రధాని రాసిన లేఖను వెంట తీసుకెళ్లారు. మరోవైపు ప్రధాని మోదీ తన 'ప్రియమిత్రుడు' ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రపంచానికి మంచి భవిష్యత్తు ఇవ్వడానికి, రెండు దేశాలకు మేలు చేయడానికి, మరోసారి మీతో సన్నిహితంగా కలిసి పనిచేయాలని ఎదురు చూస్తున్నా' అంటూ ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రమాణ స్వీకార వేడుకకు ఇతర మాజీ అధ్యక్షులతో పాటు బరాక్ ఒబామా హాజరైనప్పటికీ ఒబామా మిచెల్లీ ఒబామా రాలేదు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రియుడి హత్య కేసులో యువతికి మరణశిక్ష

- కేరళ కోర్టు సంచలన తీర్పు
- 2022లో ప్రియుడికి విషమిచ్చి హత్య చేసిన 24 ఏళ్ల నిందితురాలు



షారోన్ రాజ్, గ్రీష్మ

తిరువనంతపురం, జనవరి 20: ప్రియుడికి ఆయుర్వేద టానిక్‌లో విషమిచ్చి హత్య చేసిన కేసులో కేరళలోని స్థానిక కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ కేసులో దోషిగా తేలిన గ్రీష్మ (24)కు మరణ శిక్ష విధించింది. హత్య కేసుకు సంబంధించి సాక్ష్యాలను నాశనం చేసిన ఆమె బంధువు ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష విధించింది. అయితే ఈ కేసులో మరో నిందితురాలిగా ఉన్న గ్రీష్మ తల్లికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేనందున ఆమెను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసుపై విచారణ జరిపిన నెయ్యాట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు.. గత వారం గ్రీష్మను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. పాల్పడిన నేరం తీవ్రత కంటే నిందితురాలి వయసును పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. చదువులో సాధించిన విజయాలు, గతంలో నేర చరిత్ర లేకపోవడం, తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూతురు అయినందున.. శిక్ష విధింపులో కొంత దయ చూపాలని నిందితురాలు కోరింది. కాగా, కేరళలో మరణ శిక్ష ఎదుర్కొంటున్న అతి పిన్న వయస్కురాలు గ్రీష్మనే కావడం గమనార్హం. షారోన్ రాజ్, గ్రీష్మ ఇద్దరు గతంలో ప్రేమించుకొనే వారు. అయితే గ్రీష్మకు తమిళనాడుకు చెందిన ఓ ఆర్మీ వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బంధాన్ని ముగిద్దామన్న గ్రీష్మ ప్రతిపాదనకు రాజ్ తిరస్కరించడంతో.. 2022లో ఆయుర్వేద టానిక్‌లో పారాక్వాట్ అనే కలుపు మందును కలిపి ఇచ్చింది. 11 రోజుల తర్వాత పలు అవయవాల వైఫల్యంతో షారోన్ మరణించాడు.

'అభయ' హంతకుడికి.. జీవిత ఖైదు!



మరణించేదాకా కారాగార శిక్ష.. సియాల్దా కోర్టు తీర్పు

కోల్‌కతా, జనవరి 20: జూనియర్ వైద్యురాలు 'అభయ'పై హత్యాచారం కేసులో దోషిగా నిర్ధారణ అయిన సంజయ్‌రాయ్‌కు మరణించేవరకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. రూ.50 వేల జరిమానా కూడా వేసింది. ఆమె తల్లిదండ్రులకు రూ.17 లక్షలు పరిహారంగా చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల-ఆస్పత్రిలో పనిచేసే అభయ (31) నిరుడు ఆగస్టు 9న ఆస్పత్రిలో ఆన్ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వర్తించి రాత్రి సెమినార్ హాల్‌లో నిద్రిస్తుండగా.. సంజయ్ రాయ్ ఆమెపై అత్యాచారం చేసి, అనంతరం గొంతు పిసికి హత్య చేశాడు. సమీప పోలీసు స్టేషన్‌లో సివిక్ వలంటీరుగా పనిచేసే అతడిని బందోబస్తు కోసం ఆ ఆస్పత్రిలో నియమించగా ఈ దారుణానికి పాల్పడ్డాడు. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. పశ్చిమ బెంగాల్ పోలీసుల దర్యాప్తుపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో, కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. రాయ్‌పై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 64(అత్యాచారం), 66(మరణానికి కారణమవడం), 103(1)(హత్య) సెక్షన్ల కింద కేసు నమోదైంది. బెంగాల్ పోలీసుల నుంచి దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన సీబీఐ.. హతురాలి శరీరంపై గాయాలు, సంఘటనాస్థలిలో రాయ్‌కు చెందిన వస్తువులు ఉండడం, బయలాజికల్ సాక్ష్యం ఆధారంగా అతడి పాత్రను నిరూపించింది. సియాల్దా అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ 162 రోజులు రహస్య విచారణ జరిపి అతడిని నేరస్థుడిగా నిర్ధారించి సోమవారం తన తీర్పు వెలువరించారు. మరణ శిక్ష విధించకపోవడాన్ని సమర్థించుకున్నారు. 'ఉరిశిక్ష విధించాలని సీబీఐ అభ్యర్థించింది. కానీ, రాయ్ చేసిన నేరం.. అత్యంత అరుదైన నేరాల కేటగిరీలోకి రాదు' అని న్యాయాధికారి తెలిపారు. 'ఆస్పత్రిలో విధుల్లో ఉండగా చనిపోయినందున.. హతురాలి తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. మరణానికి రూ.10 లక్షలు, అత్యాచారానికి రూ.7 లక్షల చొప్పున చెల్లించాలి' అని ఆదేశించారు. ఈ తీర్పుపై కలకత్తా హైకోర్టు ముందు అప్పీలు చేసుకునే హక్కు రాయ్‌కు ఉందని ఆయన తెలిపారు. కాగా, తాను నిర్దోషినని సంజయ్ కోర్టుకు తెలిపాడు. 'నన్ను ఇరికిస్తున్నారు. ఎలాంటి నేరమూ నేను చేయలేదు. నన్ను హింసించారు. వారు (సీబీఐ) కావాలనుకున్నట్లు సంతకాలు చేయించుకున్నారు. చాలా సాక్ష్యాలను ధ్వంసం చేశారు' అని న్యాయాధికారిని ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. కోర్టు తీర్పు విన్న అనంతరం.. కోర్టు హాలులోనే ఉన్న అభయ తల్లిదండ్రులు న్యాయాధికారికి చేతులు జోడించి నమస్కరిస్తూ.. తమకు పరిహారం అక్కర్లేదని, న్యాయం కావాలని కోరారు.

తీర్పుపై సంతృప్తిగా లేం: మమత

వైద్యురాలి హత్యాచారం కేసులో తీర్పు తమకు సంతృప్తినివ్వలేదని బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. 'దోషికి మరణశిక్ష విధించాలని తొలి నుంచీ మేం డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికీ మా డిమాండ్ అదే. అయితే ఇది కోర్టు తీర్పు. మా పార్టీ టీఎంసీ అభిప్రాయం చెబుతున్నాను. ఈ దర్యాప్తును మేమే చేపట్టి ఉంటే 60 రోజుల్లో మూడు కేసుల్లోనూ మరణదండన పడేలా చూసేవాళ్లం. ఎప్పుడో మరణ దండన విధించేలా చేసే వాళ్లం. తీర్పుపై నేను సంతృప్తి చెందలేదు' అని చెప్పారు. మరోవైపు, అభయ కేసులో కోర్టు తీర్పు.. న్యాయాన్ని అపహాస్యం చేసేలా ఉందని బీజేపీ వ్యాఖ్యానించింది. 'నిందితులను కాపాడే పనిని సీఎం మమత మానుకోవాలి. ఈ కేసులో ఆధారాలను ధ్వంసం చేయడంలో ఆమెతో పాటు కోల్‌కతా కమిషనర్ పాత్రపైనా దర్యాప్తు జరగాలి' అని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ అన్నారు. జూనియర్ డాక్టర్లు సైతం.. ఈ కేసులో ఇంకా దర్యాప్తు సాగించాలన్నారు. దీనివెనుక భారీ కుట్ర ఉందని అభయ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నందున ఇది జరగాలని స్పష్టంచేశారు.

ఇది అత్యంత అరుదైన నేరం కాదా?

తమ కుమార్తె హత్యాచారం కేసులో తమకు పరిహారం అక్కర్లేదని, న్యాయం మాత్రమే కావాలని అభయ తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. ఉరిశిక్ష కాకుండా.. మరణించేదాకా రాయ్ జైల్లో ఉండాలని, తమకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోర్టు ఇచ్చిన తీర్పుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయం కోసం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ కేసులో నిరాసక్తంగా దర్యాప్తు చేశారని.. ఇతర నిందితులను కాపాడారని ఆరోపించారు. 'ఈ నేరం వెనుక భారీ కుట్ర ఉంది' అని అభయ తల్లి అన్నారు. తమకెలాంటి పరిహారమూ వద్దని తండ్రి స్పష్టంచేశారు.

ఎస్సీ వర్గీకరణపై కమిషన్ అనంతలో పర్యటన

- వెంటనే వర్గీకరణ చేయాలని మాదిగల వినతి
- వర్గీకరణ రాజకీయ ప్రేరేపితమని మాలల అభ్యంతరం

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ అంశంపై ఆయా సామాజికవర్గాల ప్రజలు, సంఘాల నాయకుల అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సోమవారం అనంతపురంలో పర్యటించింది. ఇక్కడి కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం అభిప్రాయాలను తెలుసుకుని, వినతి పత్రాలను స్వీకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ ఉప కులాల నాయకులు, సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. వినతిపత్రాలు ఇచ్చిన వారి అభిప్రాయాలను అధికారులు రికార్డు చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎదురు చూస్తున్నామని, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలుచేసి తమకు న్యాయం చేయాలని మాదిగ సంఘాల నాయకులు, ఆ సామాజికవర్గ ప్రజలు కమిషన్‌ను కోరారు. వర్గీకరణ అన్యాయమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతున్నారని మాల సామాజికవర్గం నాయకులు, ఆ కుల సంఘాల నాయకులు కమిషన్‌కు తెలిపారు. తాము ఎస్సీ జాబితాలో ఉన్నామో లేదో తెలియడం లేదని బుడగ జంగాల సామాజికవర్గం వారు కమిషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అభిప్రాయ సేకరణ ముగిసిన తరువాత కలెక్టర్లు, ఇతర అధికారులతో రాజీవ్ రంజన్ మిశ్రా సమావేశమయ్యారు.

అటు రద్దీ.. ఇటు రమ్మీ!

విస్మయం కలగించిన అధికారి తీరు



అది అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎస్సీ వర్గీకరణ సమస్యపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు సోమవారం వినతిపత్రాలు స్వీకరిస్తూ బిజీగా ఉన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా, అనుకూలంగా తరలివచ్చిన జనం, వారిని నియంత్రించేందుకు వచ్చిన పోలీసులతో.. ఆ ప్రాంతంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఇంత జరుగుతున్నా.. ఏమీ పట్టించుకోకుండా స్మార్ట్ ఫోన్‌లో రమ్మీ ఆడుతూ తన ప్రపంచంలో మునిగిపోయారు అనంతపురం జిల్లా డీఆర్వో మలోల. వేదికపై తన పక్కనే ఉన్నతాధికారులు.. ఎదురుగా వర్గీకరణపై మోహరించిన ఎస్సీ వర్గీయులు, పోలీసులు.. ఇవేమీ పట్టించుకోని ఆ అధికారిని చూసినవారు ముక్కున వేలేసుకున్నారు.

- అనంతపురం టౌన్, ఆంధ్రజ్యోతి

లోకం తీరు





వేసవికి ముందే తాటి ముంజెలు

డజను రూ.150

వేసవికి ముందే తాటి ముంజెలు అమ్మకానికి వచ్చేశాయి. సాధారణంగా రథసప్తమి తరువాత మంచి ఎండలు కాసే సమయంలో ఇవి వస్తాయి. ఈసారి సంక్రాంతి నుంచే వీటిని చెట్ల పైనుంచి దించి విక్రయిస్తున్నారు. తగరపువలస సమీపానున్న తాళ్లవలసలో తాటితోపుల నుంచి వీటిని తెచ్చి బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ సమీపాన అమ్ముతున్నారు. మొన్నటి వేసవిలో డజను ముంజెలు రూ.50కి విక్రయించగా, ఇప్పుడు అన్‌సీజన్‌లో తెచ్చినందుకు రూ.150 చొప్పున అమ్ముతున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.

6.83 లక్షల మందికి వైకుంఠద్వార దర్శనాలు

- పది రోజుల్లో రూ.34.43 కోట్ల హుండీ ఆదాయం
- తిరుమలలో సాధారణ దర్శనాలు పునఃప్రారంభం

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): పది రోజులపాటు తిరుమలలో జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. సోమవారం వేకువ జాము నుంచి సాధారణ దర్శనాలు మొదలయ్యాయి. కాగా, పది రోజుల్లో 6,83,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని, వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. హుండీ ద్వారా రూ.34.43 కోట్ల ఆదాయం లభించింది. సంక్రాంతి సందర్భంగా 14వ తేదీ అత్యధికంగా 78 వేల మంది శ్రీవారిని దర్శించుకోగా, రెండవరోజు ద్వాదశి రోజున అతితక్కువగా 53,013 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, పెరిగిన రద్దీ నేపథ్యంలో సోమవారం దర్శనానికి సంబంధించి తిరుపతిలో జారీ చేసే స్లాటెడ్ సర్వదర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో టోకెన్‌రహిత దర్శనాలు జరిగాయి.

కుంభమేళాలో టీటీడీ చైర్మన్

- శ్రీవారి నమూనా ఆలయంలో పూజలు



నమూనా ఆలయంలో టీటీడీ చైర్మన్

తిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నమూనా ఆలయాన్ని ఆయన సోమవారం దర్శించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొన్నారు. 250 మంది టీటీడీ సిబ్బంది నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పురందేశ్వరి వ్యాఖ్యలు హాస్యాస్పదం: రామకృష్ణ

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'అదానీకి, బీజేపీకి సంబంధం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పడం హాస్యాస్పదం. ఆమె వ్యాఖ్యలు చూస్తుంటే అందరి చెవుల్లో పువ్వులు పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలా ఉంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పశు పోషణతో ఆర్థికాభివృద్ధి: అచ్చెన్నాయుడు



తాడేపల్లి మండలం చిర్రావూరులో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

తాడేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశుపోషణ రైతుల ఆర్థికాభ్యున్నతికి దోహదం చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరులో పశు వైద్య శిబిరాన్ని, అవగాహన సదస్సును మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిపి అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య సంరక్షణ ఉత్పాదకాలు పెంచడానికి, వ్యాధులు నియంత్రించడానికి ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

ఉద్యానశాఖలో వృద్ధి పెంచాలి

అమరావతి: కేంద్ర పథకాలను వినియోగించుకుని, వ్యవసాయ, ఉద్యానశాఖల్లో వృద్ధి రేటు మరింత పెంచడంపై దృష్టి సారించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖలపై ఆయన సమీక్ష చేశారు. ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరిశ్రమల్లో బహుళ అంతస్తులకు అనుమతులు

- ఏపీ బిల్డింగ్ రూల్స్-2017కు సవరణలు: మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భవన నిర్మాణ అనుమతులపై ఏపీ బిల్డింగ్ రూల్స్-2017కు సవరణలు చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పరిశ్రమల్లో కూడా బహుళ అంతస్తులకు అనుమతి ఇవ్వనున్నారు. నిర్మాణాలకు, స్టోరేజ్ అవసరాలకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. ఆయా ప్లాట్‌ల పరిమాణం బట్టి పరిశ్రమలకు అనుమతి ఇచ్చే విషయంలో మార్గదర్శకాలను రూపొందించారు.

డిప్యూటీ సీఎం... ఆరో వేలుతో సమానం: తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'డిప్యూటీ సీఎం పదవి ఆరవ వేలు లాంటిది. అడ్డమే తప్ప ఉపయోగం లేదని స్వర్గీయ నీలం సంజీవరెడ్డి అన్నారు' అని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలనడగడం హాస్యాస్పదం. ఆ పదవికి ప్రోటోకాల్ ఉండదు. అదనపు అధికారాలు, హక్కులు ఉండవు. లోకేశ్ మీద ప్రేమ ఉంటే, ఆయన సామర్థ్యం మీద నమ్మకం ఉంటే టీడీపీ నాయకులు లోకేశ్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వమని అడగాలి. లేదా లోకేశ్‌కు పోటీదారు అవుతున్నాడు.. పవన్‌ను తగ్గించాలి అనుకుంటే డిప్యూటీ సీఎం పదవి ఊడబీకాలి' అని తులసిరెడ్డి అన్నారు.

'ఉపాధి హామీ' ఉద్యమకారుడు

బేడీ ఇక లేరు

- శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరులో తుదిశ్వాస



తనకల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కు ఉద్యమకారుడు నరేంద్రసింగ్ బేడీ(87) ఇక లేరు. శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరులోని ఫామ్ హౌస్‌లో సోమవారం ఆయన తుదిశ్వాస విడిచారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఆయన 55 సంవత్సరాల క్రితం గుట్టూరులో యంగ్ ఇండియా సంస్థను స్థాపించారు. కరువు, పేదరికానికి నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. సుస్థిర, సేంద్రియ వ్యవసాయం, ఉపాధి కల్పన ద్వారా జిల్లాను అభివృద్ధి వైపు నడిపించారు. ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా పనిచేశారు. అసంఘటిత కార్మికులను సంఘటితం చేసి, ఎన్నో పోరాటాలను కొనసాగించారు. భూగరిష్ఠ పరిమితి చట్టం ద్వారా పేదలకు భూములు దక్కేలా చేశారు. తనకల్లు మండలంలో వందల ఎకరాలను పేదలకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించారు. ఉపాధి హామీ పథకం కోసం ఢిల్లీకి సైకిల్ యాత్ర చేశారు. ఆయన కృషితోనే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూపకల్పన జరిగింది. ఆయన అంత్యక్రియలు మంగళవారం గుట్టూరులో నిర్వహిస్తారు.

గీత దాటుతున్నారు... జాగ్రత్త

కొలికపూడికి టీడీపీ క్రమశిక్షణ సంఘం హెచ్చరిక



- తరచూ వివాదాల్లో చిక్కుకొంటున్నారు
- మీ తీరు పట్ల సీఎం అసంతృప్తితో ఉన్నారు
- అది మీకూ,పార్టీకీ మంచిది కాదు: సంఘ సభ్యులు
- నాపై దుష్ప్రచారం జరుగుతోంది: టీడీపీ ఎమ్మెల్యే

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "మీరు తరచూ వివాదాల్లో చిక్కుకొంటున్నారు. మిమ్మల్ని ఇప్పటికే రెండుసార్లు మా ముందుకు పిలవాల్సి వచ్చింది. మీ వ్యవహార శైలి పట్ల ముఖ్యమంత్రి కూడా అసంతృప్తితో ఉన్నారు. మీరు గీత దాటుతున్నారు....జాగ్రత్త" అని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం హెచ్చరించింది. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం ముందు ఎమ్మెల్యే కొలికపూడి హాజరయ్యారు. క్రమ శిక్షణ సంఘం సభ్యులు వర్ల రామయ్య, ఎంఎ షరీఫ్, కొనకళ్ల నారాయణ, బీసీ జనార్దనరెడ్డి, పంచుమర్తి అనురాధ ఈ విచారణలో పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని గోపాలపురం గ్రామంలో ఈ నెల పదకొండో తేదీన ఒక రోడ్డు వివాదంలో ఒక వ్యక్తిపై ఎమ్మెల్యే చేయి చేసుకొన్నారని, ఆ రోడ్డుపై ఉన్న కంచెను పీకివేశారని ఆరోపణలు వచ్చాయి. ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ ఆ వ్యక్తి భార్య పురుగులమందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారని కూడా వార్తలు వచ్చాయి. ఎమ్మెల్యే తీరుపై అదే రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన ఆదేశంతో పార్టీ క్రమ శిక్షణ సంఘం కొలికపూడిని తమ ముందుకు పిలిచింది. టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం, తాను ఏ తప్పూ చేయలేదని కొలికపూడి శ్రీనివాసరావు వాదించారు. ఆ మహిళ అసలు పురుగుల మందు తాగలేదని చెప్పారు. దీంతో క్రమశిక్షణ సంఘం సభ్యునిగా ఉన్న వర్ల రామయ్య అప్పటికప్పుడు పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఏం జరిగిందో తెలుసుకొన్నారు. ఆ మహిళ పురుగులమందు తాగిన విషయం వాస్తవమేనని, కానీ తక్కువ పరిమాణంలో తాగడంతో ప్రమాదం నుంచి బయటపడిందని పోలీసు అధికారులు చెప్పారు. తాను న్యాయంగానే వ్యవహరించానని, ఏ తప్పూ చేయలేదని పేర్కొంటూ ఎమ్మెల్యే కొన్ని రుజువులు ఈ సంఘానికి అందచేశారు. తన వాదనను వివరిస్తూ ఒక లేఖను కూడా ఆయన సమర్పించారు. క్రమశిక్షణ సంఘం ఈ ఒక్క అంశానికే పరిమితం కాకుండా ఎమ్మెల్యే తరచూ వివాదాల్లో చిక్కుకుంటుండడాన్ని ప్రస్తావించింది. "మీరు బాధ్యత కలిగిన ఎమ్మెల్యే. తరచూ మిమ్మల్ని ఏదో ఒక వివాదం చుట్టుముడుతోంది. ఇది మీకూ... పార్టీకీ మంచిది కాదు. సామాజిక వర్గాల అంశాలను బహిరంగంగా ప్రస్తావించి విమర్శలు చేయడం... చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనేలా ప్రవర్తించడం సరికాదు. మీ తీరు బాగోలేకపోవడం వల్లే క్రమశిక్షణ సంఘం ముందుకు వస్తున్నారు. ఈ పరిస్థితిని పదేపదే తెచ్చుకోవద్దు. గీత దాటవద్దు. క్రమ శిక్షణ పాటించండి. అందరినీ కలుపుకొని పోండి. వివాదాల వల్ల మంచి పేరు రాదు. పనితీరు వల్ల వస్తుంది. ఈ విషయం గుర్తించండి' అని సంఘం సభ్యులు ఆయనకు గట్టిగా చెప్పినట్లు సమాచారం.

వక్రీకరించి ప్రచారం చేశారు : కొలికపూడి

తన తప్పేమీ లేకపోయినా తనపై దుష్ప్రచారం జరుగుతోందని కొలికపూడి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. క్రమ శిక్షణ సంఘం ముందు హాజరైన తర్వాత ఆయన పార్టీ కార్యాలయం ఆవరణలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు గ్రామం అంతా వాడుకోవాల్సిన సిమెంట్ రోడ్డుపై కంచె వేసి ఆటంకాలు సృష్టించారు. ఈ వ్యక్తులు గత రెండు ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులపై దాడి చేశారు. ఒకసారి అధినేత చంద్రబాబు పర్యటనలో మంచినీళ్ల బాటిళ్లు విసిరారు. అటువంటి వ్యక్తులు అందరూ వాడుకోవాల్సిన రోడ్డుపై కంచె వేయడం సరికాదని, నేను దానిని తొలగించాను. ఆ రోడ్డు సవిష్టి వినియోగానికి సంబంధించిందని గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉంది. కంచె వేసిన వ్యక్తి కూడా వార్డు సభ్యుని హోదాలో దానిపై సంతకం చేశారు" అని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవచ్చా అన్న ప్రశ్నకు......తాను సదుద్దేశంతోనే ఆ పని చేశానని, కానీ సామాజిక మాధ్యమాల్లో తన చర్యను వక్రీకరిస్తూ ప్రచారం చేశారని ఆయన చెప్పారు. తాను ఈ సంఘటనలో తప్పేమీ చేయలేదని, అదే విషయం క్రమ శిక్షణ సంఘానికి చెప్పానన్నారు. పార్టీలో ఎవరైనా క్రమ శిక్షణ పాటించాల్సిందేనని, అదే విషయాన్ని ఎమ్మెల్యేకు చెప్పామని పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. 'ఎమ్మెల్యే పార్టీ గీత దాటుతున్నారని అనిపిస్తోంది. ముఖ్యమంత్రి కూడా ఆయన తీరు పట్ల అసంతృప్తితో ఉన్నారు. అదే విషయం ఆయనకు చెప్పాం. ఈ ఏడు నెలల్లో రెండుసార్లు ఆయన క్రమ శిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. ఇటువంటి పరిస్థితి పదేపదే తెచ్చుకోవద్దని సూచించాం. ఆయన కూడా అంగీకరించారు" అని రామయ్య వివరించారు. తమ నివేదికను పార్టీ అధిష్ఠానానికి వివరిస్తామని ఆయన తెలిపారు. వైసీపీ వాళ్లు కంచె వేయడం వల్లే తాను తొలగించాల్సి వచ్చిందని ఎమ్మెల్యే చెప్పారని, జాగ్రత్తగా ఉండాలని ఆయనకు సూచించామని మరో సభ్యుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మీడియాకు తెలిపారు.

అమరావతి 'పీఎంసీ'లకు టెండర్లు

- సంస్థలకు పనుల పర్యవేక్షణ బాధ్యత
- వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, కేఎఫ్‌డబ్ల్యూ హడ్కోనుంచి రూ.31 వేల కోట్ల రుణం
- రూ.20 వేల కోట్ల పనులకు టెండర్లు
- సీఆర్‌డీఏ కార్యాలయం, హ్యాపీనెస్ట్, ఎల్‌పీఎస్ వరదమళ్లింపు కాల్వల పనులకు శ్రీకారం

విజయవాడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో కీలక పనులకు ముందడుగు పడింది. రాష్ట్ర సచివాలయం, శాసన సభ, హైకోర్టు వంటి మెగా ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ త్వరలోనే శ్రీకారంచుట్టనుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ల(పీఎంసీ) నియామకానికి టెండర్లు ఆహ్వానించింది. ఇప్పటికే సచివాలయ టవర్లలో నీటి తోడివేత తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పీఎంసీలను నియమించనుంది. ఆయా ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి కీలక పనులు చేపట్టేందుకు ఈ పీఎంసీలు అంచనాలు రూపొందించనున్నాయి. వాటి ప్రకారం టెండర్లను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పనులకు కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేశాక క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ బాధ్యతలన్నింటినీ కూడా పీఎంసీలే నిర్వహించాల్సి ఉంటుంది.

పీఎంసీ టెండర్లు ఎందుకంటే

మరో రూ.11 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది. వీటిలో రాజధానిలో అత్యంత ప్రధానమైన సచివాలయ టవర్లు, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మిగిలి ఉంది. ఇవి భారీ ప్రాజెక్టులు కావటంతో ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్ల(పీఎంసీ)ను నియమించనున్నారు. ఈ పీఎంసీలు ఆయా పనులను పర్యవేక్షించడంతోపాటు అంచనాలను కూడా రూపొందించనున్నాయి. ఈ నియామకాలు పూర్తికాగానే సచివాలయ టవర్లు, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణాలకు కూడా టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

టెండర్ల జోష్

అమరావతి కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థల నుంచి రూ.31 వేల కోట్ల మేరకు రుణం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ రుణంలో ఇప్పటి వరకు రూ.20 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లను ఆహ్వానించారు. తొలుత సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం పనులతో ఈ టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. తర్వాత హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. అమరావతి రైతుల త్యాగాన్ని దృష్టిలో ఉంచుకుని ఎల్‌పీఎస్ ట్రంక్ ఇన్‌ఫ్రా పనులకు సీఆర్‌డీఏ పెద్దపీట వేసింది. పెద్ద ఎత్తున ఎల్‌పీఎస్ జోన్లలో రోడ్లు, డ్రెయిన్లు, నీటి పైపులైన్లు, సీవరేజీ, యుటిలిటీ డక్ట్స్ అవెన్యూ ప్లాంటేషన్ తదితర పనులు పెద్ద ఎత్తున చేపట్టేందుకు టెండర్లు పిలిచింది. జోన్-12, 12ఏ, 10, 2, 6, 2ఏ, 2బీ, 6, 1ఏ, 1బీ, 5బీలో ఈ పనులు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు పిలిచిన రూ.20 వేల కోట్ల టెండర్లలో సింహభాగం ఈ పనులే ఉన్నాయి. ఎల్‌పీఎస్ జోన్ల తర్వాత ప్రధానంగా అమరావతిలో వరద నివారణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. నీరుకొండ బ్యాలెన్స్ ఫ్లడ్ మిటిగేషన్ పనులు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ విస్తరణతో పాటు ఆధునికీకరణ పనులకు అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. వీటితోపాటు ఈ-8, 9, 14, 3, ఎన్-12, 6, 9 రోడ్లకు సంబంధించిన మౌలిక సదుపాయాల కోసం కూడా టెండర్లు పిలిచారు. దాదాపు మేజర్ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది.

సాయం పేరిట సైబర్ మోసం

- అనారోగ్య బాధితులే టార్గెట్
- ఆర్థికంగా ఆదుకుంటానంటూ రెమిటెన్స్ చార్జీల పేరిట వల
- సొమ్ములొచ్చాక సిమ్ మార్పిడి
- మంత్రి లోకేశ్ ఫొటోతో వాట్సాప్
- ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ కన్వీనర్ పేరుతో నమ్మించి మోసాలు
- పుట్టపర్తికి చెందిన రాజేశ్‌ను బెంగాల్‌లో అరెస్టు చేసిన సీఐడీ

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): "నేను టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్‌ని. మీ ఆసుపత్రి ఖర్చులకు సాయం చేస్తా. ముందు మీరు బ్యాంకు రెమిటెన్స్ చార్జీలను నాకు పంపితే, మీ అకౌంట్‌లో సొమ్ములు జమ చేస్తా" అంటూ వైద్య సహాయం పేరుతో నమ్మించి మోసాలకు పాల్పడుతున్న సైబర్ మోసగాడిని సీఐడీ అరెస్టు చేసింది. సత్యసాయి జిల్లా పుట్టపర్తి సమీపంలోని రాచువారిపల్లెకు చెందిన కొండూరు రాజేశ్ సైబర్ మోసాలకు పాల్పడుతున్నాడు. దీనిలో భాగంగా ఇటీవల కొత్త అవతారం ఎత్తి అమెరికా సిమ్ కార్డు కొనుగోలు చేసి వాట్సాప్ డిస్‌ప్లేలో మంత్రి నారా లోకేశ్ ఫొటో పెట్టాడు. అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని గుర్తించి.. "టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ తరఫున మీకు సాయం చేస్తాను. బ్యాంకు రెమిటెన్స్ చార్జీల కింద కొంత మొత్తం పంపండి" అని ఎర వేస్తాడు. రాజేశ్‌ను నమ్మి సొమ్ములు పంపించిన తర్వాత సదరు ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేస్తాడు. లేదా మరో సిమ్‌తో కొత్త వారిని వెతుక్కుంటాడు. ఇటీవల ఓ బాధితుడు సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన సీఐడీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తన బృందంతో 15 రోజుల పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో తిరిగి ఎట్టకేలకు పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో ఖరిబారి పోలీసు స్టేషన్ పరిధిలో నిందితుడిని అరెస్టు చేశారు. కొండూరు రాజేశ్ ఈ తరహా మోసాలతో 9 మంది నుంచి రూ.54.34 లక్షల మేరకు మోసం చేసినట్లు గుర్తించారు. రాజేశ్ మోసాలపై రాష్ట్రంలో 7, తెలంగాణలో 2, ఇతర ప్రాంతాల్లో మరో 2 కేసులు ఇప్పటికే నమోదు కాగా 1930 సైబర్ పోర్టల్‌లో 16 ఫిర్యాదులు అందినట్లు సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. గోవా, నేపాల్, అండమాన్ ఇలా పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ నిందితుడు జల్సాలు చేస్తుంటాడని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఏ విధమైన ఫోన్ కాల్ వచ్చినా వెంటనే సైబర్ పోలీసులకు తెలియజేయాలని, లేదా 1930 పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

29.39 లక్షల టన్నుల ధాన్యం సేకరణ: నాదెండ్ల

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 29,39,432 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ ధాన్యం విక్రయించిన 5,99,952 మంది రైతులకు 24 గంటల్లోపే రూ.5,878 కోట్లు చెల్లించామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం సేకరించి, సకాలంలో డబ్బులు చెల్లించకుండా రైతులను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందో అందరికీ తెలుసని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన రూ.1,674 కోట్లను కూడా తమ కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త పాలనలోకి...

అమెరికా అధ్యక్షుడుగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ ఓ వంద ఆదేశాలతో మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తన పాలనలో తీసుకున్న పలునిర్ణయాలను తిరగదోడబోతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలకు అనుగుణంగానూ, ఇంధనం, పర్యావరణమార్పు, వలసలు, పరిపాలన ఇత్యాది అంశాలతోనూ ముడివడిన ఈ ఆదేశాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరం లేదు. మరోపక్క, తాను అధికారంలోకి రాగానే శత్రుసంహారం తథ్యమని, తనకు వ్యతిరేకంగా వ్యవహరించినవారి సంగతితేల్చేస్తానని కొత్త అధ్యక్షుడు ప్రకటించిన నేపథ్యంలో, పదవిదిగే కొద్దిగంటల ముందు కూడా జోబైడెన్ తన విశేషాధికారాలను వినియోగించి ట్రంప్ వ్యతిరేకులు కొందరికి ముందస్తు క్షమాభిక్షలు ప్రకటించారు. కొవిడ్ కల్లోలకాలంలో అధ్యక్షుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిలబడిన అంటువ్యాధుల నిపుణుడు ఆంటోనీ ఫౌచీ వీరిలో ఒకరు. అజ్ఞానంతోనో, అహంకారంతోనో కరోనాకాలంలో ట్రంప్ చేసిన పలువ్యాఖ్యలు, ప్రతిపాదనలకు బుద్ధిగా తలాడించకుండా ధైర్యంగా ఎదురునిలిచి, ట్రంప్ వ్యతిరేకశక్తులకు ఈయన కేంద్రబిందువైన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రతీకారంనుంచి బైడెన్ ముందస్తుభద్రతను ప్రసాదించిన వారిలో క్యాపిటల్‌హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులు, వారిముందు సాక్ష్యం చెప్పిన కొందరు అధికారులు కూడా ఉన్నారు. కొత్త అధ్యక్షుడి మలిరాకడను మిగతాప్రపంచం కూడా అమితాసక్తితో, భయభక్తులతో గమనిస్తోంది.

ట్రంప్ ఏలుబడిలో అమెరికాకు అపారమైన నష్టం జరగబోతున్నదని, కుబేరులు, కులీనులు కట్టగట్టుకొని దేశాన్ని దోచేసుకుంటారని బైడెన్ తన వీడ్కోలు ప్రసంగంలో చాలా హెచ్చరికలే చేశారు. అమెరికాలో సామ్రాజ్యవాదం రూపుదిద్దుకుంటోందని, అతికొద్దిమంది కుబేరుల చేతుల్లోకి అధికారం పోయి, ఏ మాత్రం జవాబుదారీతనం లేని పాలనలో సామాన్య జనం గోసపడతారని ఆయన మాచెడ్డ బాధపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యకథనాలను వండివారుస్తారని, అమెరికా ప్రజలు తప్పుడుప్రచారాలకు బలి కావాల్సివస్తుందని, పత్రికాస్వేచ్ఛ క్షీణిస్తుందని హెచ్చరించారు. అడ్డుపడడం, ప్రశ్నించడం మరిచిపోకండన్న ఆయన హితవును అమెరికన్లు చెవినపెడతారో లేదో చూడాలి. ట్రంప్ అరాచకాలనుంచి దేశాన్ని రక్షించగలడని, మరోమారు డెమొక్రాటిక్ పార్టీని విజయపథంలో నడిపించగలడనీ నాలుగేళ్ళక్రితం జనం నమ్మి ఓటేసిన బైడెన్ ఇప్పుడు బలహీనుడుగా ముద్రపడి నిష్క్రమించాల్సి వస్తున్నది. ట్రంప్ పునరాగమనం ఒక సునామీ లాగా ఉంటుందని ఈయన ఊహించివుండడు. కమలాహ్యారిస్‌ను కాదని తానే పోటీచేసివుంటే అద్భుతంగా గెలిచేవాడినని గొప్పలకు పోతున్న బైడెన్‌కు ట్రంప్‌కు ఈ ఘనవిజయాన్ని చేజేతులా అందించింది తానేనని తెలియకపోదు. సమకాలికులు తనను కాదన్నప్పటికీ, చరిత్ర కచ్చితంగా తనకు జేజేలుపలుకుతుందని బైడెన్ చెప్పుకుంటున్నారు. అమెరికాను ఆయన ఏమేరకు ఉద్ధరించారో అక్కడి ప్రజలకు సంబంధించిన విషయం. కానీ, మిగతా ప్రపంచంతో ముడివడిన వ్యవహారాలమీద కూడా ఆయన తెలివైన నిర్ణయాలు చేసినట్టుగా కనబడదు. అఫ్ఘానిస్థాన్‌ను తాలిబాన్‌కు అప్పగించడం, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపలేకపోవడం, గాజాలో నెతన్యాహూ మారణకాండకు వత్తాసు పలకడం వంటి తప్పుడు పనులు ఆయన ఖాతాలో అనేకం ఉన్నాయి.

భారతదేశానికి సంబంధించినంతవరకూ బైడెన్ తన పదవీకాలంలో సానుకూలంగా ఉన్నమాట వాస్తవం. ట్రంప్‌తో మోదీ ఆలింగనాలు కానీ, ఆయన పక్షాన అమెరికాలో ఎన్నికల ప్రచారాలు కానీ బైడెన్‌ను ప్రభావితం చేయలేదు. ఉభయదేశాల భాగస్వామ్యం మరింత బలపడి విస్తరించింది. అనేక అంతర్జాతీయ కూటముల్లోనూ, వేదికల్లోనూ అమెరికా సరసన భారత్‌కు చోటు దక్కింది. బైడెన్ అంతటి భారత్ అనుకూల అమెరికా అధ్యక్షుడు ఇటీవలి కాలంలో ఎవరూలేరని విశ్లేషకులు అంటారు. అడపాదడపా గిల్లికజ్జాల అనుమానాలు ఉన్నప్పటికీ ట్రంప్ పునరాగమనం భారత్‌కు మేలుచేసేదే. ఎన్నికల ప్రచారంలో అమెరికన్లకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ట్రంప్ వ్యవహరించిన పక్షంలో సుంకాల పోరు, వీసాల బాధలు మనకు తప్పకపోవచ్చును. బైడెన్ మాదిరిగా చైనాతో కక్షగట్టి ట్రంప్ వ్యవహరించకపోవచ్చును కనుక, ఆ ప్రభావం కొంతమేరకు మనమీద పడవచ్చు. భారత్–అమెరికా సంబంధాలు అతివేగంగా అన్ని రంగాలకు విస్తరించి, ఆయుధవ్యాపారం నుంచి ఆలింగనాలవరకూ ఎదిగాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఎవరు పాలకుడైనా భారత్‌ను కాదనగలిగే స్థితిలో ఆ అగ్రరాజ్యం లేదు.

‘ప్రజాపంపిణీ’ని సంస్కరించాలి

చౌక ధరలకు నిత్యావసర సరకులను పేదలకు అందించడానికే ప్రజాపంపిణీ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఈ లక్ష్య సాధనకు దేశవ్యాప్తంగా చౌకధరల దుకాణాలు పనిచేస్తున్నాయి. భారత ప్రభుత్వం ఏర్పడ్డాక 1958లో రెండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రారంభించారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవస్థను దేశమంతటా వ్యాప్తి చేశాయి. కానీ ఆశించిన లక్ష్యం పూర్తిగా నెరవేరలేదని ఝార్ఖండ్ రైట్ టు ఫుడ్ నివేదిక వెల్లడి చేస్తున్నది. అక్కడికే ఇది పరిమితం కాదని ఒరిస్సా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పీడీఎస్ లబ్ధిదారులను రోల్స్ నుంచి గణనీయంగా తొలగించారని ఈ రెండు రాష్ట్రాల నివేదికల్లో బయటపడింది.

కోవిడ్ మహమ్మారి విలయతాండవం చేస్తున్న కాలంలో బిహార్‌లో ఆహార సరఫరా గొలుసు తెగిపోయింది. పట్నా జిల్లాలో అత్యంత పేదలైన ముషర్ గిరిజనులు రేషన్ అందక ఆకలితో విలవిల్లాడిపోయారు. అది మొదలు నేటి వరకు వారికి నెల నెలా రేషన్ అందక ఆకలితో అలమటిస్తున్నారు. అది చాలదన్నట్టు ముషార్ల రేషన్ కార్డులు చెల్లుబాటు కాకుండాపోయి తిండికి మొహం వాచిపోతున్నారు. ఒకవేళ చెల్లుబాటవుతున్నా కార్డుల్లో వారి కుటుంబ సభ్యుల పేర్లు గల్లంతై వారి బతుకులు మరింతగా సంకట స్థితిలోకి నెట్టివేయబడ్డాయి. వీటికి అదనంగా బయోమెట్రిక్ కష్టాలు వెంటాడుతున్నాయి.

ప్రజా పంపిణీ పేదలకు పట్టెడన్నం పెడుతున్నది. దీని ద్వారా 80 కోట్ల మందికి పైగా లబ్ధి పొందుతున్నారు. దేశంలోని 5 లక్షల 45 వేల చౌక దుకాణాల నుంచి బియ్యం, గోధుమ, పంచదారలు అమ్ముతున్నారు. కొన్నిచోట్ల కిరోసిన్ ఇస్తున్నారు. 1960లో 50 వేల చౌకధరల దుకాణాలు సేవలందించేవి. 2023 నాటికి అవి 5 లక్షల 45 వేలయ్యాయి. ఇంట్లో ఒక సభ్యునికి 5 కిలోల చొప్పున ఇచ్చే బియ్యం, గోధుమల్లో కొన్ని ఎలుకలు, పందికొక్కులు తినేస్తాయి. డిజిటల్ యుగంలో కూడా



తూకంలో మోసం జరుగుతూనే ఉంది. ఎవరైనా లబ్ధిదారులు అడిగితే సివిల్ సప్లైస్ వారు మాకు అలాగే ఇస్తారు. ఆ నష్టం మేం భరించాలా అని డీలర్లు గద్దిస్తారు. ఒక్కో కుటుంబానికి అర కిలో పంచదార ఇస్తారు. ఇది నెలకు కనీసం టీలోకైనా వస్తుందా? దాని రేటు మాత్రం బజారు ప్రైస్‌కు దగ్గరగా ఉంటుంది. పామొలిన్ నూనె పంపిణీ చరిత్రగా మిగిలింది. మార్కెట్‌లో బియ్యం, పప్పు, నూనె, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ధరల పెరుగుదలనే అర్థశాస్త్ర పరిభాషలో ద్రవ్యోల్బణం అంటారు. 2024 నవంబర్ నెలలో 9.04 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం కాస్త తగ్గిందని జాతీయ గణాంక విభాగం తెలిపింది. కానీ వంటనూనెల ధర ఈ పండగ వేళ గత మూడేళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉన్నదని సన్నాయి నొక్కులు నొక్కింది. ధరల పెరుగుదలతో వ్యాపారులకు, ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. పేదల నెత్తిన బండ పడుతుంది.

అల్పజీవుల ఆహార భద్రత కోసం ప్రజా పంపిణీ చాలా ముఖ్యం. ఇదొక ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమం. కానీ పేదల ఆహార అవసరాన్ని తీర్చేది మాత్రం కానే కాదు. మేలైన ప్రజాపంపిణీ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం వినియోగిస్తున్నది. రేషన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానించడం, లబ్ధిదారుల ఫోన్ నెంబర్ల సేకరణ... దీనిలో భాగమే. కానీ ప్రజా పంపిణీ సరుకుల స్మగ్లింగ్ యథేచ్ఛగా జరుగుతున్నదని ఎప్పటికప్పుడు మీడియాలో వార్తలు వస్తూనే ఉన్నాయి. దీనిపై అధికార ప్రతిపక్షాల మాటల యుద్ధం మామూలే. సరుకులు ఇచ్చే డిపోలు ప్రజలకు దగ్గరగా లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ డిపోలు నెలలో ఎక్కువ రోజులు తెరిస్తే పేదలు సరుకులు కొనుక్కొనేందుకు వీలౌతుంది. ఉపాధి లేమి, అవిద్య, ఇంటి అవసరాలతో దేశంలో కార్మికుల వలసలు పెరుగుతున్నాయి. వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ సులభం చేయాలి. నెల రోజులలోనే వాటిని మంజూరు చేయాలి.

చౌకధరల డిపోల్లో కోడిగుడ్లు, పప్పులు, వంటనూనెలు, చిరుధాన్యాలు తక్కువ ధరలకే అందించడం అత్యంత అవసరం. ఎందుకంటే దేశ కార్మిక శక్తి నానాటికీ కునారిల్లి, పని నుంచి వైదొలుగుతున్నారు. దేశంలో పనిచేయగల వయసు వారిలో నూటికి 46 మందే పని చేస్తున్నారని ఐఎల్ఓ సర్వే వెల్లడి చేసింది. కారణం ఏమంటే మంచి తిండి లేక, శారీరక బలం లేని స్థితిలో ఉండటమేనని చెప్పింది. ప్రజా పంపిణీపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలి. ఈ వ్యవస్థను సంస్కరించి, పటిష్టపరిస్తేనే దేశం వికాసం వైపు పయనిస్తుంది.

– వి. వరదరాజు, శ్రీకాకుళం


మారాల్సింది జనమే!

గత కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్ళీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాలనే పట్టించుకుంటూ రాజకీయాలను విస్మరిస్తున్నారని ఇంటాబయటా విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రాజకీయంగా అప్రమత్తంగా లేకుంటే మళ్ళీ విధ్వంసకర నైజమున్న జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తాడేమోనని ప్రగతిశీల శక్తులు, వ్యక్తులు మథనపడుతున్నారు. అధికారం దన్నుతో సంకుచిత రాజకీయాలకు పాల్పడుతూ ప్రత్యర్థులను అప్రజాస్వామికంగా అంతం చేయాలనే వైఖరి లేకపోవడం చంద్రబాబు తప్పిదమా? అదే వారి నైజమైతే అటువంటి ముఖ్యమంత్రి దక్కినందుకు మనం గర్వపడాలి. జగన్ పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనక్కు వెళ్లిన సంగతి విదితమే. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దూరదృష్టితో రాష్ట్రంలో సంపద పెంచడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అత్యవసరం. సుస్థిరాభివృద్ధి దిశగా పయనించాలి. పేదరికం లేని సమాజమే తన లక్ష్యమని చంద్రబాబు ఎన్నోసార్లు ప్రకటించారు. ఆ దిశగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి మద్దతివ్వడం రాష్ట్ర ప్రజల బాధ్యత కూడా. అసలు జగన్‌కి మద్దతు ఇచ్చే వర్గాలేవీ? వారు నిజాలను ఎందుకు చూడలేకపోతున్నారు? ఎందుకంత సంకుచిత, ప్రగతి వ్యతిరేక దృక్పథంతో స్వీయ నాశనాన్ని కూడా లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారు? రాష్ట్రంలోని ప్రగతిశీల శక్తులు, వ్యక్తులు ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొని, పరిష్కారం దిశగా కృషి చేయాలి. జగన్ లాంటి ప్రగతి వ్యతిరేక శక్తిని రాజకీయ రంగం నుంచి తొలగించే బాధ్యతను చంద్రబాబు మీదే పూర్తిగా వదిలేయకుండా, రాష్ట్రంలోని ప్రగతిశీల శక్తులన్నీ బాధ్యతను పంచుకోవాలి. జగన్‌కి మద్దతిచ్చే వర్గాల్లో గుణాత్మకమైన మార్పును తీసుకువచ్చేలా కృషిచేయాలి. ఆ మార్పు వస్తే, ఈ ప్రగతి వ్యతిరేక శక్తి దానికదే నిర్వీర్యమైపోతుంది. కాబట్టి మారాల్సింది చంద్రబాబు కాదు, ప్రజలే. ప్రగతి వ్యతిరేక శక్తులకు మద్దతిచ్చే జనమే.

– గౌరాబత్తిన కుమార్‌బాబు

యూజీసీ సంస్కరణల మంచీచెడూ!

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి ‘కనీస బోధనా ప్రమాణాల’ ముసాయిదా నిబంధనలు –2024ను తీసుకువచ్చింది. విద్యార్థులకు విద్యా సంబంధమైన విషయాల పట్ల మరింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించడం, నిబంధనలను సరళతరం చేయడం, ఏకరీతిగల విద్యా ప్రమాణాలు తీసుకురావడం, దేశీయ ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలతో అనుసంధానం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో ఈ నిబంధనలు రూపొందించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్, డీమ్డ్ ఉన్నత విద్యా సంస్థలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. దేశీయ ఉన్నత విద్యా సంస్థలు ఏ మేరకు ఈ సంస్కరణలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయో, వాటివల్ల ఒనగూరే ప్రయోజనాలు, సవాళ్ళు ఏమిటో ఇప్పుడు పరిశీలించాల్సి ఉంది.



సమర్థత గల విద్యా సంస్థల కోసం ప్రతిపాదించిన ‘ద్వివార్షిక ప్రవేశాలు’, విద్యార్థులకు సంవత్సరానికి రెండుసార్లు విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశాన్ని కల్పిస్తాయి. విద్యాసంస్థలలో పరీక్షల ఆలస్యం వలన గాని, వ్యక్తిగత, మరే ఇతర కారణాల వలన గాని ఏ విద్యార్థి అయినా విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రవేశం పొందలేకపోతే అలాంటి వారికి ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుంది. దేశీయ ఉన్నత విద్యాసంస్థలలోకి విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి, తద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించడానికి ఈ చర్య ఉపయోగపడడమే గాక దేశీయ ఉన్నత విద్యాసంస్థలు మెరుగైన గ్లోబల్ ర్యాంకులు సాధించడంలో తోడ్పడుతుంది. అయితే ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు లేక సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఈ విధానం ఏ విధంగానూ ఉపయోగం కాదు అనే విమర్శ కూడా ఉంది. ముఖ్యంగా అధ్యాపకుల పైన మరింత భారం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదించిన ‘వికేంద్రిత విద్యార్థి హాజరు విధానం’ వల్ల ఉన్నత విద్యా సంస్థలు వారు అందించే ప్రోగ్రాముల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల హాజరు విధానాలు నిర్ణయించుకునే స్వావలంబనను పొందుతాయి. ఈ విధానం వ్యక్తిగత హాజరు కంటే అభ్యాస ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచడంలో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన వినూత్నమైన బోధన విధానాలకు వెసులుబాటు కల్పిస్తుంది. అంతేగాక, ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ వంటి ప్రత్యామ్నాయ అభ్యాస పద్ధతులకు పెద్దపీట వేస్తుంది. అయితే, ఈ విధానం వల్ల విద్యా సంస్థల హాజరు విధానాల మధ్య సారూప్యత కొరవడి, విద్యార్థులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు గందరగోళానికి గురయ్యే అవకాశమూ ఉంది. విద్యాసంస్థలు హాజరు విధానాలు అతిసులభతరంగానో లేదా బాగా కఠినంగానో రూపొందించి ఆ విధంగా విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే అవకాశం ఉంది. హాజరుకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల అభ్యాసం, క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదిత ‘బహుళ ప్రవేశ, నిష్క్రమణ విధానం’ విద్యార్థులకు నిర్దిష్ట దశల వద్ద (సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ) ఒక ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కల్పించడమే గాక, వారి వ్యక్తిగత, ఆర్థిక, లేదా వృత్తిపరమైన అవసరాలను పూర్తి చేసుకున్న తరువాత కాలంలో తిరిగి ఆయా ప్రోగ్రాముల్లో ప్రవేశించేందుకు కూడా వీలు కల్పిస్తుంది. ఈ విధానం నిరంతర విద్యను ప్రోత్సహిస్తుంది. ఇది ముఖ్యంగా కార్మిక, పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనకరం. అయితే క్రెడిట్ బదిలీల నిర్వహణ, వివరమైన విద్యార్థి సంబంధిత రికార్డులను నిర్వహించడం, పాఠ్యాంశాలు ఏకరీతిని కొనసాగించడం వంటి అంశాలు పాలనా భారాన్ని పెంచుతాయి. గ్యాప్ తరువాత విద్యార్థులను తిరిగి సంఘటితం చేయడం కష్టం కావచ్చు. దీనికి సరిపోయే సరిసమాన కోర్సులు, మరీ ముఖ్యంగా నిష్ణాతులైన అధ్యాపకులను సమకూర్చుకోవడం తలకు మించిన భారం కాగలదు.

‘భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు’ ప్రవేశపెట్టాలన్న యూజీసీ ప్రతిపాదనను ఓ ప్రగతిశీల చర్యగా చెప్పవచ్చును. మూడు నుంచి నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, ఒకటి నుంచి రెండేళ్ళ పీజీ ప్రోగ్రాములను అందించడం ద్వారా, విద్యార్థుల విభిన్న అకడమిక్, ప్రొఫెషనల్, వ్యక్తిగత లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో, విద్యార్థుల విదేశీ కలలను సాకారం చేయడంలో ఉపయోగపడతాయి. అంతేగాక, ఒక సంవత్సరపు పీజీ ప్రోగ్రాములు త్వరగా ఉద్యోగం కావాలనుకునే వారికి ఉపయుక్తంగా ఉంటాయి. ఈ విధానం విద్యార్థులు స్పెషలైజేషన్ ఎంచుకోవడంలో, బహుళశాస్త్ర విద్యాభ్యాసం చేయడంలో, పరిశోధనా అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సహాయపడతాయి. అంతేగాక వృత్తి నిపుణులు, పార్ట్ టైం విద్యార్థుల వైవిధ్యమైన అవసరాలు తీర్చడంలో ఈ విధానం ఉపయోగపడుతుంది. అయితే, ఈ భిన్న వ్యవధులు గల డిగ్రీల ఉపయుక్తత ఎంత అన్నదానిపై పలు సందేహాలు ఉన్నాయి. తక్కువ వ్యవధి ప్రోగ్రాములు తక్కువ కఠినంగా కనిపించవచ్చు, ప్రత్యేకంగా ఆర్థిక లేదా వ్యక్తిగత కారణాల వల్ల వాటిని ఎంచుకున్న విద్యార్థులకు నష్టాన్ని కలిగించవచ్చు. భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు ప్రారంభించడానికి ముందు తగిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. సిలబస్ తయారు చేయడంతో పాటు, క్రెడిట్స్ వ్యవస్థను రూపొందించడం, అధ్యాపకుల పని భారం సర్దుబాటు చేయడం జరగాలి.

ఏ విద్యార్థి ఐనా ‘ఏక కాలంలో రెండు యూజీ లేదా పీజీ డిగ్రీలు’ చదివే సదవకాశాన్ని యూజీసీ ప్రతిపాదించింది. ఈ విధానం బహుళ శాస్త్రాలు, నైపుణ్యాలను కలుపుకుంటూ, విద్యార్థుల జ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచుతుంది. గ్రామీణ, దూర ప్రాంతాల విద్యార్థులకు, పని చేసుకుంటూ చదువుకునే వారికి ఇది అత్యంత ఉపయోగకరం. అయితే, రెండు డిగ్రీలు ఏక కాలంలో చేయడం వల్ల విద్యార్థి ఏ డిగ్రీలోనూ సమగ్రమైన విజ్ఞానాన్ని, కావలసిన నైపుణ్యాన్ని సంపాదించడం సాధ్యంకాకపోవచ్చును. విద్యాసంస్థల నిర్వాహకులకు ఈ విధానం అమలు పెను సవాలుగా మారే ప్రమాదం ఉంది.

ఒక ప్రోగ్రామ్ ప్రధాన సబ్జెక్టులో 50శాతం క్రెడిట్లను సంపాదించడం విద్యార్థులకు తప్పనిసరి చేస్తూ, మిగిలిన క్రెడిట్లను నైపుణ్య కోర్సులు, అప్రెంటిషిప్, శిక్షణ, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడానికి అనుమతించే ఈ యూజీసీ ప్రతిపాదన సరళమైన విద్యా లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ప్రతిపాదన, విభాగ నైపుణ్యంతోపాటు అంతర శాఖా విద్యనూ సమతుల్యం చేస్తూ, విద్యార్థులకు సమగ్రమైన జ్ఞానంతో పాటు, విస్తృత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వీలు కల్పిస్తుంది. అయితే, ప్రధాన విభాగంలో క్రెడిట్లను 50 శాతానికి పరిమితం చేయడం, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి రంగాల్లో నైపుణ్యతను తగ్గించే అవకాశం ఉంది. ఇటువంటి సరళమైన విధానాన్ని అమలుచేయడం కోసం మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల శిక్షణ, పరిశ్రమ సహకారంలో గణనీయమైన పెట్టుబడులు అవసరం. విద్యా సంస్థల మధ్య ఏకరీతిన నాణ్యత, ప్రాముఖ్యతను నిర్ధారించడం, క్రెడిట్ బదిలీలను నిర్వహణ, పాఠ్య ప్రణాళిక అనుసంధానం పెనుసవాళ్లుగా మారతాయి.

యూజీసీ ప్రతిపాదించిన ఈ ప్రగతిశీల సంస్కరణలు నిస్తేజంగా ఉన్న దేశీయ ఉన్నత విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఉన్నత విద్యలో మౌలిక వసతులను అభివృద్ధి చేయకుండా, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచకుండా, పరిశ్రమకు కావలసిన అంతర్జాతీయ ప్రమాణాల కరికులమ్‌ను అభివృద్ధి చేయకుండా, నూతన ఆవిష్కరణలకు దిశానిర్దేశం లేకుండా, ఇటువంటి సంస్కరణలు ఎన్ని తీసుకువచ్చినా తర్వాత సవాళ్ళను అధిగమించడం కష్టమవుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

akbar

> యూజీసీ ప్రతిపాదించిన ప్రగతిశీల సంస్కరణలు నిస్తేజంగా ఉన్న దేశీయ ఉన్నత విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఉన్నత విద్యలో మౌలిక వసతులను అభివృద్ధి చేయకుండా, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచకుండా, పరిశ్రమకు కావలసిన అంతర్జాతీయ ప్రమాణాల కరికులమ్‌ను అభివృద్ధి చేయకుండా, నూతన ఆవిష్కరణలకు దిశానిర్దేశం లేకుండా, ఇటువంటి సంస్కరణలు ఎన్ని తీసుకువచ్చినా తర్వాత సవాళ్ళను అధిగమించడం కష్టమవుతుంది.

• ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు
మెంబర్ సెక్రటరీ & సీఈఓ
ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ,
పర్యవేక్షణ కమిషన్

అద్దె భవనాలతో ఖజానాకు నష్టం

గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగించి, రాష్ట్ర ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం కలిగించింది గత ప్రభుత్వం. ముఖ్యంగా రాష్ట్రం నడిబొడ్డున ఉండవలసిన లోకాయుక్త కార్యాలయాన్ని కర్నూలులోని అద్దె భవనంలో పెట్టారు. నెలకు ఆరేడు లక్షలు అద్దె చెల్లిస్తున్నారు. అయితే ఆరు నెలల నుండి అద్దె చెల్లించని కారణంగా, ముందుగా అద్దె బాకీ అంతా చెల్లించి బిల్డింగు ఖాళీ చేయమంటున్నాడు యజమాని. లోకాయుక్త కార్యాలయానికి శ్రీకాకుళం లేదా విశాఖ పట్నం నుంచి రావాలంటే ఒకరోజు ముందుగా బయలుదేరాలి. కర్నూలుకు రైలు మార్గం లేదు. అమరావతి అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమాన దూరం అవుతుంది. అలాగే మంగళగిరిలోని ఆర్టీఐ భవనం, ఇంకా ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనంలోనే ఉన్నాయి. వాటిని కూడా అమరావతికి మారిస్తే లక్షలాది రూపాయల అద్దె మిగులుతుంది. అసలే అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి కొంత ఊరట కలుగుతుంది. ఈ విషయమై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com

భావవిప్లవంతోనే సమాజాభ్యుదయం

భావ విప్లవమంటే ఏమిటి? దాన్ని సాధించడమెలా? భావవిప్లవాల ఆవశ్యకత ఏమిటి? భారతదేశంలో భావవిప్లవం విజయం సాధించలేకపోవడానికి కారణమేమిటి? వంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే రావిపూడి వెంకటాద్రి సృష్టించిన హేతువాద, మానవవాద భావవిప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి.

హేతువాదం, నాస్తికత్వం, భౌతికవాదం, భావవాదం, గతితార్కిక భౌతికవాదం, భౌతిక వాస్తవికవాదం, మానవతావాదం, మానవవాదం వంటి అనేక తాత్వికవాదాల మధ్య గల భేదాలను, సామ్యాలను, పరిధులను విశ్లేషించి, వివరించిన సాహిత్యం రావిపూడిది. ఇటువంటి భావవిప్లవ సాహిత్యం దేశంలోని మరే భాషలోనూ లభించకపోవడం గమనార్హం. తెలుగులో ఇటువంటి అపూర్వమైన, అపురూపమైన సమగ్ర భావవిప్లవ సాహిత్యాన్ని సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుంది.

ఇంతకాలం విప్లవమంటే హింసతో కూడిన సాయుధ పోరాటాల ద్వారా, రక్తపాతంతో కూడిన యుద్ధాల ద్వారా రాజకీయాధికారాన్ని కైవసం చేసుకోవడమని భావించారు. ఇప్పటికీ ఇంకా అలా భావించేవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఆరు దశాబ్దాలు గడుస్తున్నా వర్గ పోరాటాల పేరుతో కమ్యూనిస్టు విప్లవగ్రూపులు ఇంకా సాయుధ పోరాటాలను కొనసాగిస్తుండడాన్ని మనం చూస్తున్నాం. వారి లక్ష్యాన్ని, నిజాయితీని ఎవరూ శంకించలేరు. కాని వారి మార్గం మాత్రం సరైనది కాదని రుజువైంది. అందువల్ల వాస్తవాలను గుర్తించి మార్గాంతరాల కోసం అన్వేషించాలి.

అటువంటి అన్వేషణల ఫలితమే భావవిప్లవ మార్గమని గుర్తించాలి. సుప్రసిద్ధ మానవవాద తత్త్వవేత్త ఎంఎన్ రాయ్ 1936లో జైలు నుంచి విడుదలయిన వెంటనే ఒక ముఖ్యమైన ప్రకటన చేశాడు. విలువైన ఏ సామాజిక విప్లవానికైనా ముందుగా తాత్వికవిప్లవం తప్పనిసరిగా ఉండాలనేదే ఆ ప్రకటన సారాంశం. జైలులో ఉన్న కాలంలో ఐదున్నర సంవత్సరాలు అతడు ప్రపంచ చరిత్రను లోతుగా అధ్యయనం చేశాడు. దాని ఫలితంగానే చారిత్రాత్మకమైన రాజకీయ, సామాజిక సంఘటనలకు ముందుగా భావోద్యమాలు చోటుచేసుకోవాలనే నిర్ణయానికొచ్చాడు. ఆచరణకు ముందు ఆలోచన ఉంటుంది కాబట్టి సామాజిక, ఆర్థిక విప్లవానికి చోదకశక్తిగా భావ విప్లవం ఉండాలని ఆయన తీర్మానించాడు.

ప్రపంచంలో ఇప్పటివరకు సంభవించి, విజయవంతమైన భావ విప్లవాలు ప్రధానంగా రెండు కనిపిస్తున్నాయి. మొదటిది–సామాన్యశకానికి పూర్వం ఐదారు శతాబ్దాలలో భారతదేశంలో బయలుదేరి వర్ధిల్లిన బౌద్ధభావ విప్లవోద్యమం. రెండవది–సామాన్యశకం, 15–16 శతాబ్దాలలో ఐరోపాలో విజయవంతమైన భావ పునర్వికాసోద్యమం. దానినే రినైజాన్స్ ఉద్యమంగా చరిత్ర నమోదు చేసింది.

ఆ రెండు భావవిప్లవోద్యమాలు సాధించిన విజయాలు సామాన్యమైనవి కావు. బౌద్ధం వేదమతం సృష్టించిన అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసింది. అసత్యాలను, అన్యాయాలను ఖండించింది. వర్ణ వ్యవస్థ సృష్టించిన అసమానతలను చీల్చిచెండాడింది. సమతా ధర్మాన్ని స్థాపించింది. హింసోన్మాదాల స్థానంలో అహింస, శాంతి, కరుణ, ప్రేమ వంటి ఉన్నతాదర్శాలను నెలకొల్పింది. ప్రపంచానికే ఆదర్శప్రాయమైన ధర్మంగా బౌద్ధం దాదాపు వెయ్యేళ్లు వర్ధిల్లి ప్రపంచ దేశాలకు విస్తరించింది.

రినైజాన్స్ ఉద్యమం వల్ల బైబిలు వంటి క్రైస్తవ మతగ్రంథాల లోని అసత్యాలు, అభూతకల్పనల బండారం బయటపడింది. రాజులు దైవాంశసంభూతులనే భ్రమలు తొలగిపోయాయి. శాస్త్రం, కళలు, అభివృద్ధి చెందడానికి ఆస్కారమేర్పడింది. భూకేంద్ర సిద్ధాంతం తప్పని రుజువైంది. దాని స్థానంలో సూర్యకేంద్ర సిద్ధాంతం కోపర్నికస్ ద్వారా రుజువైంది. పారిశ్రామిక విప్లవానికి బాటలు ఏర్పడ్డాయి. రాజరికాలు అంతమై ప్రజాస్వామ్య ప్రభుత్వాలు రూపొందడానికి మార్గాలు సుగమమైనాయి.

భారతదేశంలో పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. భిన్న మతాలకు, భిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో శాంతి సహనాలు క్రమంగా కనుమరుగైపోయి భిన్నమతస్తుల సహజీవనం ప్రశ్నార్థకంగా మారిపోతోంది. మెజారిటీ మతాల పాలకవర్గాలు మైనారిటీ మతాల ప్రజల మీద భౌతికదాడులకు పాల్పడుతున్నాయి. వారిమీద పగ, ద్వేషాన్ని పెంచుతున్నాయి. తద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నాయి.

భారతదేశంలో సామాజిక వాతావరణం పూర్తిగా పౌరాణిక సంస్కృతిలో కూరుకుపోయింది. అశాస్త్రీయ భావాలకు, అంధవిశ్వాసాలకు నిలయంగా మారిపోయింది. ఇక్కడ మనుషులకంటే కుల మతాలదే పైచేయిగా ఉంది. చారిత్రక వాస్తవాల కంటె పౌరాణిక కల్పనలదే పైచేయిగా ఉంది. శాస్త్రీయ సత్యాలకంటె అశాస్త్రీయమైన అంధవిశ్వాసాలదే పైచేయిగా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశం మూఢవిశ్వాసాలలో ప్రపంచంలోనే ప్రథమస్థానంలో కొనసాగుతున్నట్లుంది.

నిజం ముసుగేసుకున్న అబద్ధాలు నిరంతరం ప్రజల్ని ప్రభావితం చేస్తూ వంచిస్తూనే ఉన్నాయి. ఆధునిక విజ్ఞానం ఆవిష్కరిస్తున్న నూతన సత్యాలన్నీ తమ మతగ్రంథాల్లోనే ఉన్నాయని హిందువులు వేదాలను, ముస్లింలు ఖురాన్‌ను, క్రైస్తవులు బైబిల్‌ను విజ్ఞాన భాండాగారాలుగా చూపడానికి విఫలయత్నం చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని మించిన ధర్మం లేదని జోరుగా విషప్రచారం చేస్తున్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా పాలకవర్గాల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయి, వారికి వత్తాసు పలుకుతున్నాయి. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు నిండుతున్నాయి. పాలకవర్గాలు అధికారం అండతో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడానికి కుటిలయత్నాలు ఆరంభించాయి. రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షించుకోవాలనేదే పెద్ద సమస్యగా మారింది. ఇటువంటి సమస్యలన్నిటికీ సమాధానంగా భావవిప్లవాల వైపు చూడవలసి ఉంటుంది.

చరిత్రలో చాలా మంది మతాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాడినవారున్నారు. ఆ క్రమంలో అనేక కష్టనష్టాలను అనుభవించినవారు, సాంఘిక బహిష్కరణలకు గురైనవారు, జైలుశిక్షలు అనుభవించినవారు, ప్రాణాలను పోగొట్టుకున్నవారున్నారు. వారి లక్ష్యం ఒక్కటే మనిషిని అసత్యం నుంచి సత్యానికీ, అవివేకం నుంచి వివేకానికీ, క్రౌర్యం నుంచి మానవతకీ, నిర్బంధం నుంచి స్వేచ్ఛకీ మారమని విన్నవించడమేనని వెంకటాద్రి తన రచనల ద్వారా స్పష్టం చేశారు. భ్రష్టుపట్టిన రాజకీయాలు భావోద్యమాలను సైతం భ్రష్టుపట్టిస్తున్నాయి. ఇప్పుడు భారతదేశంలో అన్ని రంగాలలోను అవ్యవస్థ నెలకొంది. దీని నుంచి ఫాసిజం పుడుతుందని రావిపూడి పేర్కొన్నారు.

పూర్వం మనిషి మతానికొక్కదానికే బానిస. ఇప్పుడు రాజకీయ పార్టీలకు కూడా బానిస. రాజకీయ నాయకులు, అనుచరులు మానవ జీవితసర్వస్వాన్నీ రాజకీయమయం చేశారు, రాజకీయాధీనం చేశారని రావిపూడి వెంకటాద్రి విశ్లేషించి, వివరించారు. మనకు అనేక చట్టాలున్నాయి. అవినీతి వ్యతిరేకచట్టం ఉంది, అయినా అవినీతి కొనసాగుతోంది. అలాగే వ్యభిచార చట్టం ఉంది, అయినా వ్యభిచారం అభివృద్ధి చెందుతూ మగువలను వ్యాపార వస్తువులుగా మార్చివేస్తోంది. ఇంకా వరకట్న నిషేధ చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలకార్మికుల నిషేధ చట్టం వంటివి వందల సంఖ్యలో ఉన్నాయి. అవేవీ సరిగా అమలు కావడం లేదు. ఎందువల్ల? చట్టాలు మారినా, పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, శ్రమదోపిడీ కొనసాగుతూనే ఉన్నాయి. వీటికి ముగింపు పలకాలంటే ముందుగా ప్రజల భావాల్లో సరైన మార్పు రావాలి. తాత్విక భావాల మార్పుతోనే అది ప్రారంభం కావాలి. ఆధునిక విజ్ఞానం వెలుగులో అది కొనసాగాలి.

> మనకు అనేక చట్టాలున్నాయి. అవేవీ సరిగా అమలుకావడం లేదు. ఎందువల్ల? చట్టాలు మారినా, పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, శ్రమదోపిడీ కొనసాగుతూనే ఉన్నాయి. వీటికి ముగింపు పలకాలంటే ముందుగా ప్రజల భావాల్లో సరైన మార్పు రావాలి. తాత్విక భావాల మార్పుతోనే అది ప్రారంభం కావాలి. ఆధునిక విజ్ఞానం వెలుగులో అది కొనసాగాలి. ఈ దిశగా తెలుగునాట కృషి చేసిన ఆలోచనాపరులలో అగ్రగణ్యుడు రావిపూడి వెంకటాద్రి.



అందుకే అన్ని సామాజిక ఉద్యమాలకు మూలమైన హేతువాద, మానవవాద ఉద్యమాలు బలం పుంజుకోవాలి. యుద్ధరంగంలో సైనికులు ఏ విధంగా క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పోరాడుతారో అదే స్ఫూర్తితో భావవిప్లవ పోరాటం కొనసాగాలి. ఇది సుదీర్ఘమైనది, దీనికి అడ్డదారులు లేవు. భావవిప్లవ పోరాటయోధుడిగా 101 సంవత్సరాలు జీవించి, వంద గ్రంథాలు రచించి భావవిప్లవ సారథిగా రావిపూడి వెంకటాద్రి చరిత్రలో నిలిచిపోయాడు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి.

◆ గుమ్మా వీరన్న
అధ్యక్షులు, భారత హేతువాద సంఘం

(నేడు రావిపూడి వెంకటాద్రి వర్ధంతి. ఇంకొల్లులోని రాడికల్ హ్యూమనిస్టు భవనంలో సంస్మరణ సభ.)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025

అయినను వెళ్లవలె..


రైల్వేస్టేషన్‌లో రద్దీ

పండుగ సెలవులు ముగిసి, పాఠశాలలు, కళాశాలలు, ఆఫీసులు తెరుచుకున్నా.. ఇంకా ప్రయాణికుల రద్దీ తగ్గలేదు. సోమవారం అయితే, పండిట్ నెహ్రూ బస్టాండ్‌తో పాటు రైల్వేస్టేషన్ ఇసకేస్తే రాలనంత జనంతో కిటకిటలాడాయి. సాధారణ రైళ్లు, బస్సులతో పాటు పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని వేసిన స్పెషల్స్ కూడా కిక్కిరిసి నడిచాయి.


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న పండిట్ నెహ్రూ బస్టాండ్

జీవాన్ని.. పానికిపుచ్చుకుని..



ఖండాంతరాల ఖ్యాతి పొందిన మన కొండపల్లి బొమ్మ

కష్టాలు తీర్చేందుకు ముందుకొచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం

తెల్లపానికి కలప కొరత తీర్చేందుకు చర్యలు

కంటికి ఆనందం.. మనసుకు ఆహ్లాదం కలిగించే సౌందర్యం ఆ బొమ్మల సొంతం. చెక్క, ప్రకృతి సిద్ధమైన రంగులు, సాటి లేని సృజనాత్మకతే వాటి తయారీకి ముడి సరుకు. సహజత్వం, రాజసం, దర్పానికి ప్రతీకగా నిలుస్తూ శతాబ్దాలుగా తెలుగు సంస్కృతికి అద్దం పడుతున్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ నానాటికీ వన్నెలద్దుకుంటూ ఖండాంతరాలు దాటిన కొండపల్లి బొమ్మల పరిశ్రమకు చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెటింగ్ అంశాలపై దృష్టి సారించింది. కళాకారులకు భరోసాగా నిలుస్తోంది.

8లో

కొలికపూడి కథ.. కొలిక్కివచ్చేనా..?

'రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయి.' అన్న నానుడి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వర్తిస్తుందేమో..! వివాదాస్పద ఘటనల నేపథ్యంలో సోమవారం రెండోసారి ఆయన టీడీపీ విచారణ కమిటీ ముందు హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. పదేపదే ఆయన వివాదాల్లో చిక్కుకుంటుండటం, దుందుడుకుతనంతో వ్యవహరించడం, ఓ ప్రజాప్రతినిధిగా ఉండి అధికారుల మాదిరిగా ప్రవర్తిస్తుండటం కూడా అటు నియోజకవర్గ ప్రజలతో పాటు ఇటు టీడీపీ అధిష్ఠానానికి కూడా తలనొప్పిగా మారాయి. రెండుసార్లు కమిటీకి వివరణ ఇచ్చుకున్న ఆయన ఈసారైనా జాగ్రత్తగా ఉంటారా, లేదా అనే విషయం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

టీడీపీ క్రమశిక్షణా కమిటీ ముందుకు రెండోసారి కొలికపూడి

ఉమ్మడి కృష్ణాలోనే గతంలో ఎప్పుడూ లేని సంఘటన

- ప్రజాప్రతినిధిగా పరిధి దాటి దుందుడుకు ప్రవర్తన
- వరుస వివాదాలతో సొంత పార్టీలోనే రచ్చ
- విమర్శలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి
- భయభ్రాంతులకు గురవుతున్న తిరువూరు వాసులు
- ఇకనైనా మార్పు వచ్చేనో లేదోనన్న వాదనలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓ ఎమ్మెల్యేగా ఉండి టీడీపీ క్రమశిక్షణా కమిటీ ముందు రెండుసార్లు విచారణకు హాజరైన ఏకైక వ్యక్తిగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నిలిచారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంతకు ముందెప్పుడూ ఏ ఎమ్మెల్యే కూడా ఇలా క్రమశిక్షణా కమిటీ ముందు హాజరైన దాఖలాలు లేవు. గతంలో దేవినేని ఉమామహేశ్వరరావు, వల్లభనేని వంశీ మధ్య వివాదం తలెత్తినపుడు మాత్రమే ఒకసారి టీడీపీ క్రమశిక్షణా సంఘం జోక్యం చేసుకుంది. అయితే, అప్పట్లో విచారణకు మాత్రం పిలవలేదు. ప్రజాప్రతినిధిగా వ్యవహరించాల్సిన కొలికపూడి అధికారిగా మారి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో క్రమశిక్షణా కమిటీ ముందు హాజరు కావాల్సిన పరిస్థితి వచ్చింది.

- గతంలో వైసీపీ నాయకుడు అక్రమ భవనం కట్టుకున్నాడని దానిని కూల్చేందుకు వెళ్లిన కొలికపూడి అక్కడ నానా హంగామా సృష్టించారు. అధికారులకు ఫిర్యాదు చేయకుండా ఆయన సొంత నిర్ణయాలు తీసుకోవడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి.
- స్థానికంగా ఉన్న బెల్ట్‌షాపు తొలగింపులోనూ ఆయనే ఇదే దుందుడుకు స్వభావాన్ని ప్రదర్శించారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయకుండానే సదరు బెల్ట్‌షాప్ వద్దకు వెళ్లి ఓ అధికారి మాదిరిగా హడావిడి చేసి విమర్శల పాలయ్యారు.
- నియోజకవర్గంలో పేకాట నిర్వహణకు సంబంధించి తనకు ఎమ్మెల్యే అనుమతులు ఇచ్చారని చిట్యాల సర్పంచ్ ఎక్కడో వ్యాఖ్యలు చేశారన్న విషయాన్ని కూడా కొలికపూడి వివాదాస్పదం చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులతో సమావేశం పెట్టి సదరు సర్పంచ్‌ను బండబూతులు తిట్టడం, ఈ విషయానికి మనస్థాపం చెంది సర్పంచ్

మిగతా 6లో..

గ్రావెల్‌పై విమర్శలు

ఓ వైసీపీ నేత గ్రావెల్ తవ్వుతున్నాడని నానా యాగీ చేసిన ఎమ్మెల్యే ఆ తర్వాత అదే గ్రావెల్ క్వారీని ఆయన సతీమణి పేరిట తవ్వుతున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. వీటిపై కొలికపూడి సమాధానం, వివరణ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. కానీ, ఈ వివాదాల్లో తన తప్పేమీ లేదని కొలికపూడి వాదిస్తున్నారు. కమిటీ ముందు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయన వాదన నిజమే అయినా.. ఆ పేరుతో నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులను గురిచేసేలా వ్యవహరించటం మంచిది కాదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.


స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో భాగంగా దుర్గగుడి మెట్లను శుభ్రం చేస్తున్న కార్మికురాలు

దుర్గగుడిలో ప్రక్షాళన

ఉద్యోగులపై కొత్త ఈవో దృష్టి

- ప్రత్యేక సమావేశంలో క్లాస్
- అవినీతి, విధుల్లో అలసత్వంపై సీరియస్
- ఇక మీదట ఊరుకోబోనని హెచ్చరిక

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిలో ప్రక్షాళన ప్రారంభమైంది. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరికొందరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఈవో గుర్తించినట్లు సమాచారం. డిసెంబరు 31న దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న కె.రామచంద్రమోహన్.. ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. నాటి నుంచి ఆయన ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించారు.

సమావేశాల్లో క్లాస్

నిబంధనల ప్రకారం దుర్గగుడిలో భక్తులకు కావాల్సిన వసతులు, ఏర్పాట్లు చేయట్లేదని, కొందరు ఉద్యోగులు విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరికొందరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఈవో గుర్తించారు. పాలనను గాడిలో పెట్టేందుకు ఆయన అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో వేర్వేరుగా సోమవారం సమావేశాలు నిర్వహించారు. తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఉద్యోగులు నిబంధనల మేరకు విధులు నిర్వహించి, భక్తులకు కనీస వసతులు కల్పించాలని, దేవస్థానం ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవటంతో పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి సమావేశంలో ఆయన ఉద్యోగుల వివరాలు, ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు, వారిలో ఎన్ఎంఆర్‌లు, కాంట్రాక్టు సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, పర్మినెంట్ ఉద్యోగుల వివరాలు

మిగతా 6లో..

సీఆర్‌డీఏ కమిషనర్‌గా కన్నబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) కమిషనర్‌గా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన ఎస్.కన్నబాబును ప్రభుత్వం నియమించింది. సోమవారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో ప్రస్తుత సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ శాఖకు సెక్రటరీగా బదిలీ చేశారు. కాగా, కన్నబాబు 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. గత ప్రభుత్వంలో టూరిజం ఎండీగా పనిచేశారు. పంచాయతీరాజ్ శాఖలోనూ ఆయన బాధ్యతలు నిర్వహించారు.

నిఘారింపు

నగరంలో 1,000 సీసీ కెమెరాల ఏర్పాటు

22న హోంమంత్రి, డీజీపీతో ప్రారంభం



- ఓ ఫొటోగ్రాఫర్ పెళ్లి ఈవెంట్ కోసం పీఎన్‌బీఎస్ నుంచి ప్రకాశం జిల్లాకు బస్సులో బయల్దేరాడు. ఒంగోలు వెళ్లే బస్సెక్కాడు. ఇదే బస్సులో ఎక్కిన ముగ్గురు ఉత్తరప్రదేశ్ వాసులు అతడి కెమెరా బ్యాగ్‌ను కాజేశారు. బస్సు బస్టాండ్ నుంచి బయటకు వచ్చేలోగా పని పూర్తి చేసుకున్నారు. బస్సు జాతీయ రహదారిపైకి రాగానే మరో వ్యక్తి బస్టాండ్‌లో ఉండిపోయాడని చెప్పి దిగిపోయారు. సరిగ్గా ఒంగోలు వెళ్లి చూసుకునే సరికి బ్యాగ్‌లో ఉన్న కెమెరా, లెన్స్ కనిపించలేదు. ఈ కేసులో నిందితులను సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి గుర్తించారు. రోజుల వ్యవధిలోనే పోలీసులు కేసు ఛేదించారు. నిందితులు బస్సెక్కడం మొదలు జాతీయ రహదారిపై దిగే దృశ్యాలన్నీ ఫుటేజీలో కనిపించాయి.
- జగ్గయ్యపేటలో బంగారం షాపులో గుమస్తాగా పనిచేసే వ్యక్తి విజయవాడకు కారులో వచ్చారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోని శారదా కళాశాల వద్దకు రాగానే ఓ గ్యాంగ్ పోలీసుల అవతారమెత్తి ఆ కారును ఆపింది. ఆ గుమస్తా నుంచి రూ.25 లక్షలు కాజేసింది. డిసెంబరు 11న జరిగిన ఈ ఘటనలో నిందితులను సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా పట్టుకున్నారు. కాజేసిన మొత్తాన్ని రికవరీ చేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఈ రెండే కాదు.. ఇలాంటి చాలా ఘటనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించాయి. దీంతో పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 వేల నుంచి 15 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా ఒక్క నగరంలోనే 1,000 సీసీ కెమెరాలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏర్పాటు చేయించారు. ఈ సీసీ కెమెరాలను ఈనెల 22న హోంమంత్రి అనిత, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుతో ప్రారంభించడానికి రంగం సిద్ధం చేశారు.

జిల్లాలో ప్రత్యేక సమావేశాలు

ప్రస్తుతం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 2,025 సీసీ కెమెరాలున్నాయి. వాటిలో 1,904 కెమెరాలను ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయగా, 121 కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏర్పాటు చేయించారు. కాలనీ సంక్షేమ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు, వ్యాపారుల భాగస్వామ్యంతో ఈ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కొన్ని రోజులుగా విజయవాడలో పోలీసులు స్టేషన్లవారీగా ఉన్న కాలనీవాసులు, అపార్టుమెంట్ల సంక్షేమ సంఘాలు, వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాలను, నేరగాళ్లు ఎంచుకున్న విధానాలను వారికి వివరిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా ఎలాంటి కేసులను ఛేదించారో చెబుతున్నారు.
కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని సూచిస్తున్నారు. దీనికి పలువురు ముందుకొచ్చారు. ఇప్పటికే పటమటలంకకు చెందిన పెద్దలు, అపార్టుమెంట్ల సంక్షేమ సంఘాల వారు రూ.2 లక్షల చెక్కును సీసీ కెమెరాల కోసం విరాళంగా ఇచ్చారు. వారితో పాటు పలువురు సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవడానికి ముందడుగు వేశారు. మొత్తంగా నగరంలో కొత్తగా 1,000 సీసీ కెమెరాల ఏర్పాటు జరుగుతోంది. దీంతో జిల్లాలో నిఘా నేత్రాల సంఖ్య 3,025కు చేరుతుంది.

కదలరు.. వదలరు..

ఇంకా కానూరులోనే ఐసీడీఎస్ రెండు జిల్లాల కార్యాలయాలు

- మచిలీపట్నం వెళ్లడానికి ఇష్టపడని కృష్ణాజిల్లా అధికారులు
- కార్యాలయం వెతుకులాటలో ఎన్టీఆర్ జిల్లా అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వ శాఖల జిల్లా ప్రధాన కార్యాలయాలన్నీ సాధారణంగా జిల్లా కేంద్రాల్లోనే ఉంటాయి. కానీ, ఎన్టీఆర్, కృష్ణాజిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలు మాత్రం జిల్లా కేంద్రాల్లో ఉండవు. జిల్లా కేంద్రానికి రావాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ఆ శాఖాధికారులు పట్టించుకోరు. రెండు జిల్లాల కార్యాలయాలను ఆయా జిల్లా కేంద్రాలకు మార్చాలని సాక్షాత్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా నోరుమెదపరు.

కానూరు నుంచి కదలరు

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు ఐసీడీఎస్ కార్యాలయం ముందుగా బెంజిసర్కిల్ వద్ద ఉన్న వాసవ్య మహిళా మండలికి చెంతనే ఉన్న భవనంలో ఉండేది. తర్వాత పెనమలూరు మండలం కానూరులో గోడౌన్‌తో పాటు కార్యాలయం ఉండేలా సొంత భవనాన్ని నిర్మించారు. దీంతో బెంజిసర్కిల్ వద్ద ఉన్న కార్యాలయం కానూరులోని భవనంలోకి మారింది. కాగా, వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాల విభజన జరిగింది. కానూరు కృష్ణాజిల్లా పరిధిలోకి వెళ్లింది. దీంతో కానూరులో ఉన్న కార్యాలయంలోనే ఐసీడీఎస్ శాఖ విభజన జరిగింది. రెండు జిల్లా కార్యాలయాలకు వేర్వేరుగా ప్రాజెక్టు డైరెక్టర్లు ఉన్నారు. రెండు జిల్లాల కార్యాలయాలు వేర్వేరు బోర్డులతో ఒకే కార్యాలయంలో నడుస్తున్నాయి. ఐసీడీఎస్ ద్వారా అందే పథకాల్లో ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు అటు కృష్ణాజిల్లా నుంచి, ఇటు ఎన్టీఆర్ జిల్లా నుంచి కానూరుకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని చాలామంది చెబుతున్నారు. అయినా నాటి అధికారుల్లో ఎలాంటి చలనం కలగలేదు. ఈ విషయం నేరుగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వద్దకు వెళ్లడంతో రెండు జిల్లాల పీడీలపై చర్యలు తీసుకున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పీడీలను విధుల

మిగతా 6లో..

చెత్త సేకరణలోనూ వసూళ్లు
రైతుబజార్లలో పారిశుధ్యం ముసుగులో దోపిడీ
6
దుర్గగుడి హుండీలో దొంగతనం
దేవస్థాన అర్చక ప్రైవేట్ సహాయకుడి నిర్వాకం.. ఈవోకు పట్టించిన పారిశుధ్య సిబ్బంది



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్ఎల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు

ఆయకట్టుకు నీరివ్వండి

» ఎన్ఎస్ఎల్బీసీ అధికారికి కోట వీరబాబు వినతి

నందిగామ/చందర్లపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతుల అవసరాలు తీర్చేందుకుగాను పులిచింతల నుంచి నీటిని విడుదల చేయాలని ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు సూచించారు. ఎన్ఎస్ఎల్బీసీ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మోహిద్దీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలువల పరిస్థితి, నీటి లభ్యత, వినియోగం తదితర అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో ఆహార, వాణిజ్య పంటలు సాగవుతున్నాయని కోట చెప్పారు. సదరు పంటలకు మరో రెండునెలల పాటు నీటి అవసరం ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న నదీ ప్రవాహం వల్ల ఎత్తిపోతల పథకాలకు నీరు అందడం లేదన్నారు. దీనివల్ల రైతులు పంటలు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. తక్షణమే నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్ఈ మోహిద్దీన్ నీటి లభ్యతను పరిశీలించి తక్షణమే విడుదలకు చర్యలు చేపడతామని చెప్పారు.

● విజయవాడలో ఎన్ఎస్ఎల్ ప్రాజెక్ట్ కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు వినతి పత్రం అందజేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయన విజయవాడలో ప్రాజెక్ట్ కమిటీ కార్యాలయంతో పాటు నందిగామ ఎన్ఎస్పీ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు.



కలెక్టర్ లక్ష్మీశాకు సమస్యలు వివరిస్తున్న తాతయ్య

సమస్యలు పరిష్కరించండి

» నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు తాతయ్య వినతి

జగ్గయ్యపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య జిల్లా కలెక్టర్ లక్ష్మీశాను కలసి వినతిపత్రం సమర్పించారు. డీఎంఎఫ్ ఫండ్స్ విడుదల చేయాలని, పట్టణంలో విలియంపేట రోడ్డులో డంపింగ్‌యార్డు స్థలాన్ని మార్చాలని కోరారు. నియోజకవర్గంలో సీలింగ్ ల్యాండ్‌ల వివరాలు తహసీల్దార్ ఆఫీసులో ఉండాలని, వాటిని ఆక్రమించి అనుభవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐటీ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో పాటు మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఘైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ నకిరికంటి వెంకటి, నోముల రఘులు ఉన్నారు.

● పట్టణంలో విలియంపేట వాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని, స్వయంగా సందర్శించాలని ఎమ్మెల్యే తాతయ్య పబ్లిక్ హెల్త్ డీఈఈ స్వామి నాయుడును విజయవాడలో ప్రత్యేకంగా కలిసి కోరారు.

● పట్టణంలో శాప్ నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను మునిసిపాలిటికి అప్పగించాలని శాప్ చైర్మన్ అనిమి రవినాయుడును ఇందిరాగాంధి మునిసిపల్ స్టేడియంలో తాతయ్య కలిసి కోరారు. పట్టణంలో ఉన్న రెండు క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి సౌకర్యాలు పెంచాలన్నారు. తాతయ్య సూచనమేరకు త్వరలోనే శాప్ అధికారులను పంపి నివేదిక తెప్పించుకుంటామని శాప్ చైర్మన్ హామీ ఇచ్చారన్నారు.



పేలుడు ధాటికి ధ్వంసమైన రేకుల ఇల్లు, చికిత్స పొందుతున్న బాధితులు

రేకుల ఇంట్లో భారీ పేలుడు

» గ్యాస్ లీక్ కాదు.. షార్ట్‌సర్క్యూట్ లేదు

» గుంటూరులో ఘటన

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమవారం వేకువజామున ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. దీంతో ఆ పేలుడు ధాటికి ఇంటి రేకులు నామరూపాల్లేకుండా ధ్వంసమయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. షేక్ గన్ సైదా కుటుంబం గుంటూరులోని బ్రాడీపేటలో రేకుల షెడ్డు ఇంటిలో నివాసం ఉంటోంది. ఒక గదిలో గన్ సైదా ఆయన భార్య మస్తాన్‌బీ ఉంటుండగా, మిగిలిన రెండు గదుల్లో కుమారుడు షరీఫ్ కుటుంబం ఉంటోంది. గన్ సైదా ఆటో డ్రైవర్‌గా, కుమారుడు షరీఫ్ కారు డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నారు. ఉదయం సుమారు 5.45 గంటల సమయంలో ఒక్కసారిగా సంభవించిన పేలుడు ధాటికి, వారి రేకుల ఇల్లు ధ్వంసం కావడమే కాకుండా, చుట్టుపక్కల ఇళ్ల అద్దాలు కూడా పగిలిపోయాయి. మంటలతో కూడిన పేలుడు కారణంగా ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులైన గన్ సైదా, మస్తాన్‌బీ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టాభిపురం సీఐ వీరేంద్ర ఇచ్చిన సమాచారంతో విద్యుత్తు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్యాస్ లీక్ గానీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌గానీ కాలేదని తేల్చారు. అయితే పేలుడు ఎలా సంభవించిందనేది అంతుబట్టని అంశంగా మారింది. గన్‌సైదా, మస్తాన్‌బీ, షరీఫ్‌ల సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. కాల్ డేటాను విశ్లేషించి, వ్యక్తిగత సంబంధాలపై ఆరా తీసినా ఎలాంటి అనుమానాస్పద వివరాలు లభ్యం కాలేదు. ఘటనా స్థలంలో పలు ఆధారాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వస్తేనే పేలుడు అంశంలో స్పష్టత వస్తుందని పోలీసు వర్గాలు అంటున్నాయి.

దుర్గగుడిలో పదిమంది పరిచారికలకు శాశ్వత కొలువు

» ఆదేశాలు జారీ చేసిన దేవదాయ శాఖ

విజయవాడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో పది పరిచారికుల సర్వీసును రెగ్యులరైజ్ చేస్తూ దేవదాయ శాఖ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. కె.నాగరాజు, కె.కేశవరావు, ఎంవీఎస్ శాస్త్రి, ఎస్.శ్రీనివాసశర్మ, సీహెచ్.పిచ్చయ్య శాస్త్రి, ఎం.రాధాకృష్ణమూర్తి, పి.అశ్వనీకుమార్, జి.రామారావు, కె.ప్రవీణ్ శాస్త్రి, కె.ప్రశాంత్‌శాస్త్రిలు 2005 జూన్ 18 నుంచి అర్చకులకు సహాయకులుగా పనిచేస్తున్నారు. వారిని రెగ్యులరైజ్ చేశారు.

చెత్త సేకరణలోనూ.. వసూళ్లు!



రైతు బజారులో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

» రైతుబజార్లలో పారిశుధ్యం ముసుగులో దోపిడీ

» శాశ్వత దుకాణాల నుంచి రూ.1200 వసూలు

» రైత్వారీ షాపులకు రూ.500

» నెలకు వసూలు రూ.11.15లక్షలు

» సిబ్బందికి చెల్లింపులు రూ.4.48లక్షలు

» మిగిలిన నిధులు స్వాహా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కూరగాయలు విక్రయించి వ్యాపారులు ఆదాయం పొందుతుంటే.. అదే వ్యాపారులను పారిశుధ్యం ముసుగులో నిలువు దోపిడీ చేస్తున్నారు అధికారులు. జిల్లాలోని రైతుబజార్లలో జరుగుతున్న తంతు ఇది. ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టిస్తామని చెబుతుంటే, రైతుబజార్లలోని ఎస్టేట్ అధికారులు మాత్రం చెత్త నుంచి లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్నారు. వ్యాపారుల నుంచి పారిశుధ్య రుసుము వసూలు చేస్తున్న ఈవోలు సిబ్బందికి అరకొర వేతనాలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని జేబుల్లో వేసుకుంటున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిబంధనలు రూపొందించకపోవడంతో ఈవోలు చెలరేగిపోతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 12 రైతు బజార్లు ఉన్నాయి. ప్రతి రైతుబజార్‌లో శాశ్వత దుకాణాలు, రైత్వారీ దుకాణాలు ఉంటాయి. విభిన్న ప్రతిభావంతులు, డ్వాక్రా సంఘాలు, రైతు సొసైటీలకు శాశ్వత దుకాణాలను కేటాయిస్తారు. ఇవి కాకుండా పండించిన పంటలను నేరుగా రైతుబజార్లలో విక్రయించుకునేందుకు రైతులకు రైత్వారీ దుకాణాలను ఇస్తారు. జిల్లాలో ఉన్న రైతుబజార్లలో 513 శాశ్వత దుకాణాలు, 1000 రైత్వారీ దుకాణాలున్నాయి. శాశ్వత దుకాణాల నుంచి నెలకు అద్దె రూపంలో రూ.9500లు వసూలు చేస్తారు. రైత్వారీ దుకాణాల నుంచి ఎలాంటి అద్దెను వసూలు చేయరు. ఇక్కడ కూరగాయలు విక్రయించడం, దిగుమతి చేయడం వల్ల వచ్చిన చెత్తను తొలగించడానికి పారిశుధ్య సిబ్బంది ఉంటారు. ఒక్కో రైతుబజార్‌లో ఆరు నుంచి ఎనిమిది మంది వరకు సిబ్బంది పనిచేస్తారు. వాళ్లంతా రెండు విడతలుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొంతమంది.. మధ్యాహ్నం నుంచి రైతుబజార్లు మూసివేసే వరకు మరికొంతమంది పని చేస్తారు. వారికి వేతనాలుగా కొన్ని రైతుబజార్లు రూ.8వేలు చెల్లిస్తుంటే, మరికొన్ని రైతుబజార్లు రూ.6వేలు చెలిస్తున్నాయి.

ఇష్టానుసారంగా వసూళ్లు

రైతుబజార్లలో పారిశుధ్య నిర్వాహణకు వ్యాపారులు, రైతుల నుంచి ప్రతినెలా కొంత మొత్తాన్ని అధికారులు వసూలు చేస్తున్నారు. శాశ్వత దుకాణాల నుంచి నెలకు రూ.1200, రైత్వారీ దుకాణాల నుంచి రూ.500 వసూలు చేస్తున్నారు. శాశ్వత దుకాణాల నుంచి రూ.6,15,600లు, రైత్వారీ దుకాణాల నుంచి రూ.5లక్షలు మొత్తం రూ.11,15,600లు వసూలు చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బందికి వేతనాలుగా సుమారుగా రూ.4లక్షలు ఇస్తున్నారు. మిగిలిన నిధులకు ఎక్కడా జవాబుదారీతనం ఉండడం లేదు. ఈ డబ్బులు ఏమవుతున్నాయో అడిగే నాథుడు మార్కెటింగ్ శాఖలో కనిపించడం లేదు. ఈ నిధులను బ్యాంక్ ఖాతాల్లో జమచేసే అవకాశం లేకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారు. దుకాణాల నుంచి వసూలు చేయాల్సిన అద్దెలకు సంబంధించి మార్కెటింగ్ శాఖ స్పష్టమైన విధి విధానాలు ఖరారు చేసింది. ప్రతి ఏడాది దుకాణాలకు ఉన్న అద్దెను పదిశాతం పెంచాలి.

● వైసీపీ ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసింది. రైతుబజార్ల అభివృద్ధి, సదుపాయాలపై దృష్టిసారించలేదు. దీనితో అద్దె పెంపును ఈవోలు గాలికి వదిలేశారు. పారిశుధ్య వసూళ్లలో భారీగా ఆదాయం వస్తుండడంతో దానిపైనే దృష్టి పెట్టారు. మార్కెటింగ్ శాఖ ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న 12 రైతుబజార్లలో ఇదే పరిస్థితి ఉంది. మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహణకు సంబంధించి రుసుమును అద్దెతోపాటు వసూలు చేసి ఆ వేతనాలను సిబ్బంది ఖాతాల్లో జమచేస్తే బాగుంటుందన్న అభిప్రాయం పారిశుధ్య సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

దుర్గగుడి హుండీలో దొంగతనం!

» దేవస్థానం అర్చక ప్రైవేట్ సహాయకుడు

» ఈవోకు పట్టించిన పారిశుధ్య సిబ్బంది

» హుండీకి తాళం వేయని వైనం

» అర్చకుల ప్రైవేట్ సహాయకులను నిలిపివేసిన ఈవో

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆరో అంతస్తులో ఉన్న హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను ఓ అర్చకుడి ప్రైవేట్ సహాయకుడు దొంగిలించిన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. విధుల్లో ఉన్న దేవస్థానం ప్రైవేట్ పారిశుధ్య ఉద్యోగి గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన వివరాల మేరకు దుర్గగుడి మహామండపం ఆరో అంతస్తులో సోమవారం ఉదయం 4.50 గంటలకు పారిశుధ్య విభాగం ఉద్యోగి వి.దుర్గమ్మ విధుల్లో ఉండగా హుండీలో కానుకలు కిందపడి ఉండటం గమనించింది. ఈ విషయాన్ని సంబంధిత విభాగం సూపర్‌వైజర్‌కు తెలియపరచగా, ఆయన దేవస్థానం ప్రైవేటు సెక్యూరిటీ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ అధికారి ఈవో రామచంద్రమోహన్‌కు తెలియపరిచారు. ఈవో హుండీలో కానుకలు చోరీకి గురైన ప్రదేశాన్ని పరిశీలించి పారిశుధ్య విభాగ ఉద్యోగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈవో తన ఛాంబర్‌లో సంబంధిత విభాగాల అధికారులతో దేవస్థానం ప్రాంగణంలో ఉన్న హుండీల వివరాలు, వాటి భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవో సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా, ఓ వ్యక్తి హుండీలో కానుకలను దొంగిలించి తన వద్ద భద్రపరచుకున్నట్లు గుర్తించారు. హుండీలో నుంచి దొంగిలించిన కానుకలలో కొన్ని కానుకలు కిందపడి ఉండటం గమనించారు. ఈవో ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టవలసిందిగా సంబంధిత విభాగ అధికారులను ఆదేశించారు. దేవస్థానంలో అర్చకుల వద్ద ప్రైవేటు వ్యక్తులు ఎంతమంది ఎన్ని సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవో ఆదేశాల మేరకు సంబంధిత అధికారి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న దొంగిలించిన కానుకలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వ్యక్తి రామలింగేశ్వర్ పేటకు చెందిన కిషోర్ అని, ఇతను టోల్‌గేట్ సమీపంలో ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద పనిచేస్తున్నట్లు దేవస్థానంలో ఉద్యోగులు చెబుతున్నారు.

అర్చకులకు సహాయకులుగా బయట వ్యక్తుల నిలిపివేత..

అర్చకుడికి సహాయకుడిగా పనిచేసే ప్రైవేట్ వ్యక్తి కానుకలను దొంగిలించటంపై ఈవో సంబంధిత విభాగ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్చకుల వద్ద ప్రైవేటు వ్యక్తులు ఎంతమంది పనిచేస్తున్నారు? వారి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు దేవస్థానంలో పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సుమారు పది మందికి పైగా బయట వ్యక్తులు పనిచేస్తున్నారని గుర్తించినట్లు సమాచారం. వారిని దేవస్థానంలోకి రానీయవద్దని అధికారులకు సూచించారు. హుండీల కానుకల భద్రతపై తగిన నిఘా ఉండాలని, ప్రతిరోజూ రాత్రి ఆలయం మూసివేసే సమయంలో హుండీల గవాక్షాలకు తాళాలు తప్పనిసరిగా వేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.



పోరంకిలో జాబిల్లి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఈ తరం వారికీ జాబిల్లి సేవలు

» ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలకు అద్భుతంగా వైద్య సేవలందించిన జాబిల్లి ఆసుపత్రి తిరిగి అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం పోరంకిలో అక్కినేని ఆసుపత్రి ప్రాంగణంలో జాబిల్లి ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడారు. తమ తరం పిల్లలు జాబిల్లిలో చక్కని వైద్య సేవలు పొందేవారని.. తిరిగి ఈ తరానికి కూడా జాబిల్లి వైద్యులు వారి విలువైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. డాక్టర్ అక్కినేని మణి సారథ్యంలో డాక్టర్ దేవభక్తుని నరేంద్ర, డాక్టర్ సౌజన్య యలవర్తిల వంటి అనుభవజ్ఞులయిన నియోనటాలజిస్ట్, పీడియాట్రీషియన్‌ల సేవలు స్థానికులకు అందడం సంతోషదాయకమన్నారు. చిన్నారులు, నెలలు నిండకుండానే పుట్టే పిల్లలకు అత్యాధునిక సేవలు అందుబాటులో ఉంచడం గొప్ప విషయమన్నారు. ముందుగా డాక్టర్ మణి, డాక్టర్ పరిమిలతో కలిసి ఎమ్మెల్యే ఆసుపత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కదలరు.. వదలరు..

(5వ పేజీ తరువాయి)

నుంచి తప్పించారు. అయినప్పటికీ రెండు కార్యాలయాలు ప్రస్తుతం ఉన్న భవనంలోనే కొనసాగుతున్నాయి.

చిత్తశుద్ధి లేని ప్రయత్నాలు

కార్యాలయాల మార్పునకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఒక నాటకాన్ని, కృష్ణాజిల్లా అధికారులు చేస్తున్న ప్రయత్నాలు మరో నాటకాన్ని తలపిస్తున్నాయి. కానూరు కృష్ణాజిల్లా పరిధిలోకి వస్తుంది కాబట్టి కార్యాలయాన్ని మచిలీపట్నానికి మార్చాల్సిన అవసరం లేదన్న వాదనను ఆ జిల్లా అధికారులు వినిపిస్తున్నారు. కృష్ణా జిల్లా ఐసీడీఎస్‌కు నోడల్ అధికారిగా వ్యవహరించే అధికారి ఈ భవనానికి చెంతనే ఉండటంతో మార్పునకు సంబంధించిన ప్రయత్నాలు జరగడం లేదని సమాచారం. ఇప్పటికే సస్పెండ్ అయిన పీడీ మాత్రం తాను మళ్లీ ఈ కార్యాలయం నుంచే విధులు నిర్వర్తిస్తానని సిబ్బందితో చెబుతున్నట్టు సమాచారం. కృష్ణాజిల్లా ఐసీడీఎస్ కార్యాలయాన్ని మచిలీపట్నానికి మార్చాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న భవనంలోనే కొనసాగించవచ్చని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ ఉత్తర్వులను అత్యంత గోప్యంగా ఉంచారు. ఇక ఎన్టీఆర్ జిల్లా ఐసీడీఎస్ అధికారులు మాత్రం తలో ప్రయత్నం చేస్తున్నారు. ఇంతకుముందున్న వాసవ్య మహిళా మండలి సమీపంలో ఉన్న భవనంలోకి వెళ్లాలని భావించారు. ఈ భవనం ఖాళీ లేదని యజమానులు చెప్పారు. ఇప్పుడు గవర్నరుపేటలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ మూడో అంతస్తులోకి మార్చాలని భావిస్తున్నారు. దీనిపై సిబ్బంది ఆసక్తిని చూపించట్లేదు. ప్రస్తుతం ఈ కార్యాలయం కానూరులో ఉండటంతో సిబ్బంది ఆ పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోకి మారిస్తే.. వాహనాల పార్కింగ్ సమస్యతో పాటు దూరంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కాకపోతే మాంటిస్సోరి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ సబ్‌కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలు ఉన్నాయి. ఇక ఇక్కడ భవనాలు ఖాళీ లేవని తెలుస్తోంది.

దుర్గగుడిలో ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరై బయోమెట్రిక్ నమోదు చేస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ పాయింట్లు ఎన్ని ఉన్నాయి, ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.. వంటి అంశాలపై ఆరా తీశారు. కొన్ని విభాగాల ఉద్యోగులు బయోమెట్రిక్ నమోదు చేయటం లేదని, కొందరు విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసి ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఒక అధికారిని హెచ్చరించినట్లు తెలిసింది. ఓ విభాగం అధికారులు కనీసం ముఖ్యమైన అంశాలను కూడా తన దృష్టికి తీసుకురావట్లేదని ఈవో ప్రశ్నించగా, సదరు అధికారులు మౌనంగా ఉండిపోయారు. అలాగే, దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు కూడా ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. రాష్ట్రంలో ఏ దేవస్థానంలో లేనివిధంగా దుర్గగుడిలో ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని, కనీసం భక్తులకు కల్పించాల్సిన వసతులు కూడా లేవని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉద్యోగులందరూ సక్రమంగా విధులు నిర్వహించి దేవస్థాన పవిత్రతను కాపాడాలని అధికారులను ఆదేశించారు.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లను భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

అర్జీల పరిష్కారంలో చొరవచూపండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

పామర్రు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అర్జీలకు అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. పామర్రు తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మచిలీపట్నం- విజయవాడ ప్రధాన రహదారిపై మండల పరిధిలోని బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటుకు జాతీపామర్రుతోపాటు పెదపారుపూడి, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాలకు చెందిన వివిధ సమస్యల పరిష్కారం కోసం పలువురు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. పట్టణంలో పేదలకు టిడ్కో గృహాలు నిర్మించి ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక చల్లపల్లి రోడ్డులో రైతులనుంచి కోనుగోలు చేసిన 30 ఏకరాల భూముల్లో గృహనిర్మాణాల వల్ల రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని పలువురు కోర్టులను ఆశ్రయించారు. దీంతో పేదల ఇళ్ల స్థలాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఆ భూములను సోమవారం కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే కుమార్‌రాజాతో కలసి పరిశీలించారు.

కొలికపూడి కథ.. కొలిక్కివచ్చేనా..?

(5వ పేజీ తరువాయి)

సతీమణి ఆత్మహత్యకు ప్రయత్నించటం వివాదాస్పదంగా మారింది.

● ఒక సిమెంట్ రోడ్డుకు వేసిన ఫెన్సింగ్‌కు సంబంధించిన వివాదంలో కూడా ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని, ఒక కుటుంబంపై దాడికి పాల్పడ్డారన్నది తాజా అభియోగం. ఈ వివాదంపైనే ఆయన టీడీపీ విచారణ కమిటీకి వివరణ ఇచ్చుకున్నారు. వైసీపీ వార్డు సభ్యుల కుటుంబాన్ని ఆయన ప్రస్తావిస్తూ గతంలో ఈ కుటుంబం జవహర్, స్వామిదాసులపైనే దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ఇది వాస్తవమే అయినా.. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవటానికి యంత్రాంగం ఉందని, కొలికపూడి దుందుడుకుతనం అవసరం లేదనే వాదన వినిపిస్తోంది.

పెసర.. ధర పతనం!

పెసలు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు చేతులెత్తి వేడుకుంటున్నారు. మద్దతు ధర కంటే మార్కెట్ ధర క్వింటాకు రూ. 2000 పైగా తక్కువగా ఉంది. మద్దతు ధర కోసం మూడు నెలల నుంచి మార్కెట్ యార్డు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు.



కంచికచర్ల మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వ చేసిన పెసల బస్తాలు

» గిట్టుబాటుకాని మద్దతు ధర

» శీతల గిడ్డంగుల్లో పంట నిల్వలు

» మార్కెట్ యార్డుచుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

» ఆదుకోవాలని రైతుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పెసర పంట సెప్టెంబరు నెలలో రైతుల చేతికొచ్చింది. అప్పట్లో క్వింటా రూ.7వేల ధర ఉంది. నష్టం వచ్చినప్పటికీ పలువురు రైతులు రబీ సీజన్ వ్యవసాయ పనుల కోసం పెసలను వ్యాపారులకు విక్రయించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పలువురు రైతుల వద్ద ఇంకా ఐదారు వేల క్వింటాళ్ల పెసలు ఉన్నాయి. కొంతమంది రైతులు మార్కెట్ యార్డులో ఓపెన్ గోదాముల్లో ఉంచగా, ఇంకొంత మంది ఇళ్లల్లో నిల్వ చేశారు. పురుగు ఆశించకుండా, నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు ఎక్కువ మంది రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. మూడు నెలల నుంచి రైతులు మద్దతు ధర కోసం నిరీక్షిస్తున్నారు. స్థానిక యార్డు చుట్టూ తిరుగుతున్నారు. పెసల కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ అధికారులు ఎలాంటి ప్రకటన చేయటం లేదు. తొలుత శాంపిల్స్ సేకరించిన అధికారులు తర్వాత ఎందువల్లనో మిన్నకుండిపోయారు. అధికారుల సూచన మేరకు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సీఎం యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. నమోదును ధృవీకరిస్తూ, కొనుగోలు తేదీ త్వరలో తెలియచేస్తామంటూ రైతులకు నవంబరు రెండో వారంలో మేసేజ్‌లు కూడా వచ్చాయి. ఆ తర్వాత ఉలుకూ, పలుకూ లేదు.

పెసలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,558లు. ప్రస్తుతం బయటి మార్కెట్లో క్వింటా రూ. 6వేల నుంచి రూ. 6,200 ధర మాత్రమే ఉంది. వ్యాపారులకు అమ్మితే క్వింటా రూ. 25 వందలు నష్టపోయే పరిస్థితి. మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ కొనే విషయంలో పాలకులు స్పందించటం లేదని రైతులు వాపోతున్నారు. తమ గురించి ఎవరూ పట్టించుకోక పోవటంతో ఏం చేయాలో తెలియటం లేదంటూ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రోజులు గడిచేకొద్దీ పెసలు దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నష్టపోతున్నా కొనటం లేదు



\- మాగంటి వెంకట్రావు

బయట మార్కెట్లో విక్రయించటం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిసినప్పటికీ పాలకుల్లో, అధికారుల్లో చలనం లేదు. మార్క్‌ఫెడ్ అధికారులు మద్దతు ధరకు ఎందుకు కొనటం లేదో తెలియటం లేదు. నా వద్ద 50 క్వింటాళ్ల పెసలు ఉన్నాయి. శీతల గిడ్డంగిలో నిల్వ చేశాను. కంచికచర్ల రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేయించాను. కొనుగోలు తేదీ తెలియచేస్తామంటూ 50 రోజుల క్రితం నాకు మేసేజ్ వచ్చింది. ఇప్పటి వరకు తేదీ తెలపలేదు. ఒక్క కిలో కూడా కొనలేదు. యార్డు చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148,157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు

భారతీనగర్: రింగ్ రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాల పై సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు, గుణదల డివిజన్ ఈఈ పి. హరిబాబు ఆధ్వర్యంలో అధికారులు 36 బృందాలుగా ఏర్పడి 2612 గృహసర్వీసులు, 141 వాణిజ్య సముదాయాల సర్వీస్‌ను తనిఖీ చేశారు. వాటిలో 63 సర్వీసులకు రూ.2,74,000 జరిమానా విధించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 9440812362, 9440812363, 8331014951 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. పటమట డీఈఈ శివకుమార్, రింగ్ రోడ్డు సెక్షన్ ఏఈఈ . ఫణీంద్ర, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు...స్థానికుల ఇబ్బందులు



వెలగని వీధి దీపాల స్తంభం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాచవరం కార్మికనగర్ 2వ డివిజన్‌లో రెండు స్తంభాలకు ఉన్న లైట్లు వెలగక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ విష పురుగుల సంచారంతో పిల్లలు, పెద్దలు తీవ్రంగా భయాందోళన చెందుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణం వీధి దీపాలను వెలిగించాలని పలువురు కోరుతున్నారు.

డ్రెయినేజీ పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భారతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్‌లోని నాగార్జుననగర్ కాలనీలో ఉన్న ప్రధాన, సైడ్ డ్రెయినేజీల్లో పూడిక, వ్యర్థాలను సోమవారం డివిజన్ శానిటరీ అధికారి ఆంటోని ఆధ్వర్యంలో వీఎంసీ సిబ్బంది తొలగించారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించిన నగర పాలన సంస్థ అధికారులు సిబ్బందిని పంపించి కాలనీలోని అంతర్గత, మెయిన్ రోడ్లో డ్రెయినేజీల పూడికను, ఖాళీ స్థలాల్లోని చెత్తను తొలగించారు.

నేటి నుంచి మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొగల్రాజపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జనశిక్షణా సంస్థాన్‌లో మహిళలకు ఉపాధి అవకాశాల నిమిత్తం ఈ నెల 21 నుంచి జ్యూట్ బ్యాగుల తయారీ, మగ్గం వర్కులో అతి తక్కువ ఫీజులతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కోటి మూడు నెలల పాటు కాలపరిమితిలో జరిగే శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే వారు 15 నుంచి 45 సంవత్సరాలలోపు వారై ఉండాలని, వివరాలకు 0866 2470420లో సంప్రదించాలని పేర్కొన్నారు.

‘టమాటా కొంటేనే మిర్చి’ దుకాణదారుడిపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్యనారాయణపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టమాటా కొంటేనే మిర్చి అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఎం. శ్రీనివాసశాస్త్రి స్పందించారు. రైతుబజారులో స్టాల్ నెం 79 నిర్వహిస్తున్న సుభద్ర టమాటా కొంటేనే మిర్చి అని అన్న విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో సోమవారం టమాటా వ్యాపారం చేస్తున్న దుకాణదారులను పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుబజారులో వారం రోజుల పాటు ఆమెకు దుకాణాన్ని కేటాయించడం లేదని తెలిపారు. ఈ సంఘటన జరిగిన సమయంలో టామాటా లోడుతో రైతుబజారుకు వాహనాలు రావడంతో అక్కడికి వెళ్లానని చెప్పారు. వినియోగదారులకు ఎటువంటి సమస్య వచ్చినా రైతుబజారులోని ఆఫీసులో ఫిర్యాదు చేయాలని తక్షణం చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అలరించిన కూచిపూడి నృత్యం

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదిక మీద పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నండూరి రాధిక, రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. మీనాక్షి పంచరత్నం, కంజదళాయతాక్షి, శివాష్టకం, శివతాండవ స్తోత్రం, ఇంకా పలు కీర్తనలకు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను అభినందించి వారికి అమ్మవారి ప్రసాదం అందచేశారు.

సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ఇన్‌చార్జి కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ చంద్రశేఖర్



అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

చిట్టినగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా ఇన్‌ఛార్జి కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 12 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమం చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబు శ్రీనివాస్, ఎస్‌ఈ పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ విద్యార్థికి మూడో స్థానం



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి

గుణదల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆత్రేయపురంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థి బి.బాల గంగాధర్ మూడో స్థానం కైవసం చేసుకుని రూ.7,500 నగదు బహుమతి అందుకున్నాడని కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. 100 మీటర్ల స్విమ్మింగ్‌లో రూ 3వేలు నగదు బహుమతి గెలుచుకున్నాడని చెప్పారు. రిలే పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కళాశాల గౌరవాన్ని కాపాడాడని తెలిపారు. ఈ విజయాలతో ఉత్తరాఖండ్లో జరిగే 38వ జాతీయ ఈత పోటీలకు ఏపీ నుంచి ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయ స్థాయిలోనూ ఇదే ఉత్సాహంతో పోటీపడి జాతీయ స్థాయి మెడల్స్ సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. బాలగంగాధర్‌ను కళాశాల సిబ్బంది సోమవారం అభినందించారు ఈ కార్యక్రమంలో జె.నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.సుధాకర్, డి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నిడమానూరువాసి మృతి

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని నిడమానూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన సోమవారం కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధి వారధి మీద జరిగింది.

పోలీసుల వివరాల ప్రకారం నిడమానూరులోని ఓ అపార్టుమెంట్‌లో యార్లగడ్డ విజయసాయి (60) భార్య, కుమార్తె, కుమారుడుతో ఉంటున్నారు. ఇతను సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా వారధి మీద వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అతని తలపై నుంచి వాహన చక్రం వెళ్లింది. ఈ సంఘటనలో విజయసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అతని వద్ద లభించిన గుర్తింపు ఆధారాల ద్వారా బెంగళూరులో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియపరిచారు.

పోలీసులు మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత వారు ఇచ్చే ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



హుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కార్ మార్కెట్‌లోకి విడుదల చేసిన ఎ.పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ గ్రోవర్, గోపయ్య, ధీరజ్

మార్కెట్‌లోకి హుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కార్

భారతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ రామవరప్పాడులోని సాయి స్వర్ణ హుందాయ్ క్రొత్తక్రెటా ఎలక్ట్రిక్ కారుని సోమవారం ఐసీఐసీఐ బ్యాంక్ కార్ లోన్స్ ఆర్ఎస్ఎం ఎ.పవన్‌కుమార్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మనోజ్‌కుమార్ గ్రోవర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ గోపయ్య, హెచ్‌ఎంఐఎల్ టీఎస్ఎం ధీరజ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ నూతన క్రెటా ఎలక్ట్రిక్ కారులో 42కేడబ్ల్యూహెచ్, 51.4 కేడబ్ల్యూహెచ్ గల సమర్థమైన బ్యాటరీ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రత సౌకర్యాలు ఆకర్షణీయమైనవని అన్నారు. ఇందులో 17ఇంచ్ ఏరో అల్లాయ్ వీల్స్, లెవెల్- 2అడాస, అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్, 70ప్లస్ స్టాండడ్ సేఫ్టీ ఫ్యూచర్స్ కోల్డ్ స్టోరేజ్‌తో ఫ్రంట్ ఆర్మ్‌రెస్ట్, డ్రైవర్, ప్యాసింజర్ 8వే పవర్ సీట్, వాయిస్ ఎనేబుల్ స్మార్ట్ పనోరమిక్ సన్‌రూఫ్ ఆకర్షణీయమైన మోనోటోన్ డూయల్‌టోన్ రంగులలో లభిస్తుందని అన్నారు. ఈ క్రెటా ఎలక్ట్రిక్ కారు రూ.17,99,000 నుంచి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు, షోరూం సిబ్బంది, ఫైనాన్స్ టీం పాల్గొన్నారు

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

గుణదల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు దరఖాస్తులను ఈ నెల 22లోగా కళాశాలలో అందజేయాలని కోరారు. మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఆపైన అర్హత కల్గినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణకు ఎంపికైన వారికి నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఎన్ఎస్‌డీసీ, ఏపీఎస్ఎస్‌డీసీ ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు 7799669907 ఫోన్ చేయాలని కోరారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

కథానిక పోటీల్లో పీబీ సిద్ధార్థ విద్యార్థిని ప్రతిభ

మొగల్రాజపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యావికాస వాహిని సంస్థ కంకిపాడులో నిర్వహించిన తెలుగు కథానిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని రామవరపు స్రవంతి తృతీయ బహుమతి గెలుచుకుందని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు సాహిత్యం, కళలు, క్రీడల్లో కూడా ప్రావీణ్యత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్. శివకుమార్, సహాయ ఆచార్యులు డాక్టర్ సశ్రీ, డాక్టర్ పి.నీరజ, శేషారత్నం పాల్గొన్నారు.

నిరంతర శ్రమతోనే లక్ష్యం సాధ్యం

సౌత్ కొరియాకు చెందిన ఎంట్రప్రెన్యూర్ జెన్ని యూన్



ప్రసంగిస్తున్న జెన్ని యూన్

లబ్బీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి అనుకునేవారు బాధ్యతతో పాటు లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సౌత్ కొరియాకు చెందిన ఎంట్రప్రెన్యూర్ జెన్ని యూన్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అన్‌లాకింగ్ ఆపర్చ్యునిటీస్ ఫ్రమ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ టూ సక్సెస్ విత్ గ్లోబల్ బిజినెస్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యం సాధించడంలో అనేక అవరోధాలు వస్తాయని వాటిని అధిగమించినపుడు కచ్చితంగా గమ్యం చేరుకుంటామని అన్నారు. కొరియాకు చెందిన మరో అతిథి జెమ్స్ జియాంజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జీవితంలో ఒక్కసారి అవకాశం వస్తుందని దానిని సద్వినియోగం చేసుకుంటే విజయం సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ కొరియాకు చెందిన మనీషా శిఖాకొల్లి, డాక్టర్ సమంత్ కొక్కిలిగడ్డ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి పాల్గొన్నారు.

జనసేన నేత కైలే కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి నాదెండ్ల

గన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు కైలే సతీష్ 2023 సెప్టెంబరులో ప్రమాదవశాత్తు మరణించాడు. జనసేన సభ్యత్వం ఉండటంతో ఆ కుటుంబానికి రూ.5లక్షలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంజూరు చేశారు. సోమవారం ఆ కుటుంబానికి రూ.5లక్షల చెక్కును జనసేన పీఏసీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, సామినేని ఉదయభాను చేతుల మీదుగా అందజేసినట్లు జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ తెలిపారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తించేలా అధినేత చర్యలు తీసుకున్నారని తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, పల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో అన్న సంతర్పణ



అన్నసంతర్పణ చేస్తున్న పటమట సీఐ పవన్ కిషోర్, పేరంటాలమ్మ ఆలయ ఈవో ప్రియాంక తదితరులు

గుణదల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి జాతర ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన అన్న సంతర్పణకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వెంకమ్మ పేరంటాలమ్మ జాతరను రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామ పెద్దలు, పోలీసుల సహకారంతో ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి వి.ప్రియాంక తెలిపారు. సోమవారం నిర్వహించిన అన్న సంతర్పణకు ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు, నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత పరిమి నరేంద్రబాబులు ఆర్థిక సాయం అందజేశారని ఈవో తెలియజేశారు. అన్న సంతర్పణలో విజయవాడ రూరల్ మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొల్లా ఆనంద్ కుమార్, పటమట సీఐ పవన్ కిషోర్, ఈవో ప్రియాంక, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సృజనకు జీవం

రాజసం, దర్పం, సౌందర్యం వాటి సొంతం





కొండపల్లి కళారూపాల సొగసు చూడతరమా!

కంటికి ఆనందం.. మనసుకు ఆహ్లాదం కలిగించే సౌందర్యం ఆ బొమ్మల సొంతం. చెక్క, ప్రకృతి సిద్ధమైన రంగులు, సాటిలేని సృజనాత్మకతే వాటి తయారీకి ముడి సరుకు. సహజత్వానికి, రాజసానికి, దర్పానికి ప్రతీకగా నిలుస్తూ శతాబ్దాలుగా తెలుగు సంస్కృతికి అద్దం పడుతున్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ నానాటికీ వన్నెలద్దుకుంటూ ఖండాంతరాల దాటిన కొండపల్లి బొమ్మల కథ ఇది. చూసేందుకు బొమ్మలే కానీ వీటిలో జీవత్వం ఉట్టిపడుతుంది. రాజసానికి చిహ్నంగా.. ప్రముఖుల దర్పానికి నిదర్శనంగా వెలుగొందుతున్న ఈ కొయ్యబొమ్మలు నేటికీ కష్టాల సుడిగుండం నుంచి బయటపడలేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లోనూ కొండపల్లి బొమ్మలు కొలువుంటున్నాయి. పురాణాణేతిహాసాలతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు కొండపల్లి బొమ్మల్లో ఉట్టిపడుతుంది. ఇంతటి ఘన ఖ్యాతి కొండపల్లి బొమ్మల సొంతం. మార్కెట్లో ఎన్నో రకాల బొమ్మలు వచ్చిన కొండపల్లి బొమ్మలకు ఉన్న డిమాండే వేరు. అందుకే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లోను వీటికి మంచి గిరాకీ. మన దేశం, మన రాష్ట్రం, మన ప్రాంతం అన్న భావన ముందు ఏ బొమ్మకు ఇవ్వని ప్రాధాన్యత కొండపల్లి బొమ్మకే ఇస్తుంటారు. అందుకు తగినట్టే ఆ బొమ్మలుంటాయి. దేశ ప్రముఖులు వచ్చినా, ప్రజా ప్రతినిధులు వచ్చినా కొండపల్లి బొమ్మలు ఇచ్చి మర్యాదను చాటుకుంటుంటారు.

- ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి

- హస్తకళా రంగంలో అందెవేసిన చేయి ఈ కళాకారులది
- తెల్లపానికి కలప కొరత తీర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- పడుతూ.. లేస్తూ.. ముందుకు సాగుతున్న బొమ్మల పరిశ్రమ
- ఖిల్లాకు తీగెల వంతెన వస్తే మరింత మార్కెటింగ్‌కు అవకాశం

కలప కొరత తీర్చాలి



షేక్ మొహమ్మద్, ముస్కాన్ టాయ్స్ యజమాని

బొమ్మలపై ఎంతో ఆసక్తితో పాట రాసి పాడించి యూట్యూబ్‌లో పెట్టించా. ఎక్కువగా బొమ్మల ప్రదర్శనలు ఎక్కువగా జరగా లి. బొమ్మల తయారీకి కలప కొరతగా ఉంది. ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం రాయితీలిచ్చి ఆదుకోవాలి. పాలకులు, అధికారులు ప్రోత్సాహకాలిస్తే మంచి బొమ్మలు అందిస్తాం.

ప్రభుత్వ శిక్షణ

నంచర్ల ఏసుబాబు, కొండపల్లి స్ఫూర్తి బొమ్మల వర్కర్స్ సంఘం అధ్యక్షుడు

హస్త కళాకారులకు వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. దేశంలోని ముఖ్య నగరాల్లో కొండపల్లి బొమ్మలకు మార్కెటింగ్ ని ాకర్యం ఉంది. స్థానికంగా షోరూం కూడా ఉంటే విక్రయాలు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

కొండపల్లి బొమ్మల చరిత్ర

15వ శతాబ్దం నాటి విజయనగరం, చంద్రగిరి శాసనాల్లోను కొండపల్లి బొమ్మల ప్రస్తావన ఉంది. రెడ్డిరాజుల నాటి ఘనమైన చరిత్రకు కొండపల్లి బొమ్మలు సాక్షిభూతాలు నిలిచాయి. 6 శతాబ్దాల క్రితమే ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీలోని కొండపల్లి అటవీ ప్రాంతంలో పురుడు పోసకున్న ఈ బొమ్మలు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో లభించే తెల్లపొనికి చెట్టుతో తయారైనట్టు చారిత్రక ఆధారాలు తేటతెల్లన చేస్తున్నాయి.

పడుతూ లేస్తూ నిలదొక్కుకున్న కళ

స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఇక్కడి హస్త కళాకారులకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తే, 2014లో టీడీపీ హయాంలోనే మంచి ప్రోత్సాహకాలు లభించాయి. నాటి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) రూ.90.50 లక్షలతో హస్తకళాకారుల కోసం నాలుగు వంతెనల సెంటర్ నుంచి ఖిల్లా రోడ్డు సెంటర్‌కు వెళ్లేమార్గంలో కొండపల్లి బొమ్మల తయారీ, విక్రయభవన సముదాయాన్ని నిర్మింపజేసి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వీరికెలాంటి ప్రోత్సాహకాలను అందించలేదు. మళ్లీ 2024లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొండపల్లి బొమ్మల తయారీదారులకు మంచి ప్రోత్సహకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.



వేధిస్తున్న కలప కొరత

కొండపల్లి, జి.కొండూరు, గంగినేనిపాలెం, మూలపాడు వరకు విస్తరించి ఉన్న కొండపల్లి రిజర్వు ఫారెస్టులో లభించే తెల్లపొనికి చెట్టుతో కొండపల్లి బొమ్మలు తయారవుతుంటాయి. కొండపల్లి, గంగినేనిపాలెం, జి.కొండూరు తదితర ప్రాంతాల్లో మాత్రమే ఈ చెట్లు అధికంగా లభిస్తాయి. కేవలం అటవీ, కొండ ప్రాంతంలోనే పెరిగే గుణమున్న ఈ చెట్ల కాయలు మంచి సువాసనతో పాటు రుచిగా ఉం డటంతో అడవుల్లో నేలపై పడిన వెంటనే వన్య ప్రాణులకు ఆహారంగా మారిపోతున్నాయి. అంతేకాక ఎన్టీటీపీఎస్‌తో పాటు మరి కొన్ని కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యం, అక్కడ జరిగే మైనింగ్ వల్ల తెల్లపొనికి చెట్లు అంతరించుకుపోయేందుకు కారణమని విజయవాడకు చెందిన ఓ కళాశాల అధ్యాపకుల అధ్యాయనంలో వెలుగు చూసింది.

తెల్లపొనికి రీ ప్లాంటేషన్ సాధ్యమేనా..?

రోజురోజుకు అంతరించిపోతున్న తెల్లపొనికి చెట్ల రీ ప్లాంటేషన్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల కొండపల్లి బొమ్మలను పరిశీలించేందుకు వెళ్లిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఫారెస్టు, రెవెన్యూ, ఉద్యానశాఖలతో ఒక సంయుక్త కమిటీ వేసి తెల్లపొనిక చెట్ల పెంపకంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది కనుక కార్యరూపం దాల్చితే తెల్లపొనికి కలప కొరత తీరుతుందని కళాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు ఏనుగు అంబారీ.. ఇప్పుడు డాన్సింగ్ డాల్



తొలినాళ్లల్లో కొండపల్లి బొమ్మ బ్రాండ్‌గా ఏనుగు అంబారీ ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని డాన్సింగ్ డాల్ కైవసం చేసుకుందని కళాకారులు అంటున్నారు. బొమ్మల్లో ప్రత్యేక ఆకర్షణగా ఫ్లూటు వాయిస్తున్న కృష్ణుడు బొమ్మ నిలుస్తుంది. ఇక వరి కంకులతో గుమ్మానికి అలంకరించుకునే బొమ్మతోపాటు అష్టలక్ష్మి సెట్, రామ పట్టాభిషేకం, వెన్న కృష్ణ, గ్రామీణ వృత్తి పనివారు, రథం, ఎండ్ల బండి, పలు రకాల జంతువులు, పక్షులు, చిన్నారుల ఆట వస్తువులు, కీ చైన్స్, గాజులు, గృహోపకరణాలు, పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు, పోపుల డబ్బా, రోకలి సెట్ వంటి బొమ్మలతో కలిపి మొత్తం 60 రకాల బొమ్మలను కళాకారులు తయారు చేస్తున్నారు.

కొండపల్లి బొమ్మపై పాట

ఇంతటి ఘన చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు బొమ్మల ముస్కాన్ టాయ్స్ సమర్పణలో కళాకారుడు, బొమ్మల విక్రయదారుడు షేక్ మొహమ్మద్ ఓ అద్భుతమైన పాటను రచించారు. బొమ్మ తయారీ విధానం, విశిష్టతను పాటలో తెలిపాడు. షేక్ మీరావలి సంగీతంతో పాటు స్వరకల్పన చేశాడు. "కొండపల్లి కొయ్యతో చేసిన బొమ్మరా ఇది. తెల్లపొనిక చెట్టుతో చెక్కిన బొమ్మరా ఇది. చేనేత చేతితో చెక్కిన బొమ్మరా ఇది. కృష్ణమ్మ నీళ్లతో రూపు దాల్చిన బొమ్మరా ఇది. అంటూ సాగే పాటను యూట్యూబ్‌లో వినవచ్చని చెబుతున్నాడు.

కళ్లు తిప్పుకోలేని అందం



విజయవాడ లాంటి మహా నగరాల్లో డ్వాక్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన కొండపల్లి బొమ్మలను చూసిన వీక్షకులు కళ్లు తిప్పుకోలేకపోయారు. ఒక్క విజయవాడ నగరంలోనే కాక రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కళాకారులు కోరుతున్నారు. దీనివల్ల బొమ్మల విక్రయాలు బాగా పెరుగుతాయనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.





దుర్గగుడిలో పరిశ్రుభంగా ఉన్న వివిధ ప్రదేశాలు.

దుర్గగుడిలో పారిశుధ్యానికి జై

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ పరిశుభ్రత ఉంటుందో అక్కడ మనస్సు వికసిస్తుందని లక్ష్మీదేవి విరాజిల్లుతుందని నమ్మిక. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు పిలుపు నిచ్చింది. మొదటిసారిగా ఈనెల 18న 3వ శనివారాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతా దివస్ నిర్వహించి ఎక్కడికక్కడ చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కార్యాలయాల్లో చెత్తను పూర్తిగా తొలగించాలంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో దేవాలయాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దుర్గగుడి ప్రాంగణంతోపాటు మెట్లమార్గాలు, కారిడార్లు, భక్తుల నడక మార్గాలు, క్యూలు, ఆలయ ప్రాంగణం, అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక శ్రద్ధతో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చారు. ఆలయ ప్రాంగణాలు, పరిశుభ్రంగా ఉంటే భక్తులు కూడా జై కొడతారన్న కారణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులు, ఈవో రామచంద్ర మోహన్ ఆధ్వర్యంలో ఆలయం మొత్తాన్ని పరిశుభ్రం చేశారు. కొండ పైన, దిగువన కనకదుర్గానగర్, ఘాట్ రోడ్డు, దుర్గాఘాట్, తదితర ప్రాంతాల్లో సంబంధిత విభాగాల అధికారులు పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఆలయం ప్రాంగణం పరిశుభ్రంగా ఉండటంతో భక్తులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు.



నిపుణులతో మాట్లాడుతున్న సీఆర్‌డీఏ అధికారులు

ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్‌పై సమావేశం

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేటలోని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) కార్యాలయంలో సోమవారం సీఆర్‌డీఏ అధికారులు ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్ గురించి నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎడ్జ్ అపెక్స్ సాఫ్ట్‌వేర్ ఉపయోగాలు, ప్రయోజనాలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో సుస్థిరమైన డిజైన్లను మెరుగుపరచటానికి ఈ సాఫ్ట్‌వేర్ ఎలా ఉపయోగపడుతుందో అధికారులకు వివరించారు. ఈ సెషన్‌లో ఐఎఫ్‌సీ ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్ గురించి వివరించారు. అమరావతి గ్రీన్ సిటీ యాక్షన్ ప్లాన్‌లను రూపకల్పనపై అధికారులతో చర్చించారు. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ డి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఆర్‌డీఏ గ్రూప్ డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని డ్రైవింగ్ క్షమించరాని నేరం

కృష్ణలంక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం క్షమించరాని నేరమని చిన్న నిర్లక్ష్యానికి నిండు ప్రాణాన్ని బలిచేసుకోవద్దని ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని డీటీసీ మోహన్, రవాణా శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీసీ మోహన్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించేందుకు 36వ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. బైక్ హెల్మెట్ ర్యాలీలో ఆర్టీవో కె.వెంకటేశ్వరరావు, మోటారు వాహన తనిఖీ అధికారులు శివరాం గౌడ్, ఉదయ్, శివప్రసాద్, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, సిబ్బంది, వాహన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పిల్లలకు ఆధార్‌కార్డులు

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిల్లలకు ఆధార్ కార్డులను జారీ చే యటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో 11.65 లక్షల మందికి పైగా చిన్నారులకు ఆధార్ కార్డులు లేవని గుర్తించారు. దీంతో మంగళవారం నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కార్డుల జారీకి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించటానికి అధికారులు సిద్ధమయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో సీపీ రాజశేఖరబాబు తదితరులు

జాతి సమైక్యత చాటిచెప్పేలా వేడుకలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

కృష్ణలంక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత చాటిచెప్పేలా గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 76వ గణతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత ఉట్టిపడేలా వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసి పరేడ్‌కు సిద్ధంగా ఉంచాలన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ పతాకావిష్కరణ చేస్తారన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమెల్సీలు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొనే ఈ వేడుకలకు తగిన ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రధాన వేదిక, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలలో ప్రొటోకాల్ అనుసరించి సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఎప్పటికప్పుడు ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వీఎంసీ అధికారులకు సూచించారు. వేడుకల్లో పాల్గొనే కంటింజెంట్ విభాగాల ప్రదర్శనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటేలా వివిధ శాఖల అలంకృత శకటాలను ముందుగానే సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని, వైద్య ఆరోగ్య సిబ్బందితో మెడికల్ క్యాంపును, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. నగర పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబు మాట్లాడుతూ వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసే వీఐపీ వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు వేడుకల రిహార్సల్స్ నిర్వహించి ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌తో పరేడ్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. వీవీఐపీ, వీఐపీలు ఇతర ప్రజాప్రతినిధులకు కేటాయించిన ప్రత్యేక సీట్లలో అసీనులయ్యేలా మార్గదర్శకాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో డీసీపీ గౌతమిషాలీ, ఆర్‌డీవో చైతన్య, సీఎం భద్రతాధికారులు, రాజ్‌భవన్ అధికారులు, పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఐఅండ్‌పీఆర్, రెవిన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యా, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.




జాతీయ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న డీఆర్వో లక్ష్మి నరసింహరావు

జాతీయపోటీల విజయవంతానికి కృషి

- జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహారావు

లబ్బీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్తంగా నగరంలో నిర్వహిస్తున్న 68వ అండర్-14 బాలబాలికల స్కూల్ గేమ్స్ జాతీయ సెపక్ తక్ర పోటీలు విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మి నరసింహరావు కోరారు. సోమవారం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాతీయ సెపక్ తక్ర పోటీల నిర్వహణ కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ పోటీలు పటమటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 24 నుంచి 27 వరకు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనే బాలబాలికలతో తల్లిదండ్రుల్లా మెలగాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ ఈ జాతీయ పోటీల్లో 15 రాష్ట్రాల బాల బాలికల జట్లకు, స్థానిక హోటల్స్‌లో ఉచిత బస ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలను కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని చిన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీలకు 4 కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, అందులో రెండు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం జాతీయ పోటీల లోగోను ఆవిష్కరించారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ సంయుక్త కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, ఎ.పి.రాజు, పోటీల కార్య నిర్వహణ కార్యదర్శి ఎస్.రమేష్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామంలో సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ సందడి చేశారు. హీరో బాలకృష్ణతో త్వరలో తీయబోయే అఖండ-2 చిత్రం కోసం లొకేషన్లను పరిశీలించారు.

మనస్తాపంతో ఉరేసుకున్న యువకుడు

విద్యాధరపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఊర్మిళానగర్‌కు చెందిన షేక్ బాజీ షరీఫ్ (26) తనకు ఒక కేసులో కోర్టులో శిక్ష పడుతుందేమోన న్న మనస్తాపంతో ఉరేసుకుని మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. అతడి తల్లి షేక్ ఆదాంబీ పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త 21 ఏళ్ల క్రితం చనిపోయాడు. అమ్మాయికి వివాహం కాగా, కుమారుడు షేక్ బాజీ షరీఫ్ ఆ టోనగర్‌లో రోజువారీ కూలీ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో 2018లో అతడిపై ఒక మహిళ తన వెంట పడ్డాడని, మనస్తాపంతో చనిపోవటంతో భవానీపురం పోలీసు స్టేషన్‌లో షరీఫ్‌పై కేసు నమోదైంది. పోలీసులు విచారణ చేపట్టి అతడిని నిందితుడిగా పేర్కొంటూ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. తనకు కోర్టులో శిక్ష పడుతుందేమోనని, మనస్తాపం చెందేవాడు. కాగా, సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆదాంబీ ఐరన్ యార్డులో పనికి వెళ్లింది. ఒంట్లో దడగా ఉండటంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికొచ్చి చూడగా షరీఫ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే తన తమ్ముడు సిద్ధయ్యకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వగా బంధువులతో పాటు సిద్ధయ్య సంఘటన స్థలానికి చేరుకున్నారు. కోర్టులో శిక్ష పడుతుందేమోనన్న అనుమానంతోనే ఉరేసుకున్నట్టు ఆదాంబీ పోలీసులకు తెలిపింది.

యువతరం చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

ఉంగుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువతరం చేతుల్లో ఉందని, మన సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కుటుంబ విలువలను కాపాడుకుని ముందు తరాలకు సగర్వంగా అందజేయాలన్నదే నా ఆకాంక్ష అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు యువతకు సూచించారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరుమండలం, ఆతౄ్కరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో వివిధ ట్రేడుల్లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతతో సోమవారం ఏర్పాటుచేసిన ముఖాముఖి (మాటామంతీ)లో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబవ్యవస్థ ప్రాముఖ్యత, విలువల గురించి యువతకు అవగాహన కల్పించారు. ఇటీవల దేశంలో కుటుంబ వ్యవస్థ బీటలు వారుతోందన్న వార్తలు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయని, విచ్చలవిడిగా పెరుగుతున్న సెల్‌ఫోన్ సంస్కృతి, సామాజిక మాధ్యమాలు కుటుంబ విలువలకు అడ్డంకులుగా మారుతున్నాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే కుటుంబ వ్యవస్థే కాదు, మానవసంబంధాలు కూడా తెగిపోతాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి. వివిధ శిక్షణా సంస్థల డైరెక్టర్లు, ఇన్‌చార్జులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత ఎదుట జనసేన నేత ఆత్మహత్యాయత్నం

మచిలీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గం గూడూరు మండల జనసేన కార్యదర్శి శీరం సంతోష్ సోమవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రపసాద్ ఎదుట పురుగుమందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గూడూరు మండల జనసేన కార్యదర్శి సంతోష్‌కు, గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామికి గతేడాది అక్టోబరులో వాగ్వాదం జరిగింది. దీంతో సంతోష్‌ను పోతన స్వామి, దుర్భలాడుకున్నారు. అప్పట్లో జనసేన నేతలు జనసేన అధిష్టానానికి. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఇరుపార్టీల నేతలు సామరస్య వాతావరణంలో సమస్యను పరిష్కరిస్తామని తొందరపడవద్దని అప్పట్లో చెప్పారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కంకటావలో రహదారి ప్రారంభోత్సవానికి సోమవారం వచ్చారు. ఈ సమయంలో సంతోష్ ఎమ్మెల్యేకారుకు అడ్డుపడి, కూటమి ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదని, టీడీపీ మండలాధ్యక్షుడు తనను దూషించినా పట్టించుకోలేదని చెప్పాడు. మీ సమస్యపై తప్పక మాట్లాడుతానని ఎమ్మెల్యే చెప్పి వెళతుండగా కారుకు అడ్డుపడిన సంతోష్ అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న పురుగుమందును తాగాడు. పోలీసులు సంతోష్ నుంచి పురుగుమందు డబ్బాను లాక్కుని స్థానికుల సాయంతో హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సంతోష్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన పోతనస్వామి మా ఇరువురికి ఉన్న వ్యక్తిగత విభేదాలతోనే సంతోష్ పురుగు మందు తాగాడని, పార్టీకి, ఈ ఘటనకు సంబంధం లేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

25, 26న సిద్ధాంత పండిత సభ

వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ ఆదేశానుసారం ఈనెల 25, 26న కొలనుకొండలోని కంచి కామకోటిలో సిద్ధాంత పండిత సభ నిర్వహిస్తున్నట్టు కంచి కామకోటి సర్వజ్ఞపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ముంబయి తదితర రాష్ట్రాల నుంచి కొందరు ప్రత్యక్షంగాను, మరికొందరు ఆన్‌లైన్‌లో పాల్గొంటారన్నారు. జ్యోతిష్య ఖగోళ పరిశోధనలపై ఆసక్తి కలిగిన పండితులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోర్టుకు హాజరైన అమరావతి రైతులు

విజయవాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం అలుపెరగని పోరాటం చేసిన రైతులు విజయవాడలోని మూడో ఏసీజే కోర్టుకు సోమవారం హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో 2020లో చెల్లించాల్సిన కౌలును చెల్లించకపోవడంతో సుమారుగా 100 మంది అమరావతి రైతులు గవర్నరుపేటలోని సీఆర్డీఏ కార్యాలయాన్ని 2021లో ముట్టడించా రు. దీనిపై గవర్నరుపేట పోలీసులు 45 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు వారు కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 14వ తేదీకి వాయిదా వేసింది.

రూ.173 లక్షల కోట్లు

2024లో ప్రపంచ బిలియనీర్లు పోగేసిన సంపద ఇది..



- రోజుకు సగటున రూ.49,305 కోట్ల చొప్పున పెరిగిన వెల్త్
- రూ.1,298 లక్షల కోట్లకు పెరిగిన వారి మొత్తం ఆస్తులు
- 2023తో పోలిస్తే మూడింతల వేగంతో పెరిగిన నెట్‌వర్త్
- గత ఏడాది నాటికి 2,769కి పెరిగిన ప్రపంచ బిలియనీర్లు
- డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సులో ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదల

దావోస్: గత ఏడాది ప్రపంచ బిలియనీర్ల సంపద 2 లక్షల కోట్ల డాలర్ల (రూ.173 లక్షల కోట్లు) మేర పెరిగి మొత్తం 15 లక్షల కోట్ల డాలర్లకు (రూ.1,298 లక్షల కోట్లు) చేరుకుందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ అధ్యయన నివేదిక వెల్లడించింది. 2023తో పోలిస్తే ప్రపంచ కుబేరుల ఆస్తి 2024లో మూడింతల వేగంతో వృద్ధి చెందిందని రిపోర్టు పేర్కొంది. 2024లో బిలియనీర్ల నెట్‌వర్త్ రోజుకు సగటున 570 కోట్ల డాలర్ల (రూ.49,305 కోట్లు) మేర పెరుగుతూ వచ్చిందని.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 2,565 మంది బిలియనీర్లుండగా.. గత ఏడాదిలో వీరి సంఖ్య 2,769కు పెరిగిందని నివేదిక తెలిపింది. క్రితం సంవత్సరంలో ప్రపంచ టాప్-10 కుబేరుల సంపద రోజుకు సగటున 10 కోట్ల డాలర్ల (రూ.865 కోట్లు) చొప్పున పెరుగుతూ వచ్చిందని.. ఉన్నపళంగా వారు ఆస్తిలో 99 శాతం కోల్పోయినా బిలియనీర్లుగానే కొనసాగుతారని రిపోర్టు పేర్కొంది. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.8650 కోట్లు) ఆస్తి కలిగిన వారిని బిలియనీరుగా పిలుస్తారు. స్విట్జర్లాండ్‌లోని దావో‌స్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు ప్రారంభ రోజున ఆక్స్‌ఫామ్ ఈ నివేదికను విడుదల చేసింది. కుబేరుల సంపదలో భారీగా వృద్ధి చెందుతూ వస్తోన్నప్పటికీ, 1990 నుంచి పేదల సంఖ్యలో తగ్గుదల మాత్రం నామమాత్రంగానే ఉందని రిపోర్టు పేర్కొంది.

ఆక్స్‌ఫామ్ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- గత సంవత్సరం ఆసియా బిలియనీర్ల ఆస్తి 29,900 కోట్ల డాలర్ల (రూ.25.86 లక్షల కోట్లు) మేర పెరిగింది. వచ్చే దశాబ్దకాలంలో కనీసం ఐదుగురు ట్రిలియనీర్లుగా (కనీసం లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వారు) అవతరించే అవకాశం ఉంది.
- 2024లో కొత్తగా 204 మంది బిలియనీర్లుగా అవతరించారు. అంటే, వారానికి సుమారు నలుగురు చొప్పున కొత్తగా ఈ జాబితాలో చేరారు. గత ఏడాది ఆసియా నుంచి 41 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారు.
- 2023లో ఆర్థిక వ్యవస్థ ద్వారా ఉత్తర ప్రపంచంలోని ఒక శాతం సంపన్నులు దక్షిణ ప్రపంచం నుంచి గంటకు 3 కోట్ల డాలర్ల మేర ఆర్జించారు. వలస పాలన విధానం ఎప్పుడో ముగిసిందని చాలా మంది భావించారు. కానీ, దక్షిణ ప్రపంచ దేశాల నుంచి సంపద అధిక శాతం కుబేరులున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ఉత్తర ప్రపంచ దేశాలకు తరలిపోతున్నది.
- ప్రపంచ సంపదలో 69 శాతంతోపాటు బిలియనీర్ల సంపదలో 77 శాతం ఉత్తర ప్రపంచ దేశాల వద్దే కేంద్రీకృతమై ఉంది. అంతేకాదు, ప్రపంచ మొత్తం జనాభాలో ఉత్తర దేశాల వాటా 21 శాతమే. కానీ, ప్రపంచ బిలియనీర్లలో 68 శాతం ఈ ప్రాంతానికి చెందినవారే.
- ప్రస్తుత బిలియనీర్లలోని 60 శాతం మందికి సంపద వారసత్వం లేదా గుత్తాధిపత్యం లేదా ఆశ్రిత సంబంధాల ద్వారా సమకూరిందే. అంటే, వీరి సంపదలో అధిక శాతం అర్హత లేని ఆర్జనేనని ఇది సూచిస్తుంది. ఆర్థిక అసమానతలను తగ్గించడంతోపాటు ధనికస్వామ్యాన్ని నిరోధించేందుకు సంపన్నులపై మరిన్ని పన్నులు విధించాలి.
- బిలియనీర్ల సంపదలో 36 శాతం వారసత్వంగా వచ్చిందే. 18 శాతం గుత్తాధిపత్యం, 6 శాతం ఆశ్రిత పక్షపాత సంబంధాల ద్వారా సమకూరిందే.
- 1,000 మందికి పైగా బిలియనీర్లు 5.2 లక్షల కోట్ల డాలర్లకు పైగా తమ సంపదను వచ్చే 2-3 దశాబ్దాల్లో వారి వారసులకు బదిలీ చేయవచ్చని యూబీఎస్ అంచనా వేసింది. ఫోర్బ్స్ అధ్యయనం ప్రకారం.. 30 ఏళ్లలోపు ప్రతి బిలియనీర్‌కు సంపద వారసత్వంగా లభించిందే.
- రోజుకు 6.85 డాలర్లు (రూ.593) అంతకంటే తక్కువ సంపాదనతో జీవితం వెళ్లదీస్తున్న వారి సంఖ్యలో 1900 నుంచి పెద్ద మార్పేమీ లేదు.

భారత్ నుంచి బ్రిటన్ దోచుకున్న సొమ్ము రూ.5,607 లక్షల కోట్లు

- అందులో సగం 10 శాతం సంపన్నుల చేతుల్లోకే..
- ఆ డబ్బుతో లండన్ ఉపరితల భాగాన్ని 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయొచ్చు..

దావోస్: శతాబ్దకాలానికి పైగా భారత్‌ను పాలించిన బ్రిటన్ మన దేశ సంపదను భారీగా కొల్లగొట్టిన విషయం అందరికీ తెలిసిందే. భారత్ నుంచి బ్రిటన్ ఎంత మేర దోచుకుందనే విషయంపై ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ బయటపెట్టింది. 1765 నుంచి 1900 మధ్య కాలంలో జరిగిన వలస పాలనలో బ్రిటన్ మన దేశం నుంచి ప్రస్తుత విలువ ప్రకారం 64.82 లక్షల కోట్లు డాలర్లు (సుమారు రూ.5,607 లక్షల కోట్లు) దోచుకుందని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక అంచనా వేసింది. అందులో 52 శాతం.. అంటే 33.8 లక్షల కోట్ల డాలర్లు (రూ.2,924 లక్షల కోట్లు) 10 శాతం సంపన్నుల జేబుల్లోకే వెళ్లిందని నివేదిక పేర్కొంది. ఆ డబ్బుతో బ్రిటన్ రాజధాని లండన్ ఉపరితల భాగాన్ని 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయవచ్చని అంటోంది. ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చాలావరకు కుబేర కుటుంబాల సంపద వలసపాలన సమయంలో ఆర్జించిందేనని రిపోర్టు పేర్కొంది. 1750లో ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 25 శాతం వాటా భారత ఉపఖండానిదేనని, 1900 నాటికది 2 శాతానికి పడిపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది.

విశ్వాస సూచీలో 3 స్థానానికి జారిన భారత్

ప్రభుత్వం, వ్యాపారాలు, మీడియా, ఎన్‌జీఓలపై ప్రజల నమ్మకం విషయంలో భారత్ రెండు నుంచి మూడో స్థానానికి జారుకుందని ఎడెల్‌మెన్ ట్రస్ట్ బారోమీటర్ 25వ వార్షిక నివేదిక వెల్లడించింది. దేశంలోని సంపన్న వర్గంతో పోలిస్తే అల్పాదాయ జనాభాలో విశ్వసనీయత మరింత లోపించిందని రిపోర్టు పేర్కొంది. ఈ సూచీలో చైనా, ఇండోనేషియా వరుసగా 1, 2 స్థానాల్లో నిలిచాయి. జపాన్, యూకే అట్టడుగున ఉన్నాయి. కాగా, ఇతర దేశాల ప్రజలు, దేశంలో ప్రధాన కార్యాలయం కలిగిన విదేశీ కంపెనీలను నమ్మే విషయంలో భారత్ 13వ స్థానంలో ఉంది.

హైదరాబాద్‌లో కంట్రోల్‌ఎస్ 600 మెగావాట్ల డేటాసెంటర్ పార్క్

చందన్‌వెల్లి పార్క్‌లో 40 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంట్రోల్‌ఎస్ డేటాసెంటర్స్.. హైదరాబాద్‌లో కొత్త డేటా సెంటర్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్ సమీపంలో కొత్తగా అభివృద్ధి చేస్తున్న చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో 40 ఎకరాల విస్తీర్ణంలో 600 మెగావాట్ల ఐటీ లోడ్ సామర్థ్యంతో ఈ పార్క్‌ను నెలకొల్పాలని చూస్తున్నట్లు తెలిపింది. అయితే ఈ పార్క్ అభివృద్ధి కోసం ఎంత మేరకు పెట్టుబడులు పెడుతుందనే వివరాలను మాత్రం కంట్రోల్‌ఎస్ వెల్లడించలేదు. ఈ పార్క్ తొలి దశ కోసం ఇప్పటికే 250 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అనుమతులు లభించినట్లు పేర్కొంది. కాగా భవిష్యత్తులో ఈ డేటాసెంటర్ పార్క్‌కు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు 900 మెగావాట్ల వరకు డెడికేటెడ్ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ (జీఐఎస్) ఉండేలా తీర్చిదిద్దుతున్నట్లు కంట్రోల్‌ఎస్ తెలిపింది. హై డెన్సిటీ, అల్ట్రా-హై డెన్సిటీ, ఏఐ రెడీ, డేటాసెంటర్ భవనాల అనుసంధానం వంటి ఫీచర్లను కంట్రోల్‌ఎస్ చందన్‌వెల్లి డేటాసెంటర్ పార్క్ కలిగి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం కంట్రోల్‌ఎస్.. హైటెక్‌సిటీలో ఒకటి, గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రెండు డేటా సెంటర్లను నిర్వహిస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	141
వరంగల్	125	గుంటూరు	137
కరీంనగర్	125	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	107
కర్నూలు	125	నెల్లూరు	112
విశాఖపట్నం	132	అనంతపురం	112
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ

హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,230 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,800 ▼	77,000 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,280 ▼	72,670 ▼	91,520 ▼
రాజమండ్రి	81,270 ▼	74,500 ▲	93,500 ▼
ప్రొద్దుటూరు	80,150 ▼	74,220 ▼	93,000 ▼
ముంబై	79,345 ▲	72,680 ▲	90,200 ▼

‘ట్రంప్’ కార్డ్‌తో మార్కెట్లలో జోష్

ముంబై: ప్రపంచ మార్కెట్ల పటిష్ఠ సంకేతాల నడుమ బ్యాంకింగ్, ఫైనాన్షియల్, పవర్ విభాగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగడంతో ఈక్విటీ మార్కెట్ సోమవారం లాభాల బాట పట్టింది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో తాను టెలిఫోన్‌లో సంభాషించానని, అది సానుకూల ఫలితం అందించిందని అమెరికా అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ప్రపంచ మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. టారిఫ్‌ల పెంపు విషయంలో ట్రంప్ కాస్తంత సంయమనం పాటించి చర్చలకే మొగ్గు చూపవచ్చునన్న సంకేతంగా దీన్ని విశ్లేషకులు అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లన్నీ లాభాల్లో ట్రేడ్ కావడం దేశీయ మార్కెట్లో సెంటిమెంట్ పెరగడానికి దోహదపడింది. దీంతో సెన్సెక్స్ 454.11 పాయింట్ల లాభంతో 77,073.44 వద్ద ముగియగా నిఫ్టీ 141.55 పాయింట్ల లాభంతో 23,344.75 వద్ద ముగిసింది.

బిట్‌కాయిన్ @ 1.09 లక్షల డాలర్లు

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ పగ్గాలు చేపట్టబోతున్న నేపథ్యంలో బిట్‌కాయిన్ విలువ సోమవారం దూసుకుపోయింది. దాని విలువ 1,09,000 డాలర్లను తాకింది. ఒకప్పుడు క్రిప్టో కరెన్సీలను తీవ్రంగా వ్యతిరేకించిన ట్రంప్ తదుపరి తన వైఖరి మార్చుకుని ఇప్పుడు క్రిప్టో అనుకూల వైఖరి అనుసరిస్తున్నారు. దీంతో అధికార పగ్గాలు చేపట్టగానే ఆయన డిజిటల్ కరెన్సీలను ప్రోత్సహించే చర్యలు తీసుకోవచ్చునన్న ఆశలు బిట్‌కాయిన్ పరుగులు తీయడానికి దోహదపడినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ తన క్యాబినెట్ సహచరులుగాను, నియంత్రణా సంస్థల అధిపతులుగాను క్రిప్టో మద్దతుదారులకే పట్టం కట్టడంతో శుక్రవారం 5% లాభపడిన బిట్‌కాయిన్ సోమవారం 9,000 డాలర్లకు పైగా దూసుకుపోయి 1,09,000 డాలర్లు పలికింది.

నా మొదటి సంపాదన రూ. 10,000



గౌతమ్ అదానీ

అహ్మదాబాద్: ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ తన వ్యాపార, పారిశ్రామిక ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జీవిత అనుభవాలతోనే ఎవరికైనా వివేకం వస్తుందన్నారు. విజ్ఞానం మాత్రం బాగా చదివితేనే వస్తుందన్నారు. అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసిన అదానీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ జీవిత సత్యాలు చెప్పారు. కాలేజీ మానేసి 16 ఏళ్ల వయసులో కేవలం రైలు టిక్కెట్‌కు సరిపడా డబ్బులతో ముంబై చేరిన తాను ఎన్ని కష్టాలు పడిందీ వివరించారు. చిన్న వయసులోనే బతుకుదెరువు కోసం ముంబై చేరడం, అక్కడ ఒక వజ్రాల ట్రేడింగ్ కంపెనీలో చేరి మూడేళ్లలోనే ఆ వ్యాపారంలోని మెళకువలు ఆకళింపు చేసుకుని వజ్రాల ట్రేడింగ్ కోసం సొంత బ్రోకరేజీ సంస్థను ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు. ఈ బ్రోకరేజీ వ్యాపారంలో 1981లో 19 ఏళ్ల వయసులో తొలి ట్రేడింగ్‌లోనే రూ.10,000 కమీషన్ సంపాదించిన విషయాన్నీ ఆయన వెల్లడించారు. ‘ఒక జపాన్ కొనుగోలుదారుడితో నేను జరిపిన మొదటి ట్రేడింగ్ నాకు ఇంకా గుర్తుంది. ఆ తొలి ట్రేడింగ్‌లోనే నాకు రూ.10,000 కమీషన్ లభించింది. అప్పుడు నా వయసు 19 సంవత్సరాలు. ఒక ఔత్సాహిక వ్యాపారవేత్తగా అది నా తొలి ప్రయాణం’ అన్నారు.

అంచెలంచెలుగా ఎదిగా: ఆ తరువాత అహ్మదాబాద్‌కు తిరిగి వచ్చి తన అన్న కొనుగోలు చేసిన ఒక చిన్న పీవీసీ ఫిల్మ్ ఫ్యాక్టరీ నడపడంలో సహాయ పడడం, 1988లో సొంతంగా అదానీ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో కమోడిటీస్ ట్రేడింగ్ సంస్థను ఏర్పాటు చేసి, అంచెలంచెలుగా ఎలా వివిధ వ్యాపారాల్లో ఎదిగిందీ అదానీ విద్యార్థులకు వివరించారు. జీవితంలో ఎన్ని అపజయాలు, ఎదురుదెబ్బలు తగిలినా ఎదగాలనే లక్ష్యం నుంచి నీరుగారి పోవద్దని విద్యార్థులను కోరారు. జీవితంలో ఎదగాలని కలలు కనడం సంపన్నులకు మాత్రమే పరిమితమైన సొత్తు కాదన్నారు.


చిత్రజ్యోతి
SINCE 1965

ఇకపై మంచి సినిమాలే చేస్తా

● రామ్‌గోపాల్ వర్మ భావోద్వేగ లేఖ



రామ్‌గోపాల్ వర్మ 1998లో తెరకెక్కించిన కల్ట్ క్లాసిక్ ‘సత్య’ చిత్రాన్ని ఇటీవలే రీ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన రామ్‌గోపాల్ వర్మ ఎక్స్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. “ఇటీవలే ‘సత్య’ సినిమా చూశాను. 27 ఏళ్ల తర్వాత ఈ సినిమా చూస్తుంటే నా ప్రమేయం లేకుండానే కన్నీళ్లు వచ్చేశాయి... ఇలాంటి గొప్ప సినిమాను నేనే తీశానా అనే ఆనందంతో. ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడంలాంటిదే. ‘సత్య’ తర్వాత ఎన్నో సినిమాలు చేశాను. కానీ, వాటి ఫలితాలను పట్టించుకోకుండా ముందుకు సాగాను. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి.. ఎంతో మంది నమ్మకాన్ని గెలుచుకుందీ సినిమా. కానీ అందరి నమ్మకాన్ని నేను వమ్ము చేశాను. ఈ సినిమా విజయాన్ని ఓ కొలమానంగా మలుచుకోలేకపోయాను. నేను తాగుబోతుగా మారాను. నేను చేసిన సినిమాలు ఇచ్చిన విజయం, అహంకారంతో నా కళ్లు నెత్తికెక్కాయి. ‘సత్య’, ‘రంగీలా’ సినిమాలు ఇచ్చిన విజయాలతో నా కళ్లు మూసుకుపోయాయి. దీంతో ఇష్టమొచ్చిన రీతిలో సినిమాలు చేశా. ప్రేక్షకులను ఆశ్చర్యపరచాలని ఎన్నో జిమ్మిక్కులు చేశా. అసభ్యకరమైన సన్నివేశాలతో అర్థం పర్థం లేని రీతిలో సినిమాలు చేశా. సాధారణ కథతోనూ మంచి ఎలివేషన్ ఉన్న సినిమాలు తీయవచ్చనే విషయం మరిచాను. అయినప్పటికీ కొన్ని సినిమాలు సక్సెసయ్యాయి. కానీ ‘సత్య’ సినిమాలా ఉన్నతంగా అవి లేవు. పరిశ్రమ నాకు ఎన్నో అవకాశాలిచ్చింది. కానీ నేను ఉపయోగించుకోలేకపోయాను. నేను చేసిన తప్పులను ఎలాగో ఇప్పుడు సరిదిద్దుకోలేను. కానీ ఇకపై దర్శకుడిగా నన్ను మంచి స్థాయిలో నిలబెట్టే సినిమాలే తీస్తాను. ‘సత్య’ లాంటి సినిమాను నేను మళ్లీ తీయలేకపోవచ్చు. కానీ అలాంటి తరహా సినిమాల్ని మీ ముందుకు తీసుకురావడానికి మాత్రం నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఇకపై ప్రతీ సినిమాను తెరకెక్కించే ముందు ‘సత్య’ సినిమా తప్పక చూస్తాను. ‘సత్య’పై చూపించినంత నిజాయితీ ఇక మీదట నేను చేయబోయే ప్రతీ సినిమాపై చూపిస్తాను. ఇప్పటివరకూ తీసిన చిత్రాలకు ఈ నియమాన్ని పాటించి ఉంటే నా సినిమాల్లో 90 శాతం తెరకెక్కి ఉండేవే కాదు. చివరగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా జీవితంలో ఇంకా సగభాగం మిగిలే ఉంది. ఈ మిగిలిన సమయాన్ని ‘సత్య’ లాంటి సినిమాలు తీయడానికి వెచ్చిస్తాను. ఇదే సత్యం. ఇది నా ‘సత్య’ సినిమాపై ప్రామిస్ వేసి మరీ చెబుతున్నాను” అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



శివుడి పాత్ర పోషించడం అదృష్టం

అక్షయ్‌కుమార్


మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ‘కన్నప్ప’. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో డా.మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో నటిస్తున్న పలువురు నటీనటుల ఫస్ట్ లుక్‌లను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా, ఈ సినిమా నుంచి అక్షయ్‌కుమార్ పోషిస్తున్న పరమ శివుడి లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు’ అని పేర్కొన్నారు. పోస్టర్‌లో ఆయన శివ తాండవం చేస్తున్నారు. ‘ఇలాంటి ఓ అద్భుతమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఎంతో పవిత్రమైన ఆ పరమశివుడి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ ప్రయాణంలో మనందరికీ శివుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా. ఓం నమః శివాయ’ అని అక్షయ్‌కుమార్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ముగ్గురు స్నేహితుల కథ



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘భైరవం’. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ కథ వారాహి గుడి, ముగ్గురు స్నేహితుల చుట్టూ సాగుతుంది. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ‘ఈసారి మంచి కథాబలం ఉన్న సినిమాతో రావాలని నిర్ణయించుకునే వస్తున్నాం. అలా మంచి కథ కోసం మొదలైన వేటలో ‘భైరవం’ దొరికింది. ఈ సినిమా మమ్మల్ని మరో మెట్టు పైకి తీసుకెళ్తుందని కోరుకుంటున్నా’ అని అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ ‘ఇది టీజర్ మాత్రమే. ట్రైలర్ అదిరిపోతుంది. సినిమా దుమ్ము లేచిపోతుంది. మీ అందరి బ్లెస్సింగ్స్ ఉంటాయని ఆశిస్తున్నా’ అని అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ ‘ఇది నాకు బాగా గుర్తుండి పోయే చిత్రం అవుతుంది. థియేటర్లలో సినిమా చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నా’ అని అన్నారు.

హృదయాలను హత్తుకునే సినిమా



ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘గాంధీ తాత చెట్టు’. పద్మావతి మల్లాది దర్శకురాలు. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఎన్నో అవార్డులను దక్కించుకున్న ఈ చిత్రం ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మల్లాది మీడియాతో ముచ్చటించారు. ‘నాకు స్వతహాగా పచ్చదనం, చెట్టు అంటే చాలా ఇష్టం. మొక్కల గురించి తదుపరి తరం వాళ్లకు చెప్పాలనే సంకల్పంతో ఈ కథ రాసుకున్నాను. ఒక అమ్మాయి అహింసవాదంతో ఊరిని, చెట్టును ఎలా కాపాడింది అనేది ఈ చిత్ర కథ. పూర్తి సందేశంతో పాటు కమర్షియాలిటీ ఉన్న సినిమా. తప్పకుండా అందరి హృదయాలను హత్తుకుంటుంది. ఈ కథ 1947లో గాంధీగారు చనిపోయినప్పుడు తాత నాటిన చెట్టుతో ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో అహింస గురించి చెప్పాను. మనుషుల మధ్య నేచర్ మధ్య అహింస చాలా అవసరం’ అని అన్నారు.

నటుడు విజయ రంగరాజు మృతి

● చెన్నైలో అంత్యక్రియలు పూర్తి



నందమూరి బాలకృష్ణ నటించిన ‘భైరవ ద్వీపం’లో మాంత్రికుడి పాత్రతో అందరి దృష్టినీ ఆకర్షించిన విజయ రంగరాజు (68) చెన్నైలో సోమవారం మృతి చెందారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక షూటింగులో గాయపడిన ఆయన్ని చెన్నైకు తీసుకొచ్చి, కొద్ది రోజుల పాటు ఇంటిపట్టునే ఉంచి వైద్యం చేయించారు. మూడు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో గిండిలోని కలైంజర్ సెంటినరీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తూ వచ్చారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం వేకువజామున 3.30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచినట్టు ఆయన రెండో కుమార్తె పద్మిని ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. సాయంత్రం స్థానిక నెసపాక్కం శ్మశానవాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి. విజయ రంగరాజుకు భార్య కస్తూరి, కుమార్తెలు దీక్షిత, పద్మిని ఉన్నారు. విజయరంగరాజు అసలు పేరు రాజ్‌కుమార్. 1973లో వచ్చిన ‘సీతాకల్యాణం’ ఆయన తొలి చిత్రం. అప్పటి నుంచి వివిధ భాషల్లో నటుడిగా, ఫైటర్‌గా, ఫైట్ మాస్టర్‌గా ఐదు వేల చిత్రాలకు పని చేశారు. సుమన్ నటించిన ‘నేటి భారతం’ చిత్రంలో విలన్‌గా నటించిన రాజ్‌కుమార్ పేరునే కాకుండా నట జీవితాన్నే మార్చేసిన చిత్రం ‘భైరవ ద్వీపం’. ఆ సినిమా నుంచే తన పేరుని విజయరంగ రాజుగా మార్చుకున్నారు రాజ్‌కుమార్. ‘శ్రీకృష్ణార్జున విజయం’ చిత్రంలో భీముడిగా నటించిన రంగరాజుకు ‘యజ్ఞం’ చిత్రం మరోసారి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత దాదాపు ఓ వంద సినిమాల్లో నటించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్

యాక్షన్ థ్రిల్లర్



టోవినో థామస్, త్రిష ప్రధాన పాత్రల్లో అఖిల్ పాల్, అనాస్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ఐడెంటిటీ’. మలయాళంలో విడుదలై 2025లో తొలి హిట్‌గా నిలిచిన ఈ సినిమాని మామిడాల శ్రీనివాస్, చింతపల్లి రామారావు తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 24న విడుదలవుతున్న ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను సోమవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మామిడాల శ్రీనివాస్ మాట్లాడుతూ ‘దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మలయాళంలో విడుదలై రూ.40 కోట్లకు పైగా వసూలు చేసింది’ అని చెప్పారు. చింతపల్లి రామారావు మాట్లాడుతూ ‘దర్శక ద్వయానికి ఈ చిత్రం ద్వారా తెలుగులో మంచి ఐడెంటిటీ వస్తుందని ఆశిస్తున్నా. యాక్షన్ థ్రిల్లర్ అయిన ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా వినోదపరుస్తుందని ఆశిస్తున్నా’ అని అన్నారు.

రూ. వెయ్యి కోట్ల సినిమా.. తెలుగులో



హాంగ్ కాంగ్ సినీ చరిత్రలో రూ. వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రం ‘హాంగ్ కాంగ్ వారియర్స్’. లూయిస్ కూ, సమ్మో కామ్, బో హంగ్, రిచీ ప్రధాన పాత్రలు పోషించిన ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళంలో కూడా ఈ నెల 24న ప్రముఖ పంపిణీ సంస్థ ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తోంది. సోయ్ చీయాంగ్ ఈ సినిమాకు దర్శకుడు.

అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది



ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘హత్య’. శ్రీ విద్యా బసవ దర్శకత్వంలో ఎస్.ప్రశాంత్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ ‘ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. రవి చాలా అద్భుతంగా నటించారు. ఆయన పాత్రకు అందరూ కనెక్ట్ అవుతారు. సుధ పాత్రలో ధన్య అందరినీ ఆకట్టుకుంటుంది. నేను ఓ దర్శకురాలిగా మరిన్ని ఉమెన్ సెంట్రిక్ కథలు, క్యారెక్టర్లు రాయాలని అనుకుంటున్నా’ అని అన్నారు.



పంత్‌కే 'లఖ్‌నవూ' పగ్గాలు

కోల్‌కతా: ఐపీఎల్ ఫ్రాంచైజీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నూతన కెప్టెన్‌గా రిషభ్ పంత్ వ్యవహరించనున్నాడు. జట్టు యజమాని సంజీవ్ గోయెంకా, మెంటార్ జహీర్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం కెప్టెన్ పరిచయ కార్యక్రమం జరిగింది. 'నా మీద నమ్మకం ఉంచినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు. జట్టు కోసం నేను 200 శాతం అంకితభావంతో ఆడతాను. మీ నమ్మకాన్ని వమ్ముచేయకుండా నా శక్తిమేర పోరాడతాను' అని పంత్ పేర్కొన్నాడు. గతేడాది జరిగిన ఆటగాళ్ల వేలంలో పంత్‌ను లఖ్‌నవూ జట్టు రూ.27 కోట్ల రికార్డు ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

నైజీరియా సంచలనం

న్యూజిలాండ్‌పై విజయం

అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో పసికూన నైజీరియా చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టోర్నీలో పాల్గొంటున్న ఈ ఆఫ్రికా జట్టు పటిష్ట న్యూజిలాండ్‌ను రెండు పరుగుల తేడాతో కంగుతినిపించింది. దీంతో వరుసగా రెండో ఓటమితో కివీస్ సూపర్ సిక్స్‌కు దూరమైంది. సోమవారం జరిగిన ఈ గ్రూప్ 'సి' పోరును వర్షం కారణంగా 13 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా 65/6 స్కోరు చేసింది. ఆ తర్వాత ఛేదనలో కివీస్ పోరాడినా నిర్ణీత 13 ఓవర్లలో 63/6 స్కోరు చేసి ఓడింది. ఉడే (3-0-8-1) ప్రత్యర్థిని కట్టడి చేసింది.

సమోవా 16 ఆలౌట్: మరో అరంగేట్ర జట్టు సమోవా.. దక్షిణాఫ్రికా ధాటికి కుదేలైంది. వీరి బౌలర్ల ధాటికి సమోవా 9.1 ఓవర్లలో కేవలం 16 పరుగులకే కుప్పకూలింది. అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా, ఐదుగురు డకౌట్‌గా వెనుదిరిగారు. ఆ తర్వాత సౌతాఫ్రికా అమ్మాయిలు తమ ఛేదనను 1.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో ముగించారు. పది వికెట్ల తేడాతో నెగ్గిన దక్షిణాఫ్రికా రెండు విజయాలతో సూపర్ 6కి అర్హత సాధించింది. అలాగే గ్రూప్ 'డి'లో బంగ్లాదేశ్‌పై గెలిచిన ఆస్ట్రేలియా నాలుగు పాయింట్లతో సూపర్ 6కి చేరగా, ఇదే గ్రూప్‌లో నేపాల్‌పై స్కాట్లాండ్ నెగ్గింది. ఇతర మ్యాచుల్లో ఐర్లాండ్‌పై అమెరికా, పాకిస్థాన్‌పై ఇంగ్లండ్ నెగ్గాయి. కాగా.. గ్రూప్-ఎలో భాగంగా డిఫెండింగ్ చాంప్ భారత్ తన రెండో మ్యాచ్‌ను మలేసియాతో మంగళవారం తలపడనుంది.





ప్రియా సరోజ్

ఎంపీతో రింకూ పెళ్లి ఖరారు

న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్ రింకూ సింగ్ త్వరలో ఓ ఇంటివాడు కానున్నాడు. సమాజ్‌వాది పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో అతడి వివాహం ఖరారైనట్టు కుటుంబ వర్గాలు తెలిపాయి. ఈ నెల 16న రింకూ తండ్రితో పెళ్లి గురించి మాట్లాడినట్టు ప్రియ తండ్రి, ఎమ్మెల్యే తుఫానీ సరోజ్ చెప్పారు. పెళ్లికి ఇరు కుటుంబాలు సమ్మతి తెలియజేశాయన్నారు. 'ప్రియ, రింకూ మధ్య ఏడాదికిపైగానే పరిచయం ఉంది. కుటుంబ సభ్యుల అనుమతితో ఒకటి కావాలనుకొన్నార'ని తుఫానీ చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత నిశ్చితార్థం, వివాహ ముహూర్తాన్ని నిర్ణయిస్తామన్నారు. రింకూ క్రికెట్ షెడ్యూల్‌కు కూడా ఇబ్బంది కలగకుండా కార్యక్రమాన్ని జరిపిస్తామని తెలిపారు. సింగ్ ఇంట్లో ఇరు కుటుంబాలు తాంబూలాలు కూడా మార్చుకొన్నాయి. కాగా, గత కొన్ని రోజులుగా రింకూ పెళ్లిపై ఊహాగానాలు వస్తున్న సంగతి తెలిందే.



కొడుకు కొనిచ్చిన బైక్‌పై రయ్..రయ్

రింకూ సింగ్ తండ్రి ఖన్‌చంద్ర సింగ్ అలీగఢ్ వీధుల్లో కవాసాకి నింజా స్పోర్ట్స్ బైక్‌పై రయ్.. రయ్ మంటూ దూసుకెళ్తున్నాడు. గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసే ఖన్‌చంద్ర రూ. 5 లక్షల ఖరీదైన బైక్‌పై ఆఫీసుకు వెళ్తున్న వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. అయితే, ఈ బైక్‌ను తన తండ్రికి రింకూ బహుమతిగా ఇచ్చాడట. తండ్రికి ఖరీదైన బైక్‌ను కొనిచ్చిన రింకూపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



ఖో-ఖో వరల్డ్‌కప్‌లో మనోడి మెరుపులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశానికి తొలి ఖో-ఖో వరల్డ్‌కప్‌ను అందించిన భారత పురుషల జట్టులో తెలుగు తేజం పోతిరెడ్డి శివారెడ్డి అసామాన్య ప్రతిభ దాగి ఉంది. బాపట్ల జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన శివారెడ్డి ఈ టోర్నీ ప్రారంభం నుంచి ఫైనల్ వరకు జరిగిన మొత్తం ఏడు మ్యాచ్‌ల్లోనూ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలి మ్యాచ్‌లో నాలుగు పాయింట్లు సాధించిన శివారెడ్డి బెస్ట్ ఎటాకర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా ప్రతి మ్యాచ్‌లో నాలుగు పాయింట్లు తగ్గకుండా సాధించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. కఠినమైన ప్రత్యర్థులైన నేపాల్, శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లపైనా శివారెడ్డి అద్భుత ప్రదర్శన కనబర్చడం భారత జట్టు విజయాలకు బాగా ఉపకరించింది. శివారెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఈనెల 28 నుంచి జరిగే జాతీయ క్రీడల్లో బరిలోకి దిగనుంది.

రైల్లో కింద కూర్చొని..: చిన్న రైతు కుటుంబం నుంచి వచ్చిన శివారెడ్డి కెరీర్ ప్రారంభంలో అనేక ఇబ్బందులు పడ్డాడు. శివారెడ్డి ప్రతిభను గుర్తించిన కోచ్ సీతారాంరెడ్డి అద్దంకిలోని ఎస్ఆర్ఆర్ ఖో-ఖో అకాడమీలో అతడిని తీర్చిదిద్ది జాతీయ స్థాయి క్రీడాకారుడిగా తయారు చేశారు. కెరీర్ తొలినాళ్లలో శివారెడ్డి జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర తరపున ఆడేందుకు రైలులో జనరల్ బోగీలో కింద కూర్చొని 35 గంటలకు పైగా ప్రయాణం చేసి వెళ్లేవాడు. ఖో-ఖో ఆడి ఏం సాధిస్తావంటూ హేళన చేసిన వారికి ఈ వరల్డ్‌కప్ విజయమే సమాధానమని శివారెడ్డి ఇప్పుడు గర్వంగా చెబుతున్నాడు.

స్టార్ల జోరు

క్వార్టర్స్ రంజు



సిన్నర్

ఆస్ట్రేలియన్ ఓపెన్

- సిన్నర్, స్వియటెక్, స్విటోలినా ముందుకు
- రిబకినా, కసట్కినా ఇంటిబాట

మెల్‌బోర్న్: స్టార్లంతా దూకుడు ప్రదర్శిస్తుండడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్స్ రంజుగా సాగనున్నాయి. టైటిల్ ఫేవరెట్లు కార్లోస్ అల్కారజ్, నొవాక్ జొకోవిచ్ రౌండ్-8లో అమీతుమీ తేల్చుకొనేందుకు సిద్ధమవగా..తాజాగా డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్‌తోపాటు మహిళల రెండో సీడ్ ఇగా స్వియటెక్ కూడా క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన నాలుగో రౌండ్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 3-6, 6-3, 6-2తో 13వ సీడ్ రూన్ (డెన్మార్క్)పై విజయంతో క్వార్టర్స్‌కు చేరాడు. రౌండ్-8లో ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)తో సిన్నర్ తలపడతాడు. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిమినార్ 6-0, 7-6 (5), 6-3తో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా)ని ఓడించాడు. 21వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) 7-6 (3), 6-7 (7), 7-6 (2), 1-0తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) గాయంతో వైదొలిగాడు. ఇంకో రౌండ్-16 పోరులో లోరెంజో సొనేగో (ఇటలీ) 6-3, 6-2, 3-6, 6-1 అమెరికా టీనేజర్ లెర్నర్ టీన్ జోరుకు బ్రేక్ వేశాడు. 19 ఏళ్ల అన్‌సీడెడ్ టీన్..రెండో రౌండ్‌లో ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు షాకిచ్చిన సంగతి తెలిసిందే. క్వార్టర్‌ఫైనల్లో షెల్టన్‌ను సొనేగో ఢీకొంటాడు.



స్విటోలినా



రిబకినాకు కీస్ ఝలక్

మహిళల సింగిల్స్‌లో ఆరో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్), తొమ్మిదో సీడ్ కసట్కినాకు చుక్కెదురైంది. 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 1-6, 6-3తో రిబకినాను తిరుగుముఖం పట్టించింది. క్వార్టర్‌ఫైనల్లో ఎలీనా స్విటోలినాతో కీస్ తలపడనుంది. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 6-4, 6-1తో కుడెర్మెటోవా (రష్యా)పై నెగ్గింది. ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) 6-4, 5-7, 7-5తో తొమ్మిదో సీడ్ కసట్కినా (రష్యా)పై విజయం సాధించింది. రెండో సీడ్ స్వియటెక్ (పోలెండ్) జోరు కొనసాగిస్తూ 6-0, 6-1తో ఇవా లిస్ (జర్మనీ)పై వరుస సెట్లలో నెగ్గి క్వార్టర్‌ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో ఎమ్మా నవారోను స్వియటెక్ ఢీకొంటుంది.

నేటి కీలక మ్యాచ్
జొకోవిచ్ X అల్కారజ్
మ.,2.40 నుంచి

స్ర్కూ లూజ్ సమస్యతో..



మెల్‌బోర్న్‌లో ఎండలు అదరగొడుతున్నాయి. భానుడి భగభగలతో ఉక్కపోతగా ఉంది. సోమవారం 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో గంటలకొద్దీ మ్యాచ్‌లు ఆడేందుకు ఆటగాళ్లు ఆపసోపాలు పడ్డారు. ఇక..రూన్‌తో మ్యాచ్ సందర్భంగా నెం.1 ర్యాంకర్ సిన్నర్ ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం చల్లటి టవల్‌తో పదేపదే ముఖం తుడుచుకుంటూ కనిపించాడు. అంతేకాదు మూడో సెట్‌లో 10 నిమిషాలు మెడికల్ టైమవుట్ కూడా తీసుకున్నాడు. ఇది చాలదన్నట్టు..నాలుగో సెట్‌లో జానిక్ కొట్టిన బంతి నెట్‌కు బలంగా తగిలింది. దాంతో నెట్‌ను కోర్టు నేలకు అనుసంధానం చేసే స్ర్కూ వదులైంది. ఫలితంగా దానిని మళ్లీ బిగించేందుకు సిబ్బంది 20 నిమిషాలు శ్రమించాల్సి వచ్చింది.

కార్ల్‌సన్‌కు తొమ్మిదేళ్ల బాలుడి షాక్!



ఢాకా: అవును..ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు బంగ్లాదేశ్ బాలుడొకరు చెక్ చెప్పాడు. ఓ ఆన్‌లైన్ టోర్నీలో ఇది చోటు చేసుకుందని బంగ్లాదేశ్‌కు చెందిన చెస్ కోచ్, ఫిడే మాస్టర్ నయీమ్ హక్ వెల్లడించాడు. ఢాకాలో మూడో తరగతి చదువుతున్న రషీద్ ముగ్ధ, కార్ల్‌సన్ నడుమ ఈనెల 18న 'చెస్.కామ్' ఆధ్వర్యంలో బుల్లెట్ బ్రాల్ గేమ్ జరిగింది. బుల్లెట్ బ్రాల్ గేమ్‌లో ఆటగాళ్లు కేవలం నిమిషంలోనే ఎత్తులు వేసేయాలి. అయితే ఈ గేమ్ 20వ ఎత్తులో కార్ల్‌సన్ మౌస్‌ను క్లిక్ చేయడంలో పొరపడ్డాడు. దాంతో అతడి రాణి..తప్పుడు గడిలోకి వెళ్లిపోయింది. దరిమిలా ముగ్ధకు సంచలన విజయం దక్కింది.

అర్జున్‌పై ప్రజ్ఞానంద గెలుపు

విక్‌ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసికి మూడో రౌండ్లో చుక్కెదురైంది. సోమవారం జరిగిన గేమ్‌లో అర్జున్‌ను భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద ఓడించాడు. ఇక, ప్రపంచ చాంపియన్ గుకేష్, పెంటేల హరికృష్ణకు డ్రాలు ఎదురయ్యాయి. మూడో రౌండ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా)తో గుకేష్, భారత్‌కే చెందిన లియాన్ లూక్ మెండోన్కాతో హరి గేమ్‌లు డ్రా చేసుకున్నారు. ఇక, అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో వ్లాదిమిర్ ఫెడోసివ్ (రష్యా), కీమెర్ విన్సెంట్ (పోలెండ్)తో వీ ఈ (చైనా) గేమ్‌లు కూడా డ్రాగా ముగిశాయి. మూడు రౌండ్ల అనంతరం ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు.



నీరజ్ చోప్రా వివాహం.. అంత రహస్యంగా ఎలా?

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఎంతో రహస్యంగా వివాహం చేసుకోవడం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. సోషల్ మీడియా యుగంలో ఓ మాదిరి సెలబ్రిటీలే తన వ్యక్తిగత విషయాలను బయటకు పొక్కకుండా దాచలేకపోతున్నారు. అలాంటిది కోట్లాది మంది అభిమానులున్న చోప్రా తన పెళ్లి విషయాన్ని ఇంత గుట్టుగా ఎలా ఉంచాడనేది అంతుబట్టడం లేదు. హరియాణాలో కాకుండా హిమాచల్ ప్రదేశ్‌లో హిమానితో చోప్రా వివాహం జరిగింది. పెళ్లి జరిగిన రెండు రోజుల తర్వాత అతడు సోషల్ మీడియాలో ఫొటోలను పోస్టు చేస్తే కానీ బయటి ప్రపంచానికి ఈ వార్త తెలియలేదు. అయితే, పెళ్లి గురించిన సమాచారాన్ని బయటకు తెలియకుండా చూడాలని నీరజ్ కోరినట్టు అతడి మేనమామ భీమ్ చోప్రా చెప్పాడు. 'కొన్ని నెలల ముందు నుంచే పెళ్లి అనుకుంటున్నా.. ఆ విషయాన్ని గుట్టుగా ఉంచాం. సుమారు రెండేళ్ల నుంచే హిమానితో చోప్రాకు పరిచయం ఉంది. అందరూ ఈ పెళ్లిని ప్రైవేటుగానే ఉంచాలని భావించార'ని భీమ్ చెప్పాడు. నీరజ్ వివాహం గురించి భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ)కు ముందుగానే సమాచారం ఉందని ఓ అధికారి తెలిపాడు. అతడి ఏకాంతానికి గౌరవం ఇచ్చినట్టు చెప్పాడు. ఈ నెల 16న హిమానితో చోప్రా వివాహం జరిగింది. సోనీపట్‌కు చెందిన హిమాని జాతీయస్థాయి టెన్నిస్ ప్లేయర్. ప్రస్తుతం ఆమె అమెరికాలో చదువుకొంటోంది.

గంభీర్ సమర్థుడు



ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్

కోల్‌కతా: భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అద్భుత నాయకుడని ఇంగ్లండ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ కొనియాడాడు. గతంలో తాను అతడితో కలిసి పనిచేశానని గుర్తు చేశాడు. 'ఐపీఎల్‌లో లఖ్‌నవూ, కోల్‌కతా జట్ల తరపున గంభీర్ సాధించిన రికార్డులు గమనించాలి. ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ఆటతీరును వెలికితీయగల సామర్థ్యం గౌతీకి ఉంది. ఇక భారత్‌ను అడ్డుకునేందుకు మేం తగిన ప్రణాళికలతో ముందుకెళ్లాల్సి ఉంటుంది' అని మెకల్లమ్ తెలిపాడు.

టీమిండియా ప్రాక్టీస్ షురూ

రేపటి నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్



కోల్‌కతా: ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు సన్నాహకాలను ఆరంభించింది. దీనిలో భాగంగా సోమవారం ఈడెన్ గార్డెన్స్‌లో ఆటగాళ్లంతా నెట్స్‌లో చెమటోడ్చారు. ఇదే వేదికపై బుధవారం తొలి టీ20 జరుగనుంది. ఏడాది విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన వెటరన్ పేసర్ మహ్మద్ షమి రెండు గంటలపాటు బౌలింగ్ సాధన చేశాడు. అతడి ప్రాక్టీస్‌ను కోచ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ నిశితంగా గమనించారు. దేశవాళీ టోర్నీల్లో షమి సత్తా చాటినా, అంతర్జాతీయ స్థాయిలో అతడి ఫిట్‌నెస్ ఎలా ఉండనుందో తేలాల్సి ఉంది. ఇక హార్దిక్, శాంసన్‌లతో కోచ్ గంభీర్ వేర్వేరుగా సంభాషించాడు. జట్టు వైస్ కెప్టెన్‌గా హార్దిక్ ఉండాలని కోచ్ గంభీర్ కోరుకున్నా..సెలెక్టర్లు అక్షర్ వైపు మొగ్గుచూపారని కథనాలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో గంభీర్ అర్ధగంటపాటు హార్దిక్‌తో మాట్లాడడం ఆసక్తి రేపుతోంది. మరోవైపు అభిషేక్, రింకూ, జురెల్, నితీశ్, తిలక్‌లతో బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రాక్టీస్ చేయించాడు.

ముంబై రంజీ జట్టులో రోహిత్, జైస్వాల్

ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ ఆడబోతున్నాడు. రంజీ ట్రోఫీ కోసం ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) 17 మందితో కూడిన తమ జట్టును ప్రకటించింది. ఈనెల 23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో తలపడే ఈ మ్యాచ్‌కు అజింక్యా రహానె నేతృత్వం వహించనున్నాడు. టీమ్‌లో రోహిత్, యశస్వి జైస్వాల్‌కు చోటు కల్పించారు. 2015లో రోహిత్ చివరి రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే ఇటీవలి ఆసీస్ పర్యటనలో భారత జట్టు సిరీస్ ఓటమితో బోర్డు కఠిన ఆంక్షలు విధించింది. అందుబాటులో ఉన్న టీమిండియా ఆటగాళ్లు కచ్చితంగా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాల్సిందేనని తేల్చి చెప్పింది. ఇక, విరాట్ కోహ్లీ కూడా రంజీల్లో ఆడేందుకు అంగీకరించినట్లు ఢిల్లీ జట్టు తెలిపింది. అయితే, ఈనెల 23న సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌కు గాకుండా.. 30 నుంచి రైల్వేస్‌తో జరిగే పోరుకు అందుబాటులో ఉంటాడని ఢిల్లీ పేర్కొంది. తొలి మ్యాచ్ ఆ జట్టు చివరి మ్యాచ్‌గా ముంబై జట్టు శ్రేయాస్ అయ్యర్, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్, తనుష్ కోటియన్‌లతో కలిపి అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది.

దీర్ఘకాలిక పని గంటలు..

ఎవరూ డిమాండ్ చేయలేరు..

దానిపై చర్చించడం కాదు.. ఆత్మ పరిశీలన చేసుకోవాలి..
ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఎన్ నారాయణ మూర్తి

ముంబై: వారానికి 70 గంటలు పనిచేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఎన్ నారాయణ మూర్తి యువతరాన్ని ఉద్దేశించి గతంలో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీర్ఘకాలిక పనిగంటలపై మూర్తి తాజాగా మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఎవరూ ఎక్కువ గంటలు పనిచేయమని అడగలేరు. కానీ, ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకుని దాని అవసరాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఐఎంసీలో సోమవారం జరిగిన కిలాచంద్ స్మారక ప్రసంగ కార్యక్రమంలో వృత్తి-వ్యక్తిగత జీవిత సమతుల్యతపై అడిగిన ప్రశ్నకు మూర్తి పై విధంగా సమాధానమిచ్చారు. " నేను ఇన్ఫోసిస్‌లో 40 ఏళ్లకు పైగా వారానికి 70 గంటలు పనిచేశా. రోజూ ఉదయం 6.30 గంటలకే వెళ్లి రాత్రి 8.30 గంటలకు ఆఫీసు నుంచి బయలుదేరే వాడిని. అది తప్పని ఎవరూ చెప్పలేరు. దీర్ఘకాలిక పనిగంటలు చర్చించాల్సిన అంశం కాదు. ఇది ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకొని, అవసరాన్ని గ్రహించి, ఒక నిర్ణయానికి వచ్చాక వారు కోరుకున్నది చేయాల్సిన అంశ"మని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎంతసేపని భార్యని చూస్తూ కూర్చుంటారు.. వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఈమధ్య తన ఉద్యోగులను ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై చర్చ మరింత ఉధృతమైంది. ఈ నేపథ్యంలో మూర్తి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'గో ఫస్ట్' ఇక తెర మరుగు



లిక్విడేషన్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆదేశం

న్యూఢిల్లీ: ఆర్థిక ఇక్కట్లతో రెండేళ్ల క్రితం విమాన సర్వీసులు నిలిపివేసిన గో ఫస్ట్ విమానయాన సంస్థపై దివాలా ప్రక్రియ చేపట్టాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సోమవారం ఆదేశించింది. 2023 మే నెలలో గో ఫస్ట్ విమానయాన సంస్థ స్వచ్ఛందంగా దివాలా దరఖాస్తు చేసింది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ డెటార్ గో ఎయిర్ (ఇండియా) లిమిటెడ్ దివాలా ప్రక్రియ ప్రారంభించాల్సిందిగా రుణదాతల కమిటీని (సీఓసీ) ఆదేశిస్తున్నట్టు ఎన్‌సీఎల్‌టీ సోమవారం నాడు జారీ చేసిన 15 పేజీల ఉత్తర్వులో తెలిపింది. కార్పొరేట్ డెటార్‌ను లిక్విడేట్ చేసే హక్కు చట్టపరమైన ఈ స్కీమ్‌లోని రుణదాతల కమిటీకి (సీఓసీ) ఉంటుందని సోమవారం నాటి ఉత్తర్వులో ఎన్‌సీఎల్‌టీ తెలిపింది. రిజల్యూషన్ ప్లాన్‌ను ధ్రువీకరించడానికి ముందు, సీఓసీ ఏర్పాటైన నాటి నుంచి ఎప్పుడైనా లిక్విడేషన్ ప్రక్రియ చేపట్టే అధికారం సీఓసీదేనని తేల్చిచెప్పింది. "లిక్విడేషన్ కోసం సీఓసీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకునే అధికారం ఎన్‌సీఎల్‌టీ వంటి చట్టపరంగా ఏర్పాటైన ఏ సంస్థకు లేదు. పైగా కార్పొరేట్ డెటార్‌ను లిక్విడేట్ చేయాలన్న తీర్మానాన్ని సీఓసీ 100 శాతం ఓటింగ్‌తో ఆమోదించింది. సీఓసీకి గల వాణిజ్యపరమైన అధికారాల్లో జోక్యం చేసుకునే అవకాశం ఎన్‌సీఎల్‌టీకి లేదు" అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

2019 ఏప్రిల్‌లో విమాన సర్వీసులు నిలిపివేసిన జెట్ ఎయిర్‌వేస్ లిక్విడేషన్‌కు గత ఏడాది నవంబరు 7వ తేదీన సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన రెండు నెలల వ్యవధిలోనే గో ఎయిర్ లిక్విడేషన్ ఉత్తర్వులు వెలువడడం విశేషం. ఒకప్పుడు గో ఎయిర్‌గా ఉండి 17 ఏళ్లకు పైగా విమాన సర్వీసులు నడిపిన సంస్థను 2023 మే 3వ తేదీన సంస్థను గో ఫస్ట్‌గా రీ బ్రాండింగ్ చేశారు. దినకర్ తిరువన్నద పురం వేంకటసుబ్రమణియన్‌ను సంస్థ లిక్విడేటర్‌గా నియమించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ డెటార్ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తును కొనసాగించాలని లిక్విడేటర్‌ను ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. లిక్విడేషన్ సమయంలో పెండింగులో ఉన్న దరఖాస్తులపై తదుపరి చర్యలు తీసుకోవడంతో పాటు చట్టానికి అనుగుణంగా కార్పొరేట్ డెటార్ నుంచి బకాయిల రికవరీకి కూడా చర్యలు తీసుకోవలసి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్

ధర రూ.2.95 లక్షలు



న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ విద్యుత్ త్రి చక్ర రంగంలోకి ప్రవేశించింది. తొలి విద్యుత్ త్రీ వీలర్ కింగ్ ఈవీ మ్యాక్స్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఢిల్లీలో దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.95 లక్షలు. ఒకసారి చార్జింగ్ చేస్తే 179 కిలోమీటర్లు నడుస్తుంది. 2030 నాటికి టూ వీలర్లు, త్రీ వీలర్ విభాగం అంతా విద్యుత్ వాహన విభాగంగా మారిపోతుందని భావిస్తున్నట్టు కంపెనీ డైరెక్టర్, సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ చెప్పారు. ప్రస్తుతం ప్రయాణికుల కోసం దీన్ని విడుదల చేశామని, త్వరలో వస్తు రవాణా ఈవీని కూడా విడుదల చేస్తామని ఆయన తెలిపారు. అలాగే దీన్ని విదేశీ మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తామన్నారు.

గ్రీన్‌కో రూ.6,920 కోట్ల సమీకరణ!

ముంబై: జపాన్‌కు చెందిన ఫైనాన్షియల్ గ్రూప్ ఓరిక్స్ కార్పొరేషన్‌కు కంపెనీలో ఉన్న 20 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్ వ్యవస్థాపకులు 80 కోట్ల డాలర్ల (రూ.6,920 కోట్లు) రుణ సమీకరణ యత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. గ్రీన్‌కో వ్యవస్థాపకులకు చెందిన ఏఎం గ్రీన్ పవర్ బీవీ ఈ నిధులను సమీకరించనుందని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ఇందుకోసం బార్‌క్లేస్ పీఎల్‌సీ, డాయిష్ బ్యాంక్ ఏజీని నియమించుకున్నట్లు సమాచారం. నెదర్లాండ్స్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏఎం గ్రీన్ పవర్‌కు గ్రీన్‌కో ఎనర్జీలోని 20 శాతం వాటాను 140 కోట్ల డాలర్లకు విక్రయించేందుకు ఓరిక్స్ ఇప్పటికే అంగీకరించింది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయెంట్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన ప్రాంతీయ విమాన తయారీ సంస్థ డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాన్ని మరింతగా విస్తరించినట్లు సైయెంట్ వెల్లడించింది. 40 సీట్లతో కూడిన రీజినల్ టర్బోప్రాప్ డీ328ఎకో విమానానికి సంబంధించి కీలకమైన ఏవియేషన్ సిస్టమ్స్ రక్షణ సహా అడ్వాన్స్‌డ్ టెక్నికల్ డాక్యుమెంటేషన్ నిర్వహణ కోసం బహుళ సంవత్సరాల కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు సైయెంట్ తెలిపింది.

కేవీబీ లాభం రూ.496 కోట్లు

చెన్నై: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.496 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.412 కోట్లు)తో పోల్చితే లాభం 20.39 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 7.79 శాతం వృద్ధితో రూ.1,079 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) 1.58 శాతం నుంచి 0.83 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ కూడా 0.42 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గినట్లు కేవీబీ తెలిపింది.



గర్భిణి › ఆరోగ్యం



గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా...

కడుపు నిండా తినలేని చిత్రమైన పరిస్థితిని గర్భిణులు ఎదుర్కొంటూ ఉంటారు. కొద్దిపాటి భోజనంతోనే పొట్ట నిండిపోతూ ఉంటుంది. కాబట్టి తీసుకునే కొద్దిపాటి ఆహారం పోషకభరితంగా ఉండేలా చూసుకోవాలి. అందుకోసం ఈ నియమాలు పాటించాలి.

- గర్భిణి సాధారణం కంటే 300 క్యాలరీలు అధికంగా తీసుకోవాలి. ఇందుకోసం తక్కువ ఆహారంలో ఎక్కువ క్యాలరీలు ఉండేలా, పోషకభరిత పదార్థాలనే ఎంచుకోవాలి.
- గర్భిణి తీసుకునే క్యాల్షియం మీదే కడుపులో పెరిగే బిడ్డ ఎముకల దృఢత్వం ఆధారపడి ఉంటుంది. కాబట్టి గర్భిణులు తప్పనిసరిగా పాలు, పెరుగు, జున్ను లాంటివి తీసుకుంటూ ఉండాలి.
- ఐరన్ సమృద్ధిగా శరీరానికి అందడం కోసం ప్రతి రోజూ ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి. నట్స్, డ్రై ఫ్రూట్స్, పండ్ల రసాలు తీసుకోవాలి.
- వాంతుల సమస్య వేధిస్తున్నా, కడుపు నిండిన భావనతో ఆకలి మందగిస్తున్నా అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలవాలి. ఒకేసారి భారీ భోజనం చేయకుండా, తక్కువ పరిమాణాల్లో ఎక్కువసార్లు ఆహారం తీసుకునే ప్రయత్నం చేయాలి.
- ఫోలేట్ కోసం కమలా పండ్లు తరచుగా తింటూ ఉండాలి. ఈ పండ్లు తినడం వల్ల సాధారణంగా గర్భిణులను వేధిస్తూ ఉండే మలబద్ధకం దరి చేరకుండా ఉంటుంది.
- చిగుళ్ల వాపు, దంత సమస్యలు లాంటి చిన్నాచితకా ఆరోగ్య సమస్యలు గర్భిణుల్లో సహజం. అయితే వాటికి చిట్కాలు పాటించడం మాని, వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. అలాగే స్వీయ చికిత్సలో భాగంగా యాంటీబయాటిక్ మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు.

మీకు › తెలుసా?

చక్కెర మారువేషాల్లో...

ఆహారంలో చక్కెరను పూర్తిగా మానేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అయితే మనం చక్కెరతో తయారయ్యే తీపి వంటకాలను మాత్రమే చక్కెరగా చూస్తాం తప్ప చక్కెర మారువేషాలు కోకొల్లలు. కాబట్టి వాటి పట్ల కూడా అవగాహన పెంచుకోవాలి.



సుక్రోజ్, ఫ్రక్టోజ్, మాల్టోజ్... ఇవన్నీ చక్కెర మారువేషాలు. చెరకు రసం కూడా చక్కెర పాకమే! ఇవే కాకుండా....

- కెచప్, సలాడ్ డ్రెస్సింగ్స్, బార్బెక్యూ సాస్
- బ్రెడ్, మఫిన్స్
- రెడీమేడ్ సిరీల్స్, కార్న్ ఫ్లేక్స్
- గ్రనోలా బార్స్, ప్రొటీన్ బార్స్, పీనట్ బటర్
- పండ్లు, పండ్లరసాలు
- ప్యాకెట్లలో దొరికే చిరుతిళ్లు

ప్రారంభంలో చక్కెరను పూర్తిగా మానేయడం సాధ్యపడకపోవచ్చు. కాబట్టి మొదట్లో చక్కెర బదులుగా తక్కువ మోతాదుల్లో తేనె, బెల్లం వాడుకోవచ్చు. చక్కెర పూర్తిగా మానేసిన తర్వాత తీపి తినడానికి ఖర్జూరాలను ఎంచుకోవచ్చు.

క్యాన్సర్ › రక్ష

అండాశయాలకు క్యాన్సర్ సోకితే?

కొన్ని వ్యాధుల లక్షణాలు ఆందోళన కలిగించేంత తీవ్రంగా ఉండవు. కొన్ని లక్షణాలు ఇతరత్రా సాధారణ రుగ్మతలను పోలి ఉంటాయి. దాంతో అంతర్గతంగా వ్యాధి ముదిరిపోయే వరకూ కనిపెట్టలేకపోతూ ఉంటాం! అలాంటి వ్యాధుల కోవకు చెందినదే 'అండాశయ క్యాన్సర్'!



రొమ్ము క్యాన్సర్‌కు మాదిరిగా ముందస్తు వ్యాధినిర్ధారక పరీక్షలు లేకపోవడం మూలంగా అండాశయ క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయి. అయితే ఈ క్యాన్సర్‌కు మూల కారణాన్ని కనిపెట్టే వీలు లేకపోయినా, సరైన సమయంలో లక్షణాలను గుర్తించి, వెంటనే చికిత్స మొదలుపెట్టగలిగితే క్యాన్సర్‌ను నిర్మూలించడం కష్టమేమీ కాదు. ఇందుకోసం లక్షణాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవేంటంటే....

- కడుపు ఉబ్బరం, కడుపులో ఒత్తిడి, నొప్పి
- తిన్న వెంటనే కడుపులో ఇబ్బందికరంగా ఉండడం, ఆకలి మందించడం
- తరచూ మూత్ర విసర్జన చేయాలని అనిపించడం
- అజీర్తి, మలబద్ధకం
- విపరీతమైన వెన్ను నొప్పి, ఛాతీలో మంట
- అస్తవ్యస్థ రుతుక్రమం

ఈ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే స్త్రీల వైద్యులను సంప్రతించాలి.


ఎవరికి రావచ్చు?

క్యాన్సర్ సంక్రమించడానికి పలు కారణాలు ఉంటాయి. అయితే కొందరికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. వారు ఎవరంటే...

- అండాశయ క్యాన్సర్ వచ్చిన రక్తసంబంధీకులు కలిగినవారు
- కాలక్రమేణా మార్పు చెందిన అండాశయ క్యాన్సర్‌కు చెందిన జన్యువులు కలిగి ఉన్న వారు
- రొమ్ము, పెద్దపేగు, మూత్రాశయ క్యాన్సర్లకు గురయినవారు
- ఊబకాయం కలిగినవాళ్లు
- పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన చికిత్సలు, హార్మోన్ చికిత్సలు తీసుకున్నవారు
- జీవితకాలంలో గర్భం దాల్చని మహిళలు

పెద్ద వయసులో దంత సమస్యలు సహజమే! అయితే వాటిని సరిదిద్దడానికి దవడల అరుగుదల, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు అడ్డుపడొచ్చు. వీటన్నిటినీ అధిగమించి, పలువరసను పక్కాగా చక్కదిద్దే దంత చికిత్సలు అందుబాటులోకొచ్చాయని భరోసా కల్పిస్తున్నారు వైద్యులు. వాటి గురించి తెలుసుకుందాం!

దంత › శిరి



ఖాళీగా వదిలేస్తే...

ఊడిపోయిన దంతాల స్థానంలో కొత్త దంతాలను అమర్చుకోవడం కూడా తప్పనిసరి. లేదంటే దవడలు హెచ్చుతగ్గులకు లోనై దవడ కీళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. ఆహారం తినే సమయంలో కూడా ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి ఉన్న దంతాల ఆసరాతో ఖాళీలను భర్తీ చేసే సెరామిక్ లేదా జెర్కోనియం బ్రిడ్జెస్‌ను అమర్చుకోవలసి ఉంటుంది. ఇంప్లాంట్ ప్రాస్థటిక్స్... సెరామిక్, జెర్కోనియం లేదా అక్రిలిక్‌లతో తయారవుతాయి. స్థోమతను బట్టి తగినదాన్ని ఎంచుకోవచ్చు. ఈ కృత్రిమ దంతాలన్నీ 10 నుంచి 20 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉంటాయి. నోట్లో అమర్చే మొత్తం పళ్ల సెట్టు (కంప్లీట్ డెంచర్స్) ఐదు నుంచి ఆరేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది.

పెద్దల పలువరస పక్కాగా...

'వయసైపోయింది కాబట్టి, దంతాలు ఊడిపోవడం సహజమే! ఇక ఈ వయసులో కొత్త దంతాలు కట్టించుకోవలసిన అవసరం ఏముంది?' అనే నిర్లిప్తత ఎక్కువ మంది పెద్దల్లో ఉంటుంది. కొందరికి కొన్ని దంతాలు ఊడిపోయి, కొన్ని మిగిలిపోతూ ఉంటాయి. ఇంకొందరికి దంతాలన్నీ ఊడిపోయి, నోరు బోసిపోతుంది. ఇంకొందరికి దంతాల మూలాలు పుచ్చిపోతూ ఉంటాయి. ఎక్కువ మందికి దంతాలన్నీ అరిగిపోతూ ఉంటాయి. సున్నితత్వ సమస్య తీవ్రంగా ఉండి చల్లని, వేడి పదార్థాలు తీసుకున్నప్పుడు దంతాలు జివ్వుమంటూ ఉంటాయి. ఇవన్నీ తప్పనిసరిగా సరిదిద్దుకోవలసిన సమస్యలే! ఎందుకంటే.. పెద్ద వయసులో ఆరోగ్య వ్యవస్థల సామర్థ్యం ఎంతో కొంత సన్నగిల్లి ఉంటుంది. మధుమేహం, అధిక రక్తపోటు మొదలైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటాయి. అలాగే ఎముకల అరుగుదల, బలహీనతలు ఉంటాయి. ఈ సమస్యలన్నిటికీ మందులతో పాటు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం అవసరం. కానీ పోషకాల అవసరత ఎక్కువగా ఉండే పెద్ద వయసులోనే దంత సమస్యలు కూడా ఎక్కువవుతాయి. దాంతో ఆహారాన్ని పూర్తిగా నమిలి తినలేకపోవడం, పాక్షికంగా నమిలి మింగేయడం చేస్తూ ఉంటారు. ఫలితంగా పోషకలోపాలు తలెత్తడం, దాంతో శరీరం బలహీనపడి, ఆరోగ్య సమస్యలు తీవ్రమవడం... ఇలా మొత్తంగా ఆరోగ్యం క్షీణించే పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి పెద్దలు దంత సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

కొత్త దంతాలు ప్రయోజనకరం

పెద్దల్లో ఊడిపోయిన దంతాల స్థానంలో కొత్త దంతాలు అమర్చడం వల్ల మూడు రకాల ప్రయోజనాలుంటాయి. దంతాలు లేవనే ఆత్మన్యూనతతో నలుగురిలో కలవడానికి వెనకాడే పెద్దల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు. ఆహారాన్ని చక్కగా నమిలి తినగలిగే సౌలభ్యాన్ని అందించవచ్చు. దంతాల లోపంతో స్పష్టంగా మాట్లాడలేని పెద్దలకు చక్కగా మాట్లాడే సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఈ మూడు ప్రయోజనాలు కీలకమైనవే! వీటితో పెద్దలు, మానసికంగా, శారీరకంగా... రెండు విధాలా కోలుకుంటారు. ఆత్మవిశ్వాసం పెరిగి, కుటుంబంతో అనుబంధాన్ని బలపరుచుకోగలుగుతారు, నలుగురితో కలవగలుగుతారు. నమిలి తినే ఇబ్బంది తొలగిపోతుంది కాబట్టి పోషకాహార లోపం సమస్య పరిష్కారమైపోయి, ఆరోగ్యం కూడా పుంజుకుంటుంది. కాబట్టి పాక్షిక దంత లోపాలు, దంతాలు, దంతాల మూలాలు పుచ్చిపోవడం లాంటి సమస్యలను రూట్ కెనాల్, ఫిల్లింగ్స్‌తో సరిదిద్దుకోవచ్చు. అలాగే దంతాలు లేని వాళ్లకు తీసి పెట్టుకోగలిగే లేదా శాశ్వతంగా అమర్చగలిగే కృత్రిమ దంతాలను ఆశ్రయించవచ్చు.

> కొన్ని హైపర్ టెన్షన్, హృద్రోగ ఔషధాలు చిగుళ్ల దెబ్బతింటూ ఉంటాయి. కాబట్టి ఈ మందుల వాడకం మొదలుపెట్టిన తర్వాత తరచూ చిగుళ్ల సమస్యలు తలెత్తుతూ ఉంటే, సంబంధిత వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే దంత చికిత్సలను ఆశ్రయించే హృద్రోగులు, రక్తాన్ని పలుచన చేసే మందులను తాత్కాలికంగా ఆపవలసి వస్తుంది. కాబట్టి ఆ సందర్భంలో వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి. పెద్దల్లో నోరు పొడిబారిపోయే సమస్య కూడా ఎక్కువే! ఈ సమస్య కూడా దంత సమస్యలను పెంచుతుంది. ఈ సమస్య ఉన్న పెద్దలు కృత్రిమంగా లాలాజలాన్ని ఉత్పత్తి చేసే మౌత్ వాష్‌లు వాడుకోవాలి.

కృత్రిమ దంతాలు ఇలా...

తీసి పెట్టుకోగలిగే దంతాలకూ, శాశ్వత దంతాలకూ వ్యత్యాసం ఉంటుంది. సాధారణంగా పెద్దల్లో దవడ ఎముకలు అరిగిపోయి ఉంటాయి. కొందర్లో ఇంప్లాంట్ బిగించడానికి వీలు లేనంత పలుచగా ఉంటాయి. దాంతో, వాళ్లు తీసి, పెట్టుకోగలిగే దంతాలను ఎంచుకుంటే, ఆ డెంచర్ దవడ మీద సక్రమంగా ఇమడకుండా కదులుతూ ఉంటుంది. అలాగే మాట్లాడేటప్పుడు డెంచర్ ఊడిపోతూ ఇబ్బంది పెడుతూ ఉంటుంది. అయితే ఇంప్లాంట్ డెంటిస్ట్రీ అభివృద్ధి సాధించినప్పటి నుంచీ, తీసి, పెట్టుకునే దంతాలతో పాటు శాశ్వత దంతాలను అమర్చే అధునిక చికిత్సలు ఊపందుకున్నాయి. దవడ ఎముక పలుచగా ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వైద్యపరమైన వెసులుబాట్లు వాడుకలోకొచ్చాయి. అరిగిపోయిన పై దవడలోకి



బిగించే 'టెరిగాయిడ్ డెంటల్ ఇంప్లాంట్స్', బుగ్గ ఎముకల్లోకి బిగించే 'జైగోమ్యాటిక్ డెంటల్ ఇంప్లాంట్స్', వ్యక్తి నోటి నిర్మాణానికి తగిన ఇంప్లాంట్స్ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇంతకు ముందు వరకూ దవడలోకి స్క్రూలు బిగించే ఇంప్లాంట్స్ అందుబాటులో ఉండేవి. కానీ వాటి కోసం దవడ ఎముక దృఢంగా, సరిపడా మందంగా ఉండాలి. పెద్దల్లో దవడ ఎముక అరుగుదల సమస్య ఉంటుంది కాబట్టి ఆ రకమైన ఇంప్లాంట్స్ బిగించడం సాధ్యపడదు. బదులుగా ఆధునిక ఇంప్లాంట్స్‌ను అభివృద్ధి చేయడం జరిగింది.

ఆధునిక ఇంప్లాంట్స్ ఇలా...

దంతాలున్నంత వరకే దవడ ఎముకలు దృఢంగా ఉంటాయి. దంతాలు ఊడిపోయినప్పటి నుంచి వాటికి ఆసరా అందించే దవడ ఎముకలు అరిగిపోవడం మొదలుపెడతాయి. అయితే అలా దవడ ఎముకలు అరిగిపోయినా, బుగ్గ ఎముకలు మాత్రం దృఢంగానే ఉంటాయి. కాబట్టి పొడవాటి ఇంప్లాంట్‌ను బుగ్గల ఎముకల్లోకి అమర్చి, వాటి ఆధారంగా కృత్రిమ దంతాలను అమర్చవచ్చు. అలాగే పై దవడ ఎముక చివరన ఇంప్లాంట్స్‌ను అమర్చవచ్చు. ఇలా ఇంప్లాంట్స్ అమర్చడానికి లోకల్ అనస్థీషియా సరిపోతుంది. అలాగే ఇలాంటి ఇంప్లాంట్స్ అమర్చిన తర్వాత, ఎక్కువ కాలం ఆగకుండా వెంటనే కృత్రిమ దంతాలను బిగించుకోవచ్చు. అయితే ఎవరికి ఎలాంటి ఇంప్లాంట్స్ అవసరమన్నది తెలుసుకోవడం కోసం కోన్ బీమ్ సిటి స్కాన్ చేయవలసి ఉంటుంది. ప్రత్యేకించి నోట్లోని ఎముకల కోసం ఉద్దేశించిన ఈ సిటి స్కాన్‌లో రేడియేషన్ కూడా తక్కువగా ఉంటుంది. ఈ స్కాన్ ఆధారంగా ఏ ఎముకలో ఇంప్లాంట్ అమర్చుకోవచ్చు అన్నది వైద్యులు నిర్ణయిస్తారు. అయితే తక్కువ ఖర్చులో కృతిమ దంతాలు పెట్టించుకోవాలనుకునేవాళ్లకు తీసి, పెట్టుకునే పళ్ల సెట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే పైదవడలో ఇమిడిపోయినంత మెరుగ్గా కింది దవడ మీద పళ్ల సెట్టు ఇమడకపోవచ్చు. ఇలాంటప్పుడు కింది దవడలో రెండు ఇంప్లాంట్స్‌తో సరిపెట్టి, ఇంప్లాంట్ సపోర్టెడ్ ఓవర్ డెంచర్‌ను అమర్చుకోవచ్చు. స్న్యా బటన్‌ను పోలిన, తీసి పెట్టుకోగలిగే ఈ కృత్రిమ సెట్టు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అలాగే కింది దవడ అరిగిపోయి, ఎత్తు తగ్గిపోతుంది కాబట్టి ఇంప్లాంట్‌ను ఏటవాలుగా అమర్చే పద్ధతిని కూడా వైద్యులు అనుసరిస్తూ ఉంటారు.

డాక్టర్ సి. శరత్ బాబు
ప్రోస్థోడాంటిస్ట్ అండ్ ఇంప్లాంటాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్



ఆహారం › ఆరోగ్యం

వ్యాధినిరోధకశక్తి పెరగాలంటే?

వ్యాధినిరోధకశక్తిని పెంచే ఆహారం ఏది? వెనువెంటనే శక్తిగా మారే ఏ పదార్థమైనా వ్యాధినిరోధకశక్తిని పెంచేదే! ఏ ఆహారమైతే జీర్ణాగ్నిని కుంటుపరుస్తుందో అది వ్యాధినిరోధకశక్తిని తగ్గిస్తుంది. పరిపూర్ణంగా జీర్ణమవడం మూలంగా అందే శక్తి మంచి ఆరోగ్యానికి, సమతుల భావోద్వేగాలకు, వ్యాధినిరోధకశక్తికీ తోడ్పడుతుంది. సులభంగా జీర్ణం కాని ఆహారం తీసుకోవడం వల్ల ఒరిగే ఫలితం ఇందుకు విరుద్ధంగా, రోగనిరోధకశక్తిని కుంటుపరిచేలా చేస్తుంది. కాబట్టి ఆహారనియమాల పట్ల కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

తెలివిగా... తేలికపాటి ఆహారం!

పళ్లు, కూరగాయలు, పొట్టుతో కూడిన ధాన్యాలు, పప్పుదినుసులు, పాల ఉత్పత్తులు తేలికగా జీర్ణమవుతాయి. పొట్టు తీయకుండా, పాలిష్ పట్టకుండా ఉన్న పరిపూర్ణ ధాన్యాలు ఆహారంగా తీసుకున్నప్పుడు తేలికగా అరిగి త్వరిత శక్తినిస్తాయి. పాలిష్ పట్టిన, నిల్వ ఉంచిన, కృత్రిమ రుచులు జోడించిన పదార్థాలు అజీర్తిని కలిగించి శరీరంలో అగ్నిని రాజేస్తాయి. శక్తిని కణాలకు చేరకుండా చేస్తాయి. ఫలితంగా వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లుతుంది. పురుగు మందులు, ఎరువులు వేయకుండా పండించిన సేంద్రీయ పంటల్లో ఖనిజలవణాలు, విటమిన్లు, పీచు పుష్కలంగా ఉంటాయి. వృక్షసంబంధ మాంసకృత్తులు పరిపూర్ణంగా ఉంటాయి. ఇంట్లో తయారుచేసిన జున్ను, పాలు, పప్పుదినుసులు (కందిపప్పు, మినుములు, పెసలు), కూరగాయలు (చిక్కుళ్లు, పచ్చిబఠాణీ) శక్తిని అందిస్తాయి.

దినుసుల ద్వారా...

ఆహారంలోని పోషకాలను నష్టపరచని దినుసులను వంటల్లో జోడించాలి. ఇందుకోసం మరీ ఘాటైనవి కాకుండా తేలికపాటి దినుసలను ఆహారానికి జోడించడం ద్వారా ఆహారం తేలికగా అరిగి త్వరిత శక్తిని అందించగలుగుతుంది. మంచి రుచికి దినుసులు తోడైతే, తేలికగా జీర్ణమవడంతోపాటు పోషకాలను శరీరానికి తేలికగా అందే మార్గం సుగమమవుతుంది. మనం ఆహారంలో పసుపు, కారం, జీలకర్ర, మెంతులు... ఇలా ఎన్నో రకాల దినుసులను జోడిస్తూ ఉంటాం. వీటిలో పసుపుకు రోగనిరోధకశక్తిని ఇనుమడింపజేసే గుణం ఉంటుంది. పసుపు శరీరంలోని విషాలను హరించడంతోపాటు రోగనిరోధకశక్తికి సంబంధించిన కణాలకు శక్తినిస్తుంది. జీలకర్ర వేడిని చంపుతుంది. నల్ల మిరియాలు శరీర కణజాలాలకు శక్తి నేరుగా అందేలా చేస్తాయి.

శక్తిని పెంచే ఆహారం!

యాపిల్ పళ్లలో రోగనిరోధకశక్తికి దోహదపడే యాంటీఆక్సిడెంట్లు, సుఖ విరోచనానికి అవసరమయ్యే పీచు పుష్కలంగా ఉంటాయి. తీయగా ఉండి, రసంతో కూడిన మామిడి, అనాస పళ్లు త్వరగా శక్తి రూపం దాలుస్తాయి. ఫలితంగా వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. అవే పళ్లు చెట్టుకు పండినవైతే శక్తి మరింత త్వరితంగా అందుతుంది. దానిమ్మరసం, దానిమ్మ గింజల పచ్చడి, పిత్త దోషం పెరగకుండా చేస్తూనే, జీర్ణశక్తిని పెంచుతాయి. కాబట్టి పరోక్షంగా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. మధ్యాహ్న భోజనం తర్వాత బొప్పాయి తింటే జీర్ణశక్తితోపాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఆవ ఆకులు, పాలకూరల్లో ఉండే ఐరన్, క్యాల్షియం, ఇతర పోషకాలు శక్తిని పెంచడంతోపాటు పొట్టను ఆరోగ్యంగా ఉంచుతాయి. క్యాబేజి, కాలిఫ్లవర్‌లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు కూడా రోగనిరోధకశక్తికి దోహదపడేవే! బార్లీ, తోటకూర విత్తనాలు, క్వినోవాలలో వ్యాధినిరోధకశక్తిని పెంచే పోషకాలు ఉంటాయి. శక్తి ప్రభావాన్ని పెంచే పదార్థాల్లో పాలు, నెయ్యిలు ప్రధానమైనవని ఆయుర్వేదం సూచిస్తోంది. కాబట్టి చిటికెడు యాలకుల పొడి వేసి కాచిన పాలు తాగాలి. భోజనానికి రెండు గంటల ముందు లేదా తర్వాత తాగడం వల్ల పోషకాలు సక్రమంగా శరీరానికి అందుతాయి. నెయ్యి ఇంట్లో తయారుచేసినదై ఉండాలి.

వండే విధానం!

వండి తినడం వల్ల ఆహారం అరిగే వేగం పెరుగుతుంది. అలాగని ఆహారాన్ని అవసరానికి మించి ఉడికిస్తే వాటిలోని రోగనిరోధకశక్తి వృద్ధి కారకాల నష్టం జరుగుతుంది. ఆహారం నమలడానికి, తినడానికి, మింగడానికి మెత్తగా ఉండాలికానీ సాగకూడదు.



సమయపాలన పాటించాలి!

ఆహారవేళలు నియమబద్ధంగా సాగాలి. ప్రధాన భోజనం మధ్యాహ్నం, సూర్యుడు నడినెత్తి మీద ఉన్నప్పుడు తినాలి. ఈ సమయంలో జీర్ణశక్తి అమోఘంగా, బలంగా ఉంటుంది. రాత్రివేళ జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది కాబట్టి, తేలికపాటి అల్పాహారం తీసుకోవాలి. ఇలాంటి ఆహార, సమయ నియమాలు పాటిస్తే రోగనిరోధకశక్తి మెరుగ్గా సాగుతుందని ఆయుర్వేదం చెప్తోంది.

సరైన పరిమాణాలూ ముఖ్యమే!

శరీర తీరు, తత్వాలకు తగిన పరిమాణాల్లో ఎక్కువ, తక్కువ కాకుండా ఆహారం తీసుకోవాలి. ఆహారంతోపాటు గది ఉష్ణోగ్రతకు దగ్గర్లో ఉన్న నీరు తీసుకుంటే ఆహారం కొంత ద్రవ రూపం దాలుస్తుంది. జీర్ణశక్తికి ఇది అవసరం. పొట్టలో పావు వంతు ఖాళీ జాగా వదిలితే తేలికగా జీర్ణం జరుగుతుంది. పొట్ట నిండా తింటే అరిగే జాగా లేక అజీర్తి తలెత్తుతుంది.

అవగాహన

పండ్లు తింటే బరువు తగ్గుతామా?

బరువు తగ్గడం కోసం రాత్రి భోజనానికి బదులుగా పండ్లు తినే ధోరణి ఇటీవల ఊపందుకుంది. అయితే పండ్లతో నిజంగానే బరువు తగ్గే వీలుందా? తెలుసుకుందాం!

మధ్యాహ్నం భారీగా భోంచేసినప్పుడు, రాత్రికి అంతగా ఆకలి వేయకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో, లేదా అజీర్తి తలెత్తినప్పుడు రాత్రి భోజనానికి బదులుగా పండ్లతో సరిపెట్టుకోవడం మంచిదే! అయితే ప్రతి రాత్రీ పండ్లతో సరిపెట్టుకోవడం ఆరోగ్యకరం కాదంటున్నారు వైద్యులు. పండ్లలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు లోపిస్తాయి కాబట్టి ఇదే అలవాటును కొనసాగిస్తే



పోషక లోపం తలెత్తే వీలుంటుంది. అలాగే రాత్రి పండ్లతో పొట్ట నింపుకోవడంతో, మరుసటి ఉదయానికి ఆకలి ఎక్కువై భారీ బ్రేక్‌ఫాస్ట్ చేసే అవకాశం ఉంటుందనీ, దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే ప్రమాదం ఉంటుందని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పండ్లలో విటమిన్లు, పీచు, ఖనిజ లవణాలతో పాటు, సహజ చక్కెరలు కూడా ఎక్కువే! ఇవి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచేస్తాయి. ఇదే అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ శక్తిని ఉపయోగించుకోలేకపోతే, కొవ్వుగా శరీరంలో పేరుకుపోతుంది. కాబట్టి ఈ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం పండ్లను పెరుగు, నట్స్‌తో కలిపి తీసుకోవాలి. అలాగే రాత్రిపూట పండ్లను తినడానికి ఇష్టపడే వారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే, బెర్రీస్, యాపిల్స్, బొప్పాయి, పియర్స్ మొదలైన పండ్లను ఎంచుకోవాలి.

చనిపోయినా.. ఊరు విడిచినా భూములు ఫట్

» వైసీపీ నేతల దందాలపై టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల దందాలు, భూకబ్జాలు, దౌర్జన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనేక మంది బాధితులు టీడీపీ గ్రీవెన్స్‌కు బారులు తీరారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం గుంటుకాని పల్లెకు చెందిన అవసాని రమణయ్య అర్జీ ఇస్తూ, ఎవరైనా చనిపోయినా.. బతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లినా.. వారి భూముల్ని కొనుగోలు చేసినట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా భాస్కర్‌రెడ్డి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలాగే తమ భూమిని కొట్టేశారని, దీనిపై కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, వైసీపీ కబ్జాదారులు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అండతో తుమ్మా వెంకట కృష్ణారెడ్డి, అతడి అనుచరులు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసిన భూముల్ని విడిపించాలని గుంటూరు జిల్లా కొత్త బొమ్మువానిపాలేనికి చెందిన తుమ్మా శివరామిరెడ్డి కోరారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులు తమ ప్రహరీ గోడను ధ్వంసం చేశారని తిరుపతికి చెందిన శ్యామలాదేవి వాపోయారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో భూమిని తీసుకుని, పరిహారం ఇవ్వలేదని ఏలూరు జిల్లా లక్కవరానికి చెందిన కేవీ రమణమ్మ వాపోయారు.గుంటూరులోని బుద్ధమెగాషెక్త ఫౌండేషన్ వారు టీచర్ ఉద్యోగాల పేరుతో రూ.45కోట్లు దాకా దండుకుని, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విశాఖ మధురవాడకు చెందిన సునీత ఫిర్యాదు చేశారు.

దమ్ముంటే జగన్ పాలనపై విచారణ జరిపించండి

» అమిత్ షా వ్యాఖ్యలకు ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది: షర్మిల

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'దమ్ముంటే గత ఐదేళ్ల వైసీపీ పాలనపై వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలి' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. 'వైసీపీ పాలన ఓ విపత్తు' అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మండిపడుతూ షర్మిల ఎక్స్‌లో స్పందించారు. "అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది. ఐదేళ్లలో విధ్వంసం జరుగుతుంటే... ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? ఆ ఐదేళ్లు కేంద్రంలో ఉన్నది మీరే కదా? రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులు ఆపితే అడిగారా? రాజధాని లేని రాష్ట్రంగా ఐదేళ్లు పాలన చేస్తుంటే కేంద్రానికి కనిపించలేదా? రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా? సొంత బాబాయి హత్య కేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే కేంద్ర హోంమంత్రిగా మౌనంగా ఎందుకు ఉన్నారు? భారీ స్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయటపెట్టారా? ఐదేళ్లపాటు జగన్ మీకు దత్తపుత్రుడు. ఆడించినట్లు ఆడే తోలు బొమ్మ. పార్లమెంటులో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంపు. రాష్ట్రంలో సహజ వనరులను 'మోదానీ'కి దోచిపెట్టే ఏజెంట్. మీ ఇష్టారాజ్యంగా ఐదేళ్లు వాడుకొని, రాష్ట్ర సంపదను దోచుకొని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు రాష్ట్ర ప్రజలు కారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసానికి కర్త జగన్ అయితే... కర్మ, క్రియ బీజేపీ ప్రభుత్వమే. విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి అండగా ఉంటాం, రూ.3 లక్షల కోట్లు ఇస్తాం, పూర్వ వైభవం తెస్తామనే మీ మాటలు మరో మోసానికి నిదర్శనం. రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినంత మాత్రాన విశాఖ ఉక్కును ఉద్ధరించినట్లు కాదు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించడమే అసలైన పరిష్కారం' అని షర్మిల వ్యాఖ్యానించారు.

ఔత్సాహికులకు నైపుణ్య శిక్షణ: మంత్రి కొండపల్లి

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ పరిశ్రమల స్థాపన, సేవల కార్యకలాపాలపై ఔత్సాహికులకు నైపుణ్య ఆధారిత శిక్షణ ఇవ్వడానికి తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈనెల 27వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ర్యాంప్ ప్రోగ్రాం అమలు పురోగతిపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సదరన్ కౌన్సిల్‌కు నివేదికలు సిద్ధం చేయండి: సీఎస్

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ముసాయిదా అజెండా అంశాలను జోనల్ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువెళ్లి, చర్చించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం అమరావతి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో పేర్కొన్న అంశాల్లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి అందిన సాయం, రావాల్సిన నిధులపై చర్చించారు. రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం నుంచి అందిన, రావాల్సిన నిధులపై కూడా సమీక్షించారు.

న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జస్టిస్ రవినాథ్ తిల్హరి



అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టులో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. ఇటీవల వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించిన జస్టిస్ జి.నరేందర్ ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది.

ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులకు కమిషనర్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సోమవారం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘాట్‌ను పూలతో అలంకరించారు తప్ప దెబ్బతిన్న గోడలు, పైకప్పును సరిచేయలేదు. రంగులు కూడా వేయలేదు. లైట్లు సైతం విరిగిపోయాయి. ఘాట్ నిర్వహణ లోపాలపై ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సైతం 'ఎక్స్'లో స్పందించారు. ఈ విషయాలు కమిషనర్ దృష్టికి వెళ్లడంతో ఘాట్ మరమ్మతులకు ఆదేశాలిచ్చారు.

ఎంపీలకు సెక్యూరిటీ కార్ అలవెన్స్ రూ.లక్ష

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు సెక్యూరిటీ కార్ అలవెన్సుల కింద ఇస్తున్న లక్ష రూపాయలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి కె.సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీల సెక్యూరిటీ కార్ అలవెన్సుల కింద ప్రభుత్వం గతంలో రూ.50 వేలు ఇచ్చేది. దీనిని వైసీపీ ప్రభుత్వం రూ.లక్షకు పెంచింది. దీనినే కొనసాగించనున్నారు.

స్వమిత్వా డైరెక్టర్‌గా నిశాంత్ రెడ్డి

పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనరేట్ పరిధిలోని స్వమిత్వా ప్రాజెక్టు డైరెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ ఎ.నిషాంత్ రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన సర్వే విభాగంలో ఎస్‌జేడీ ప్రాజెక్టులో ఉన్నారు.

కేఆర్ఎంబీని విజయవాడలోనే పెట్టాలి: ఆళ్ల

కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌ను రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు కోరారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో బోర్డు చైర్మన్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు.





రాష్ట్రంలో పింఛన్ల పంపిణీకి గతేడాది జూలై 1న ప్రథమంగా గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం పెనుమాక గ్రామాన్ని కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎస్సీ కాలనీలోని పూరిపాకలో నివసిస్తున్న పాములనాయక్ కుటుంబం దీనస్థితిని చూసి చలించిపోయారు. అదే స్థలంలో ఇల్లు నిర్మించి ఇస్తామని వారికి స్వయంగా చంద్రబాబు హామీ పత్రం అందజేశారు. ఆ మేరకు హౌసింగ్ స్కీమ్ కింద ఆరు నెలల్లోపే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని ఇలా సుందరంగా ముస్తాబైంది. -ఆంధ్రజ్యోతి, తాడేపల్లి

ఆరు నెలల్లో గుడిసె నుంచి డాబాలోకి!

ప్రభుత్వం నిర్మించిన నూతన భవనం, పాముల నాయక్ కుటుంబం (ఇన్‌సెట్)

మార్చిలోగా లక్ష సీసీ కెమెరాలు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గుముఖం పట్టాయి. గత 7, 8 నెలల్లో శాంతి భద్రతలను పరిరక్షించడంలో, నేరాలను అదుపు చేయడంలో అధునాతన సాంకేతికతతో కూడిన పురోభివృద్ధిని సాధించాం. ప్రజా సంక్షేమం కోసం మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. డ్రోన్స్‌ను వినియోగంలోకి తేవడం ద్వారా నిర్జన ప్రదేశాల్లో జరిగే అరాచకాలను, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించగలుగుతున్నాం. ఫింగర్ ప్రింట్స్ విభాగంలో జాతీయ స్థాయిలో పోటీ జరిగితే ఆంధ్రప్రదేశ్ ఒకసారి మొదటి స్థానంలో ఉంటే మరోసారి తెలంగాణ ఉంటుంది. రెండేళ్లుగా పరిష్కారం కాని హత్య కేసులు, హత్యాచారం కేసులను ఈ ప్రభుత్వంలో ఛేదించాం. గతంలో జరిగిన సోషల్ మీడియా కేసులను కూడా బయటకు తీసి దర్యాప్తు వేగవంతం చేశాం. సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయాయి. వీటిని అరికట్టడానికి సులువైన మార్గం అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడమే. మౌలిక సదుపాయాల్లో భాగంగా ట్రాఫిక్ విభాగానికి రూ.10 కోట్లు ఖర్చు చేశాం. పోలీసు సంక్షేమానికి ఈ ప్రభుత్వం పెద్దపీట వేసింది. గతంలో పోలీస్ అమరవీరుల దినోత్సవానికి రూ.10 కోట్లు ఖర్చుపెడితే ప్రసుత్తం రూ.20 కోట్లు మంజూరు చేశాం. ఈ ప్రభుత్వంలో 14 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించాం. కొత్త ప్యానల్ తయారైన వెంటనే మరో వారంలో 39 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తాం. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అరాచకాలు, అత్యాచారాలను అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం' అని డీజీపీ వివరించారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావ్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఎస్పీ భాస్కర్‌రావ్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో మొక్క నాటుతున్న సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీకి 20 కోట్ల ఆదాయం

» త్వరలో వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు

» ఎండీ ద్వారకా తిరుమలరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.20 కోట్లకు పైగా వచ్చిందని ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్, గ్యారేజీని సోమవారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సంక్రాంతికి ఆర్టీసీ బస్సులను పెద్దఎత్తున నడపడం ద్వారా గతేడాది కూడా రూ.20 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ప్రత్యేక చార్జీలు వసూలు చేయకుండానే ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం సంతోషకరం. మంచి ఎఫర్ట్ పెట్టిన ఆర్టీసీ అధికార యంత్రాంగాన్ని, ఉద్యోగులు, సిబ్బందిని అభినందిస్తున్నా. ఆర్టీసీ ఉద్యోగులకు ఎరియర్స్‌ను ఇప్పటికే కొంత చెల్లించాం. మిగిలిన బకాయిల్లో 25 శాతం వారం రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 1,500 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయగా మరో వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయి. ఆర్టీసీ స్థలాల్లో షాపింగ్ మాల్స్ ఏర్పాటులో నిబంధనలను పాటిస్తాం' అని అన్నారు. ఈ సందర్భంగా గ్యారేజీ ఆవరణలో మొక్కను నాటారు.

మరింత నాణ్యంగా తిరుమల లడ్డూ!

» ముడిసరుకుల కొనుగోలుకు నిపుణుల కమిటీ!

» రిలయన్స్ రిటైల్స్ సంస్థతో టీటీడీ ఒప్పందం

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరించే లడ్డూ ప్రసాదాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు టీటీడీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. నాణ్యమైన ముడిసరుకుల ఎంపికలో ఉచితంగా సూచనలు అందించేందుకు రిలయన్స్ రిటైల్స్ సంస్థతో ఇప్పటికే టీటీడీ ఒప్పందం కుదుర్చుకుంది. లడ్డూ ప్రసాదంతోపాటు ఇతర అన్నప్రసాదాల తయారీకి వినియోగించే ముడిసరుకులను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల మేరకు టెండరు ప్రక్రియ ద్వారా గత ఎనిమిదేళ్లుగా టీటీడీ కొనుగోలు చేస్తోంది. అయితే, లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనే వివాదం నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఈవో శ్యామలరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే లడ్డూప్రసాదంలో వినియోగించే ముడిసరుకులను మరింత నాణ్యమైనవి కొనుగోలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. అత్యంత నాణ్యమైన ముడిసరుకులను పొందేందుకు టెండర్ల ప్రక్రియలో పారదర్శకత, కొనుగోలు విధానాలు, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఎలాంటి ప్రమాణాలు ఉండాలి వంటి అంశాలపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులు సూచనలు చేయనున్నారు. ఆ సూచనల మేరకు ముడిసరుకుల కొనుగోళ్లను చివరిదశలో ఎంపిక చేసేందుకు టీటీడీ ప్రత్యేక నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కమిటీ అంగీకారం తెలిపితేనే కొనుగోలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకుంది.

భారీగా బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి విజయానంద్ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్‌ల బదిలీ/అదనపు బాధ్యతలు ఇలా..

- జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జి. సాయిప్రసాద్‌కు సీఎంకి ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు.
- హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అజయ్ జైన్‌కు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.
- అగ్రికల్చర్ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న బుడితి రాజశేఖర్‌కు పశు సంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- హస్తకళలు, చేనేత ముఖ్య కార్యదర్శిగా ఉన్న కె. సునీతను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు.
- ఎన్. యువరాజ్‌కు చేనేత, హస్తకళల ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- జీఏడీలో ఉన్న వాణీమోహన్‌కు పురావస్తు శాఖ అదనపు బాధ్యతలు ఇచ్చారు.
- సీఎం ముఖ్య కార్యదర్శిగా ఉన్న పీయూష్‌కుమార్‌ను ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా నియమించారు. ప్లానింగ్ విభాగం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- ఎక్సైజ్, మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ముకేష్ కుమార్ మీనాను జీఏడీ పొలిటికల్ సెక్రటరీగా నియమించారు. దీంతో పాటు ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- ఐ అండ్ ఐ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఎస్. సురేశ్‌కుమార్‌ను మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు.
- సెలవులో ఉన్న సౌరబ్ గౌర్‌ను పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నియమించారు.
- పాఠశాల విద్య సెక్రటరీ కోన శశిధర్‌కు ఉన్నత విద్యా శాఖ సెక్రటరీతోపాటు నైపుణ్యాభివృద్ధి సెక్రటరీగా అదనపు బాధ్యతలిచ్చారు.
- సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కాటమనేని భాస్కర్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఐటీ విభాగం సెక్రటరీగా నియమించారు. దీంతో పాటు ఆర్టీజీఎస్, గ్రామ, వార్డు సచివాలయాలు సెక్రటరీగా, పాఠశాలల మౌలిక సదుపాయాల కమిషనర్‌గా అదనపు బాధ్యతలిచ్చాచారు.
- పశు సంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా ఉన్న ఎం.ఎం. నాయక్‌ను సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగా నియమిస్తూ, గిరిజన సంక్షేమ కార్యదర్శింగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- మైనింగ్ విభాగం డైరెక్టర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను మైనింగ్ సెక్రటరీగా నియమిస్తూ మైనింగ్ విభాగం డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సాంఘిక సంక్షేమ విభాగం నుంచి బదిలీ అయిన కన్నబాబును సీఆర్‌డీఏ కమిషనర్‌గా నియమించారు.
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీగా ఉన్న శేషగిరి బాబును కార్మిక శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- దేవదాయ శాఖ కమిషనర్‌గా ఉన్న ఎస్. సత్యనారాయణను బీసీ సంక్షేమ కార్యదర్శిగా నియమించి, ఈడబ్ల్యూఎస్ అదనపు బాధ్యతలు అప్పగించారు.
- పర్యాటక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్‌ను దేవదాయశాఖ సెక్రటరీగా నియమించారు. పర్యాటక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.
- సెర్ప్ సీఈవో జి.వీరపాండియన్‌ను ఆరోగ్యశాఖ కమిషనర్‌గా నియమించారు.
- మున్సిపల్ శాఖ డైరెక్టర్ హరినారాయణను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీగా బదిలీ చేశారు.
- శాప్ ఎండీ గిరీషాను ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా నియమించారు. దీంతో పాటు శాప్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సీపీడీసీఎల్ ఎండీగా ఉన్న పట్టణంశెట్టి రవిని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా నియమించారు.
- విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్ పి. సంపత్‌కుమార్‌ను మున్సిపల్ శాఖ డైరెక్టర్‌గా నియమించారు.
- పాడేరు ఐటీడీఏ పీవోగా ఉన్నవి. అభిషేక్‌ను పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు.

తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు

రాష్ట్రంలో 27 మంది ఐపీఎస్ అధికారులు సోమవారం బదిలీ అయ్యారు. శాంతి భద్రతల ఏడీజీగా ఎన్.మధుసూదన్‌రెడ్డికి కీలక పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ బాధ్యతలు చూసిన శ్రీకాంత్‌ను సాంకేతిక సేవలకు బదిలీ చేసింది. ఇక, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న పాలరాజును ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్‌గా పంపారు. డీఐజీలు సత్య యేసుబాబు, అట్టాడ బాబూజీ, ఫక్కీరప్పను ప్రాధాన్యంలేని పోస్టుల్లో నియమించారు. సీబీఐ నుంచి తిరిగొచ్చిన ఆర్. జయలక్ష్మికి ఏసీబీ బాధ్యతలిచ్చారు. అలాగే, తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజును, కడప జిల్లా ఎస్పీగా అశోక్ కుమార్ గౌడ్, కర్నూలు ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను నియమించారు. గరికపాటి బిందుమాధవ్‌ను కాకినాడకు బదిలీ చేశారు. అయితే, 'వైపీఎస్' అధికారులుగా పేరొంది, గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు కొమ్ము కాసిన కొల్లి రఘురామిరెడ్డి, రిశాంత్‌రెడ్డి, జాషువా, రవిశంకర్ రెడ్డిలకు ఎలాంటి పోస్టింగులూ దక్కలేదు.

తాజాగా బదిలీ అయిన అధికారుల వివరాలు ఇవీ..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ పోస్టింగ్
ఆర్కే మీనా	ఏడీజీ గ్రేహౌండ్స్	చైర్మన్, ఎస్ఎల్‌పీఆర్‌బీ
ఎన్. మధుసూదన్ రెడ్డి	ఏడీజీ, వెయిటింగ్	ఏడీజీ, శాంతి భద్రతలు
సీహెచ్ శ్రీకాంత్	ఐజీ, శాంతి భద్రతలు	ఐజీ ఆపరేషన్స్(సాంకేతికం అదనం)
జి. పాలరాజు	ఐజీ, వెయిటింగ్	డైరెక్టర్, ఎఫ్ఎస్ఎల్
ఆర్. జయలక్ష్మి	డీఐజీ, వెయిటింగ్	డైరెక్టర్, ఏసీబీ
బి. రాజకుమారి	డీఐజీ ఏపీఎస్పీ	ఐజీ, ఏపీఎస్పీ
బి. సత్య యేసుబాబు	డీఐజీ వెయిటింగ్	డీఐజీ, పీటీవో
కేకేఎన్ అన్బురాజన్	డీఐజీ వెయిటింగ్	డీఐజీ, వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్
బాబూజీ అట్టాడ	డీఐజీ వెయిటింగ్	డీఐజీ, గ్రేహౌండ్స్
ఫక్కీరప్ప కాగినెల్లి	డీఐజీ ఇంటెలిజెన్స్	డీఐజీ, ఏపీఎస్పీ
విక్రాంత్ పాటిల్	ఎస్పీ, కాకినాడ	ఎస్పీ, కర్నూలు
హర్షవర్ధన్ రాజు	ఎస్పీ, వెయిటింగ్	ఎస్పీ, తిరుపతి
ఎల్. సుబ్బరాయుడు	ఎస్పీ, వెయిటింగ్	ఎస్పీ, రెడ్ శాండర్స్
ఎం. దీపిక	కమాండెంట్, కాకినాడ	కమాండెంట్, కర్నూలు
సుబ్బారెడ్డి	ఎస్పీ, పీటీవో	ఎస్పీ, కో-ఆర్డినేషన్
పరమేశ్వర రెడ్డి	ఎస్పీ, వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ
బిందు మాధవ్	ఎస్పీ, కర్నూలు	ఎస్పీ, కాకినాడ
ఎస్. శ్రీధర్	ఎస్పీ, వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ
క్రిష్ణకాంత్ పాటిల్	ఎస్పీ, వెయిటింగ్	డీసీపీ, విశాఖ(అడ్మిన్)
ధీరజ్ కనుబిల్లి	ఏఎస్పీ రంపచోడవరం	ఏఎస్పీ అడ్మిన్, అల్లూరి జిల్లా
జగదీశ్ అడహల్లి	ఏఎస్పీ, పాడేరు	ఏఎస్పీ, ఆపరేషన్స్ అల్లూరి జిల్లా
జె. రామ్మోహన్‌రావు	ఎస్పీ, ఇంటెలిజెన్స్	ఎస్పీ, ఇంటెలిజెన్స్(కేడర్ మార్పు)
ఎస్. శ్రీదేవిరావు	ఎస్పీ, సీఐడీ	ఎస్పీ, సీఐడీ(కేడర్ మార్పు)
అశోక్ కుమార్	ఎస్పీ, ఇంటెలిజెన్స్	ఎస్పీ, కడప
ఏ. రమాదేవి	ఎస్పీ, ఇంటెలిజెన్స్	ఎస్పీ, ఇంటెలిజెన్స్(కేడర్ మార్పు)
కేజీవీ సరిత	ఎస్పీ, సీఐడీ	డీసీపీ, అడ్మిన్, విజయవాడ
కె. చక్రవర్తి	ఎస్పీ, సీఐడీ	ఎస్పీ, సీఐడీ(కేడర్ మార్పు)

దీర్ఘకాలిక సెలవుపై కాటమనేని

సీఆర్‌డీఏ కమిషనర్ పోస్టు నుంచి బదిలీ అయిన కాటమనేని భాస్కర్ దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయన కమిషనర్ అయినప్పటి నుంచి మంత్రి నారాయణతో పొసగడం లేదు. నిత్యం ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తాయి. వీరిద్దరి పంచాయతీ సీఎం చంద్రబాబు వరకూ వెళ్లింది. దీంతో మంత్రి నారాయణ కమిషనర్‌ను తప్పించాలని పట్టుబట్టారు. సీఎం కూడా ఇద్దరికీ నచ్చజెప్పి కొంత కాలం పరిస్థితిని పరిశీలించారు. కానీ, ఎలాంటి మార్పు రాకపోవడంతో కమిషనర్ భాస్కర్‌ను బదిలీ చేశారు. తన బదిలీ అనివార్యమని ముందే ఊహించిన భాస్కర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం కీలకమైన ఐటీ శాఖ ఇచ్చినప్పటికీ ఆయన అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది.

క్లస్టర్ వ్యవస్థకు కొత్తరూపు

» పంచాయతీల ఆదాయం, జనాభా ప్రాతిపదికన కొత్త గ్రేడ్లు

» గ్రేడ్ల ఆధారంగా సిబ్బంది కేటాయింపులు

» గ్రామ పంచాయతీ వ్యవస్థలో సమూల మార్పులు

» వ్యవస్థ బలోపేతానికి డిప్యూటీ సీఎం పవన్ శ్రీకారం

» అధ్యయనం కోసం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల వ్యవస్థ బలోపేతానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధి సంస్థలుగా తీర్చిదిద్దడానికి చర్యలు ప్రారంభించారు. గతంలో గ్రామ పంచాయతీలను ఆదాయపరంగా గ్రేడ్లుగా విభజించారు. ఆ విధానం వల్ల అధిక జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు పలు అంశాలల్లో నష్టం వాటిల్లుతోంది. దీంతో సిబ్బంది సర్దుబాటు అసంబద్ధంగా ఉందని గమనించిన ఉపముఖ్యమంత్రి.. గ్రామ పంచాయతీలను ఆదాయపరంగానే కాకుండా జనాభాను కూడా దృష్టిలో ఉంచుకుని పంచాయతీల గ్రేడ్లను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించారు. దానిపై అధ్యయనం కోసం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇచ్చే సిఫారసులను దృష్టిలో ఉంచుకుని గ్రేడ్‌లను పునర్వ్యస్థీకరిస్తారు. ఆ గ్రేడ్‌ల ఆధారంగా సిబ్బందిని నియమిస్తారు. పంచాయతీరాజ్‌శాఖ నుంచి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. జిల్లా యూనిట్‌గా 26 జిల్లాల్లో ఉన్న పంచాయతీల ఆదాయం, జనాభాను ప్రాతిపదికగా తీసుకుని జిల్లా కలెక్టర్లు ఇచ్చే నివేదికలను రాష్ట్ర కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లను ప్రభుత్వానికి నివేదిస్తుంది.

జనసేన కార్యాలయంపై డ్రోన్.. ప్రభుత్వానిదే: అదనపు ఎస్పీ రవికుమార్



గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రాంతంలో ట్రాఫిక్, రోడ్లు, శానిటేషన్ తదితర అంశాలపై చేస్తున్న పైలెట్ ప్రాజెక్టులో భాగంగానే జనసేన క్యాంపు కార్యాలయంపై డ్రోన్ ఎగరవేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ రవికుమార్ సోమవారం స్పష్టం చేశారు. జనసేన క్యాంపు కార్యాలయంపై డ్రోన్ కలకలం ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగానే ఏపీ ఫైబర్ నెట్ అధికారులు డ్రోన్ ఎగురవేసినట్లు నిర్ధారించామన్నారు. ఇందులో ఎటువంటి అనుమానాలు లేవని వెల్లడించారు. జనసేన క్యాంప్ కార్యాలయంపై డ్రోన్ ఎగరడంపై జనసేన నేతలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపామన్నారు.



పట్నాలో జరిగిన 85వ అఖిల భారత సభాపతుల మహాసభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

శాసన సభల పని దినాలు పెరగాలి

» దీనిపై అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి

» కొత్త సభ్యులకు శిక్షణ ఇవ్వాలి

» అఖిల భారత సభాపతుల మహాసభలో అయ్యన్నపాత్రుడు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శాసన వ్యవస్థలోని ఆర్థిక, పాలనా వ్యవహారాల్లో కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం చేసుకోవడం రాజ్యాంగ మౌళిక సూత్రాన్ని ఉల్లంఘించడమేనని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. 'రాజ్యాంగ విలువలను సుసంపన్నం చేయడంలో చట్టసభల పాత్ర' అనే అంశంపై పట్నాలో జరిగిన 85వ అఖిల భారత సభాపతుల మహాసభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రసంగించారు. దీనిపై సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనసభ పని దినాలు తగ్గితే ప్రజాస్వామ్యం బలహీనమవుతుందని, ఏడాదిలో కనీసం 75 రోజులు సమావేశాలు జరుపుకోవాలన్నారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగాన్ని సవరణ చేయాలన్నారు. చట్టసభలకు కొత్తగా ఎన్నికైన వారికి అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు.

బొమ్మల తయారీలో పురోగతితో ఆత్మనిర్భరత వైపు ప్రయాణం

» 'ఏటికొప్పాక బొమ్మల'పై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బొమ్మల తయారీ రంగంలో పురోగతి సాధించడం వల్ల ఆత్మనిర్భరత వైపు తమ ప్రయాణం వేగవంతమైందని ప్రధాని మోదీ అన్నారు. గతంలో మన్ కీ బాత్ ఒక ఎపిసోడ్‌లో ఏటికొప్పాక బొమ్మల తయారీని ప్రోత్సహించాలని చర్చించామని, ఆ క్రమంలో సమష్టి కృషితో బొమ్మల తయారీలో మరింత శక్తివంతమయ్యామని సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బొమ్మల తయారీ రంగంలో పురోగతి ఆత్మనిర్భరత వైపు తమ ప్రయాణాన్ని వేగవంతం చేసిందని, సంప్రదాయాలు, బొమ్మల వ్యాపారాలకు ప్రజాదరణ తీసుకొచ్చిందన్నారు.

డెన్మార్క్, బెల్జియం నుంచి నేరుగా ఏపీకి విమాన సర్వీసులు

» అంతర్జాతీయ కనెక్టివిటీ పెంచేందుకు కృషి: రామ్మోహన్‌నాయుడు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డెన్మార్క్, బెల్జియం నుంచి నేరుగా ఏపీకి విమాన సర్వీసులు నడిచేలా, ఇంటర్నేషనల్ కనెక్టివిటీ పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. జ్యూరిక్‌లో ఆయన సోమవారం అక్కడ తెలుగు ప్రజలతో మాట్లాడారు. 'మా నాన్న చనిపోయిన తర్వాత సీఎం చంద్రబాబు ఓ కుటుంబ పెద్దగా నన్ను అక్కున చేర్చుకున్నారు. అన్ని రంగాల్లో ఆయనే నాకు స్ఫూర్తి' అన్నారు.

తిరుపతి తొక్కిసలాట బాధితులకు చెక్కులు

» భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు

» టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి

నిజాంపేట్, సరూర్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట దురదృష్టకరమని టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన 6 కుటుంబాలకు తలా రూ. 25 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించామని తెలిపారు. ఇందులో భాగంగా నగరానికి చెంది, గాయపడిన వారికి టీటీడీ తరఫున సోమవారం చెక్కులను అందజేశారు. తొక్కిసలాటలో గాయపడిన మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన కృష్ణారెడ్డి, బుచ్చమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి టీటీడీ తరఫున రూ.2లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా నిజాంపేట్, బండారి లే-అవుట్‌లో నివాసం ఉంటున్న సావిత్రి, సాంబశివరెడ్డిలకు చెరో రూ. 2 లక్షల చెక్కులను ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ ప్రాజెక్టుకు జాతీయ అవార్డు



ఢిల్లీలో ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎన్ఎస్‌టీఎల్ అధికారులు

విశాఖపట్నం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం కోసం విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) అత్యాధునిక లైట్ వెయిట్ టార్పెడోను అభివృద్ధి చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కింద చేస్తున్న ఈ ప్రాజెక్టు వివరాలను ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ సింపోజియంలో సమర్పించగా... దీనికి 'నేషనల్ ప్రాజెక్ట్ ఎక్సలెన్స్ అవార్డు-2024' లభించింది. ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ సోమనాథ్ ఈ అవార్డును అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావును, బృందాన్ని నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ ఆర్‌వీ హరప్రసాద్, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం అభినందించారు.

చిత్తూరులో డిజిటల్ హెల్త్, ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్

» లీసెస్టర్ విశ్వవిద్యాలయంతో అపోలో వర్సిటీ, ఆస్పత్రి ఒప్పందం


హైదరాబాద్ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్ (సీడీహెచ్‌పీఎం) ఏర్పాటుకు అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్, బ్రిటన్‌లోని లీసెస్టర్ యూనివర్సిటీ చేతులు కలిపాయి. చిత్తూరులో ఉన్న అపోలో విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సీడీహెచ్‌పీఎంను ఆ వర్సిటీ చాన్స్‌లర్, అపోలో ఆస్పత్రుల వస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి సోమవారం ప్రారంభించారు. అపోలో వర్సిటీ వీసీ డాక్టర్ వినోద్ భట్, లీసెస్టర్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, వీసీ నిషాన్ కనగరాజా పాల్గొన్నారు. ఈ కేంద్రం కో-డైరెక్టర్లుగా లీసెస్టర్ విశ్వవిద్యాలయంలో కార్డియాలజీ ప్రొఫెసర్ నీలేష్ జె సమాని, అపోలో ఆస్పత్రుల చీఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ సుజోయ్ కర్ వ్యవహరిస్తారని అపోలో ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సోమవారం నుంచి ఈ సెంటర్ పూర్తిగా అందుబాటులోకి వచ్చిందని తెలిపాయి.

నేడు కృష్ణాబోర్డు సమావేశం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం కీలకమైన అజెండాలతో మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. ఇప్పటికే రెండుసార్లు సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే..! జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ)-2021లోని సెక్షన్ 16(1ఏ) ప్రకారం నాగార్జునసాగర్ భద్రతకు సంబంధించిన నిఘా, 16(1బీ) ప్రకారం తనిఖీలు, 16(1సీ) ప్రకారం నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోనే ఉండాలని.. ఆయా బాధ్యతలను తమకే అప్పగించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. సాగర్, శ్రీశైలంలోని అన్ని కాంపోనెంట్లను కృష్ణాబోర్డుకు అప్పగించాలని, ప్రాజెక్టుల రక్షణ సీఆర్‌పీఎఫ్‌కు కట్టబెట్టాలనే ఏపీ కోరుతోంది. ఈ రెండు అంశాలు అజెండాగా కృష్ణాబోర్డు భేటీ జరగనుంది. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన విషయం తెలిసిందే.



జ్యూరిక్‌లో తెలుగు కమ్యూనిటీ నిర్వహించిన సమావేశానికి హాజరైన ప్రవాసాంధ్రులు, మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



మీకు జీవితాంతం రుణపడి ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

రద్దీ పెరిగిపోయింది. యూరప్‌లో తెలుగువారు ఎక్కువమంది ఉన్నారు. ఇక్కడ బోలెడన్ని అవకాశాలూ ఉన్నాయి." అని చంద్రబాబు అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

సంస్కరణలు ప్రారంభించింది నేనే...

"పౌరులను తయారుచేసే బాధ్యత తీసుకున్న నాయకులు ప్రతి దేశంలోను కనిపిస్తారు. సింగపూర్ ఫిషర్‌మెన్ విలేజ్‌ను నాటి పాలకుడు లీక్వాన్యూ.. మంచి నివాస దేశంగా మలిచారు. 1995లో ముఖ్యమంత్రి అవుతూనే నేనూ ఇలాగే ఆలోచించాను. 1991లో ఐటీ విప్లవం వచ్చింది. దానిని ఆధారం చేసుకుని రెండోదశ సంస్కరణలు ప్రారంభించాను. ఫలితంగా ఈరోజు హైదరాబాద్ దేశంలోనే నంబర వన్ తలసరి ఆదాయం కలిగి ఉంది."

'డబుల్ ఇన్‌కమ్.. నో కిడ్స్...'

"డబ్బులు వచ్చాయి. ఐటీ విప్లవంతో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. డబుల్ ఇన్‌కమ్, నో కిడ్స్. ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో అన్ని దేశాల్లో జనాభాసమస్య వచ్చింది. భారత్ నుంచి మనుషులను పంపాలని జపాన్ అడుగుతోంది. మనుషులు లేకపోతే ఎవరు పనిచేస్తారు? అందువల్లే ఈ సమస్యపై నేనిప్పుడు దృష్టి పెట్టా. ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం. ఉక్రెయిన్‌లో వైద్యవిద్య చౌక. దానికోసం మన విద్యార్థులు అక్కడకు పోయి..ఆ యుద్ధంలో చిక్కుకున్నారు. వారి క్షేమం గురించి నాటి జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పుడు నేను ఇచ్చిన పిలుపునకు యూరప్‌లోని తెలుగువారంతా స్పందించారు. మన విద్యార్థులను క్షేమంగా ఏపీకి రప్పించడానికి సహకరించారు"

ఫైల్ పట్టుకుని అమెరికాలో తిరిగాను..

"ఆ రోజు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలను ప్రారంభించకపోతే ఏమయ్యేది? నేను ఆరోజు మీ భవిష్యత్తు చూశాను. అందువల్లే ఫైలు పట్టుకుని అమెరికా లో తిరిగాను. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ రాజకీయనేతలను కలవరు. చివరకు ఆయనను కలిసి, 45 నిమిషాలు మాట్లాడాను. మైక్రోసాఫ్ట్ సెంటరును హైదరాబాద్‌లో పెట్టేందుకు ఒప్పించాను. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడం వల్లే తెలుగుబిడ్డ సత్యనాదెళ్ల సీఈవో అయ్యారు"

వర్క్ ఫ్రమ్ హోమ్ హబ్‌గా ఏపీ

"2004లో టీడీపీ తిరిగి గెలిచిఉంటే, తెలుగు జాతి ఇప్పుడు ఎక్కడో ఉండేది. కానీ నా తర్వాతి పాలకులు నేను నిర్మించిన సైబరాబాద్‌ను కూల్చలేదు. కానీ, 2019లో వైసీపీ ప్రభుత్వం... ప్రజా వేదికను కూల్చేసింది. వాటన్నింటినీ సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఏపీని వర్క్‌ఫ్రమ్ హోమ్ హబ్‌గా చేయాలన్నదే నా కోరిక. మోదీ వికసిత భారత్ పిలుపునిస్తే.. స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్-2047నుతయారు చేశాను. ఈ విజన్ సాకారానికి మీరూ సహకరించండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

"ఇన్ని దేశాల్లో ఇంతమంది తెలుగువారు ఉన్నారని నేను ఊహించలేదు. నేను జైల్లో ఉన్నప్పుడు మీరు ఎక్కడెక్కడో ఉండి నా కోసం ప్రదర్శనలు నిర్వహించారు. ఇన్నిదేశాల్లో తెలుగువారున్నారా అని అప్పట్లో నేను ఆశ్చర్యపోయాను. ఈ ప్రదర్శనలు ఒకటి రెండు రోజులు కాదు.. నేను జైలులో ఉన్న 53 రోజులూ కొనసాగించారు. ఇందుకు నేను మీకు జీవితాంతం రుణపడి ఉంటా. ఆ తర్వాత జరిగిన ఎన్నికలప్పుడూ అంతే.. ప్రపంచం నలుమూలల నుంచి మీరంతా వచ్చి నెలల తరబడి ఏపీలో ఉన్నారు. మీకు ఎంత శక్తి ఉంటే అంత డబ్బు ఖర్చు పెట్టి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఇంత స్ఫూర్తిదాయకమైన తెలుగు జాతిలో పుట్టడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. మళ్లీ తెలుగువాడిగానే పుట్టాలని కోరుకుంటున్నా"
- ముఖ్యమంత్రి చంద్రబాబు

బాబోయ్.. చలి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నకు సమాధానం చెప్పలేక... చంద్రబాబు ప్రతి ఏటా దావోస్‌కు వెళ్లినా చేసిందేమీ లేదని చెప్పాలనుకుని... ఇంకేదేదో చెప్పి ఇలా అభాసు పాలయ్యారు. దావోస్‌లో ప్రతియేటా ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుంది. పెట్టుబడుల ఆకర్షణకు, 'బ్రాండ్' ప్రమోషన్‌కు ఇదో అద్భుతమైన వేదిక! 'మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి' అని ఒక్కో దేశానికి తిరగాల్సిన అవసరం లేదు. ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ సంస్థల అధిపతులు, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులంతా దావోస్ ఆర్థిక సదస్సులో అందుబాటులో ఉంటారు. మన పారిశ్రామిక విధానాలను వివరించేందుకు అదో చక్కటి అవకాశం! అందుకే... పెట్టుబడుల వేటలో ఉన్న వారు ఈ సదస్సుకు తప్పనిసరిగా హాజరవుతారు.

చలికి భయపడి ఆగిపోతే...

దావోస్‌లో మామూలుగానే చలి ఎక్కువ! ఆర్థిక సదస్సు సమయంలో చలి ఇంకా ఎక్కువ. చలికి భయపడి ఆగిపోతే... 'బ్రాండ్ ఏపీ'ని ప్రమోట్ చేసే చక్కటి అవకాశాన్ని కోల్పోయినట్లే! 2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రమం తప్పకుండా దావోస్ పర్యటనకు వెళ్లారు. కొత్తగా ఏర్పడిన 'నవ్యాంధ్ర'ను ప్రమోట్ చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఒకేఒక సారి దావోస్ ఆర్థిక సదస్సుకు... అది కూడా అన్యమనస్కంగానే హాజరయ్యారు. 'మీరు ఎందుకు దావోస్ వెళ్లడంలేదు' అని ప్రశ్నిస్తే... 'చంద్రబాబు వెళ్లి మాత్రం చేసిందేమిటి!' అంటూ వింత ప్రశ్నలు! చలి గిలి అంటూ వింత కబుర్లు!

అదే ఆహార్యం...

ఈసారి 55వ ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో సహా తెలంగాణ - ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యారు. అక్కడ... తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులతో చంద్రబాబు దిగిన గ్రూప్ ఫొటో ఒకటి విడుదలైంది. అందులో... యువకుడైన లోకేశ్‌తోపాటు విగిలిన వాళ్లంతా చలిని తట్టుకునేందుకు వీలుగా బలమైన జాకెట్లు, చేతులకు గ్లౌజులు వేసుకున్నారు. 74 ఏళ్ల వయసున్న చంద్రబాబు మాత్రం ఏపీలో ఎప్పుడూ ఎలా కనిపిస్తారో దావోస్‌లోనూ అదే ఆహార్యంతో కనిపించారు. చలికి వణకకుండా, తొణకకుండా తొలిరోజు నుంచే సదస్సులు, సమావేశాల్లో పాల్గొన్నారు. 'బ్రాండ్ ఏపీ'ని ప్రమోట్ చేయడంపై దృష్టి సారించారు.

జ్యూరిక్‌లో బాబు బిజీబిజీ

» పెట్టుబడిదారులతో వరుస సమావేశాలు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జ్యూరిక్‌లో సీఎం చంద్రబాబు రోజంతా బిజీగా గడిపారు. పలువురు పెట్టుబడిదారులతో సమావేశమయ్యారు. జ్యూరిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ ప్రతినిధులు విమానాశ్రయంలో చంద్రబాబును కలిశారు. ప్రపంచంలో తొమ్మిదికిపైగా అతిపెద్ద విమానాశ్రయాలను ఈ సంస్థ నిర్మించింది. జ్యూరిక్ తరహా విమానాశ్రయాన్ని ఏపీలో నిర్మించాలంటూ ప్రతినిధులను సీఎం కోరారు. చంద్రబాబు ప్రతిపాదనలపై సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామన్నారు. అనంతరం యంత్ర పరికరాల తయారీ సంస్థలతో చంద్రబాబు సమావేశమయ్యారు. అనంతరం జ్యూరిక్‌లోని హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో బాబు బృందం భేటీ అయ్యింది. రాష్ట్రానికి స్విస్ నుంచి పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై మృదుల్‌తో చంద్రబాబు చర్చించారు. ఏపీలో ఫార్మారంగంలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మృదుల్‌కు చంద్రబాబు వెల్లడించారు. ఫార్మా టెక్నికల్ మెడికల్ డివైజ్‌లు, టెక్స్‌టైల్, రైల్ కాంపోనెంట్లు వంటి తయారీ రంగంలో విస్తృతంగా రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వర్క్ ఫ్రమ్‌హోమ్ విధానంలో స్విట్జర్లాండ్‌కు కావాల్సిన సేవలను అందించగల యువత ఏపీలో ఉన్నదని తెలిపారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబును కలిశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్,టీజీ భరత్, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వారి వెంట ఉన్నారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

» పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సానుకూలం

» స్విస్ పారిశ్రామికవేత్తలకు లోకేశ్ ఆహ్వానం

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో మాన్యుఫాక్చరింగ్, ఆర్అండ్‌డీ కేంద్రాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ముఖ్యమైన పరికరాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ స్విస్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి స్విస్ పరిశోధన సంస్థలు పనిచేయాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందుకు పూర్తి సానుకూల వాతావరణం ఉందన్నారు. ఏపీలో స్టార్టప్‌లను ప్రోత్సహించడం, సాంకేతికత బదిలీల కోసం ఇన్నోవేషన్ హబ్, ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. స్విస్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మోడల్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం జ్యూరిక్‌లో స్విస్ పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అనుకూల విధానాలను అమలు చేస్తోందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసిందన్నారు. రాష్ట్రంలో 1053 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, నౌకాశ్రయాలు ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్, స్విస్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ సెక్రటరీ జనరల్ రావోల్ కెల్లర్, ఒర్లికాన్ సీఈవో మార్కస్ టకే, యాంగ్రిట్ ఫిస్టర్ సీఈవో ఎరిక్ షెమిడ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ పాల్గొన్నారు.



స్విట్జర్లాండ్ పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, భరత్

ఏడాదిలో రూ.40 వేల కోట్లు

ఏపీ ఆర్థిక వ్యవస్థలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషిస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. 2023 ఆర్‌బీఐ డేటా ప్రకారం ఏపీకి ఎన్ఆర్ఐల ద్వారా వచ్చిన మొత్తం రూ.40 వేల కోట్ల పైచిలుకు అని, ఇంత మొత్తం దేశంలో ఏ ఇతర రాష్ట్రానికి రాలేదన్నారు. జ్యూరిక్‌లో తెలుగువారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'నా దృష్టిలో మీరు నాన్ రెసిడెంట్ ఇండియన్స్(ఎన్ఆర్ఐ) కాదు మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్(ఎంఆర్ఐ)' అన్నారు. ప్రవాసాంధ్రులు టీడీపీకి, ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారన్నారు. 'ఎన్ఆర్ఐలపై మాకు ప్రేమాభిమానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో నలుగురు ప్రవాసాంధ్రులను ఎమ్మెల్యేలను చేశాం. మరికొందరికి నామినేటెడ్ పదవులు కూడా ఇచ్చాం' అన్నారు.

జ్యూరిక్కా... జువ్వలపాలెమా

'ఇక్కడి పరిస్థితులను చూస్తుంటే జ్యూరిక్‌లో ఉన్నానా లేక జువ్వలపాలెంలో ఉన్నానా అన్న సందేహం కలుగుతోంది. జ్యూరిక్‌లో ఇంతమంది తెలుగువారిని ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉంది. ప్రపంచాన్ని ఏలే సత్తా తెలుగువారికి మాత్రమే ఉంది. ఏపీకి ఎందుకు రావాలని అడిగితే నేను మా బ్రాండ్ సీబీఎన్ అని చెబుతా' అని లోకేశ్ అన్నారు.

ఓంక్యాప్‌ను పునర్నిర్మిస్తున్నాం

తాను మానవ వనరుల శాఖ మంత్రి అయ్యాక ఓంక్యాప్ (ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ)ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించానని లోకేశ్ తెలిపారు. 'ఎన్నికల సమయంలో ప్రవాసాంధ్రులు సెలవులు పెట్టి మరీ ఏపీకి వచ్చి కూటమి విజయానికి కృషి చేశారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర పునర్నిర్మాణానికి కలిసి రావాలి. ప్రవాసాంధ్రులకు సహాయ సహకారాలు అందించేందుకు ఏపీ ప్రభుత్వం, టీడీపీ సంయుక్తంగా ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు సెల్‌ను ఏర్పాటు చేయబోతున్నాయి. విద్య, ఉద్యోగం, నైపుణ్యాలు దశాబ్దాలుగా తెలుగువారు విదేశాలకు వలసవెళ్లి స్థిరపడేలా చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడింటిని పునర్నిర్మించడం, ఆధునీకరించడంపై దృష్టి సారించింది. రాష్ట్ర యువత విదేశాలకు వలస వెళ్లకుండా సొంత గడ్డపైనే సేవలందించేలా చేయడం కూటమి ప్రభుత్వ ఉద్దేశం' అని లోకేశ్ అన్నారు.

ఏపీలో వరల్డ్ క్లాస్ పీజీఏ గోల్ఫ్ సిటీ

» లోకేశ్‌తో స్టోన్ క్రాఫ్ట్ ప్రతినిధుల భేటీ

ఏపీలో ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా(పీజీఏ) ప్రామాణిక గోల్ఫ్ సిటీ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ ప్రతినిధులను కోరారు. జ్యూరిక్‌లో లోకేశ్‌తో స్టోన్‌క్రాఫ్ట్ గ్రూపు స్ట్రాటజిక్ గ్లోబల్ అడ్వయిజర్ ఫణి శ్రీపాద, సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ.. ప్రతిపాదిత ప్రపంచ స్థాయి గోల్ఫ్ సిటీ ఏపీలో ఏర్పాటైతే రాష్ట్రంలో పర్యాటకంతో పాటు ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. గోల్ఫ్ సిటీకి సంబంధించి పూర్తిస్థాయి బ్లూప్రింట్‌తో వస్తే 15 రోజుల్లో ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు అన్ని అనుమతులు మంజూరు చేస్తుందన్నారు.

ఎవరికి నచ్చినా.. నచ్చకున్నా.. లోకేశ్ కాబోయే సీఎం!

» పారిశ్రామికవేత్తల భేటీలో మంత్రి టీజీ భరత్

» మందలించిన చంద్రబాబు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి లోకేశ్ అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం సభ్యుడైన ఆయన.. సోమవారం సాయంత్రం జ్యూరిక్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 'డైనమిక్ యంగ్ లీడర్ లోకేశ్ అత్యంత ఉన్నత విద్యావంతుడు. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేలు, 25 ఎంపీలు, రాజ్యసభ సభ్యుల్లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివినవారు ఎవరూ లేరు. ఏపీలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపిస్తే.. భవిష్యత్‌లో ఏమవుతుందోనన్న అనుమానాలు పారిశ్రామికవేత్తల్లో చాలామందికి ఉన్నాయి. సొంత చెల్లికి, తల్లికే న్యాయం చేయలేనోడు (మాజీ సీఎం జగన్‌నుద్దేశించి) 5 కోట్ల మంది ప్రజలకు ఏం చేయగలుగుతాడనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ప్రజలు ఓటేసేటప్పుడు కచ్చితంగా ఒక్క నిమిషమైనా ఆలోచిస్తారు కాబట్టి ఇబ్బంది లేదు. కచ్చితంగా తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను కొన్ని దశాబ్దాలపాటు పరిపాలిస్తుంది. అందుచేత ఎలాంటి సమస్యా ఉండదు' అని వారికి భరోసా ఇచ్చారు.



చంద్రబాబు ఆగ్రహం

లోకేశ్ కాబోయే సీఎం అని వ్యాఖ్యానించిన భరత్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమయం, సందర్భం లేకుండా అనవసరమైన విషయాలు మాట్లాడొద్దని మందలించినట్లు సమాచారం. అంతకు ముందే ఏపీలోని పార్టీ నేతలకు పార్టీ అధిష్ఠానం గట్టి హెచ్చరికలు జారీచేసింది. లోకేశ్‌ను ఉపముఖ్యమంత్రిని చేయాలన్న ప్రకటనలు మానుకోవాలని.. ఆ విషయంపై అసలు మాట్లాడొద్దని ఆదేశాలిచ్చింది. ఇది జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే చంద్రబాబు సమక్షంలోనే కాబోయే ముఖ్యమంత్రి లోకేశ్ అని భరత్ వ్యాఖ్యానించారు. దీంతో ఆ సమావేశం ముగిశాక ఆయనకు చంద్రబాబు అక్షింతలు వేశారు. 'మనం ఇక్కడకు వచ్చింది దేనికి? నువ్వు మాట్లాడింది ఏవిటి? ఏదైనా సమయం, సందర్భం ఉండక్కర్లేదా? మరోసారి ఇలా మాట్లాడితే ఊరుకునేది లేదు' అని ఆయన మంత్రిని మందలించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అటు లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలని కోరుతూ టీడీపీ నేతలు మూడ్రోజులుగా డిమాండ్ చేస్తుండడాన్ని కూడా చంద్రబాబు తప్పుబట్టారు. తక్షణమే దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని సోమవారం దావోస్ నుంచే పార్టీ కేంద్ర కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కార్యాలయ బాధ్యులు ఆయన ఆదేశాలను అధికార ప్రతినిధులు, ముఖ్య నేతలకు ఫోన్‌చేసి తెలియజేశారు. మూడ్రోజుల క్రితం పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. దానిపై చంద్రబాబు స్పందించలేదు. మర్నాటి నుంచి టీడీపీ నేతలు ఆ దిశగా ప్రకటనలు పెంచారు. ఇవి మరీ ఎక్కువ అవుతుండడంతో ముఖ్యమంత్రి వాటిని ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. 'అనవసరమైన అంశాలను మీడియా ముందు ప్రస్తావించవద్దు. అంతర్గత విషయాలను కూటమి పక్షాల అధినేతలు మాట్లాడతారు. మరెవరూ దీనిపై స్పందించవద్దు' అని కేంద్ర కార్యాలయం సూచించింది.

బాబు బ్రాండ్ అదనపు అడ్వాంటేజ్: భరత్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు వివిధ రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నారని, చివరకు ఎక్కడ ఎక్కువ సబ్సిడీలు లభిస్తే ఆ రాష్ట్రానికే వెళ్లిపోతున్నారని పరిశ్రమల మంత్రి భరత్ తెలుగు పారిశ్రామికవేత్తలతో భేటీలో వివరించారు. ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పారిశ్రామిక ప్రోత్సాహకాలతోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తోందని చెప్పారు. పైగా చంద్రబాబు బ్రాండ్ తమ రాష్ట్రానికి అదనపు అడ్వాంటేజ్‌గా పేర్కొన్నారు. అందుకే 7 నెలల్లోనే రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి బీపీసీఎల్, రిలయన్స్, ఎన్‌టీపీసీ, విుట్టల్ స్టీల్స్ వంటి కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. స్విట్జర్లాండ్ నుంచి కూడా పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

తాబేళ్లపై మృత్యు వల!

- చేపల వేటకు వచ్చి చంపుతున్న తమిళనాడు బోట్లు
- అల్లూరు తీరం వెంబడి భారీగా కళేబరాలు
- సంతానోత్పత్తి కోసం తీరానికి వచ్చి మృత్యువాత
- విస్మరిస్తే అంతరించిపోయే ప్రమాదం.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ఏమైంది?

అల్లూరు, జనవరి 20: కొందరు వేటగాళ్ల నిర్లక్ష్యానికి సముద్రంలోని భారీ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. రెండేళ్లుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా సముద్ర తీరప్రాంతంలో వేలాదిగా తాబేళ్ల కళేబరాలు కనిపిస్తూనే ఉన్నా.. ఏదో చనిపోయాయిలే అన్న ధోరణితో అందరూ చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కానీ పరిశీలనగా చూస్తే చేపల వేటకని వెళ్లేవారిలో కొందరు వాటిని పొట్టన పెట్టుకుంటున్నట్లు అర్థమవుతుంది. వాస్తవానికి ఇది సీజన్ కావడంతో సముద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో జీవించే తాబేళ్లు తీరానికి చేరుకొని గుడ్లు పెట్టి తిరిగి వెళ్లిపోతాయి. ప్రధానంగా కర్మాగారాల్లో నుంచి వచ్చే వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల నీరు కలుషితమవుతుంది. ఇలాంటి సమయంలో మృతిచెందే తాబేళ్లు తీరంలో 100 కి.మీ పరిధిలో చూసుకున్నా పది పదిహేను ఉంటాయి. అయితే ఇటీవల కాలంలో జిల్లాలోని 173 కి.మీ విస్తీర్ణం ఉన్న తీరప్రాంతంలో వేలాది సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తున్నాయి. ఇది మాత్రం కాలుష్య ప్రభావం కాదని, కేవలం మానవ తప్పిదమేనని స్థానికులు అంటున్నారు.



సముద్ర తీరంలో పడి ఉన్న తాబేలు కళేబరం

వేటకు వచ్చి చంపేస్తున్నారు: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పెద్దబోట్ల (సోనాబోట్లు) కారణంగా తాబేళ్లు వేలాది సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని కొంతమంది పరిశీలకులు, స్థానిక మత్స్యకారులు అంటున్నారు. అత్యధికంగా నెల్లూరు జిల్లాకు తమిళనాడు బోట్ల సమస్య ఇటీవల తీవ్రం కావడంతో వీరు వినియోగించే భారీ వలల కారణంగా తాబేళ్లు మృతిచెందుతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. తమిళనాడు బోట్లు నిర్వాహకులు అక్రమంగా రావడమే కాకుండా తమ భారీ బోట్లకు వెనుక ఏర్పాటు చేసే భారీ వలను బోటుతో పాటు నీటిలోనే లాక్కెళ్లడంతో దానికి సమీపంలో వచ్చే పెద్ద చేపలతోపాటు అన్ని రకాల మత్స్యజాతి జీవులు ఇరుక్కుంటాయి. ఇలా రెండు రోజులపాటు ఈడ్చుకుంటూ వెళ్లే క్రమంలో తాబేళ్లు ఆ వలలో చిక్కుకోవడంతో భారీ స్థాయిలో మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. తాబేలు జీవిత కాలం 80 నుంచి 150 ఏళ్లయినప్పటికీ.. వీటిని ఆదిలోనే చిదిమేస్తున్న పరిస్థితి. ఇది సాధారణమే అనుకొని విస్మరిస్తే సముద్ర తాబేళ్లు అంతించి పోయే ప్రమాదం ఉంది. వన్యప్రాణులను హతమారిస్తే కఠినశిక్షలు పడతాయని ప్రభుత్వాలు హెచ్చరించడమే కాదు, అలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగానే శిక్షిస్తోంది. కానీ సముద్రంలో పెరిగే భారీ తాబేళ్లను చంపుతుంటే వన్యప్రాణి సంరక్షణ చట్టం ఏమైందని జంతు ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల బోట్లను నిలువరించాలి



భారీ వలల కారణంగా తాబేళ్లు మృతి చెందుతున్నాయి. చేపల వేటలో చేపలు తప్ప వింగతా ఏ జీవి పడినా వాటిని అక్కడే సురక్షితంగా వదిలేస్తుంటాం. కానీ కొంతకాలంగా పక్క రాష్ట్రాల వారు బోట్లకు భారీ వలలను ఏర్పాటు చేసి వాటిని నీటిలోనే ఈడ్చుకుంటూ రావడం రెండు రోజుల తర్వాతగానీ వాటిని చూడకపోవడంతో చేపలు వింనహా మిగతా జీవులు భారీ స్థాయిలో మృతిచెందుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బోట్లను నిలువరిస్తేగానీ ఈ సమస్య తగ్గుముఖం పట్టదు.

- ఆవుల త్యాగరాజు, మత్స్యకారుడు, తాటిచెట్లపాలెం, బోగోలు మండలం

ప్రభుత్వాస్పత్రిలో 'స్టెర్నల్ ప్లేట్ ఫిక్సేషన్ సర్జరీ'

ఏపీలో ఇదే మొదటిసారి..

గుంటూరు జీజీహెచ్ వైద్యుల వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పక్కటెముకలతోపాటు గుండెకు రక్షణగా ఉన్న స్టెర్నమ్ ఎముకలు విరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి గుంటూరు ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా స్టెర్నల్ ప్లేట్ ఫిక్సేషన్ సర్జరీ చేసి ఆయన ప్రాణాలు కాపాడారు. ప్రకాశం జిల్లాకు చెందిన జీ చిన్న రామయ్య (66) ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన పక్కటెముకలు విరగడంతో పాటు ఛాతిలో గుండెకు రక్షణగా ఉండే స్టెర్నమ్ ఎముకలు విరిగి గుండె దగ్గరగా చొచ్చుకుపోయాయి. దీని వల్ల బాధితుడు ఊపిరి తీసుకోవడం కష్టమైంది. చికిత్స నిమిత్తం రామయ్యను గతనెల 28న గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా.. వెంటనే ఆపరేషన్ చేసి విరిగిన స్టెర్నమ్ ఎముకలను సరిచేయాలని వైద్యులు నిర్ణయించారు. హైదరాబాద్‌లోని ఉతేషియా మెడికేర్ సంస్థను సంప్రదించి స్టెర్నల్ ప్లేట్‌లను ఉచితంగా జీజీహెచ్‌కు తెప్పించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ నెల 3న బాధితుడికి ఆపరేషన్ నిర్వహించి విరిగిన ఛాతీ ఎముకల్లో స్టెర్నల్ ప్లేట్‌లు అమర్చారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ యుల్, డాక్టర్ ప్రమోద్ హరి ఈ ఆపరేషన్ నిర్వహించారు. కాగా, స్టెర్నల్ ప్లేట్ ఫిక్సేషన్ సర్జరీ చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.



నిపుణుల మాటకే ఓటు

- టీ-16 మిశ్రమం వాడాలని ఆదేశం
- పీపీఏ ద్వారా జల వనరుల శాఖకు జల సంఘం సమాచారం

అమరావతి/ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం విషయంలో అంతర్జాతీయ నిపుణుల సూచనలకే కేంద్ర జల సంఘం ఆమోద ముద్ర వేసింది. వారు సిఫారసు చేసిన టీ-16 మిశ్రమం వాడాలని నిర్ణయించి రాష్ట్రప్రభుత్వానికి ఆదేశాలు కూడా ఇచ్చేసింది. సోమవారం ఢిల్లీలో జల సంఘం అంతర్గత సమావేశం జరిగింది. ఇందులో సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) చెప్పినట్లుగా టీ-5 మిశ్రమం కాకుండా.. అమెరికా, కెనడా నిపుణులు సూచించిన టీ-16ను మాత్రమే వాడాలని తీర్మానించి.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా రాష్ట్ర జల వనరుల శాఖకు సమాచారం చేరవేసింది. దీంతో మంగళవారం నుంచి టీ-16 మిశ్రమంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు నిర్మాణ సంస్థ బావర్ సన్నద్ధమైంది. మరోవైపు.. ప్రాజెక్టు క్షేత్రంలో డయాఫ్రం వాల్ పనులు మరింత ఊపందుకున్నాయి. రెండ్రోజుల కిందట ట్రెంచ్ కట్టర్ ద్వారా భూమి అంతర్భాగంలో ఉన్న మట్టి, ఇసుక, రాతి తవ్వకాల పనులు ప్రారంభించారు. సోమవారం మూడో రోజు కూడా అవి కొనసాగాయి. ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం ప్రాంతంలో డీవాల్ గైడ్‌బండ్ కాంక్రీటు గోడల మధ్య.. ట్రెంచ్ కటింగ్ యంత్రంతో బెంటోనైట్ ద్రవాన్ని పంపుతూ భూగర్భంలో ఉన్న రాతి పొరల వరకూ తవ్వకాలు చేస్తున్నారు. ఏ మిశ్రమం వాడాలో స్పష్టత వచ్చేవరకూ వేచి ఉండాలని జలసంఘం సూచించడంతో వాల్ నిర్మాణం నిలిచిపోయిందన్న వార్తల్లో వాస్తవం లేదని ప్రాజెక్టు సీఈ నరసింహమూర్తి స్పష్టం చేశారు. పనులు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. 1.5 కిమీ కాంక్రీటు గైడ్ వాల్ నిర్మాణం చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 80 మీటర్లు పూర్తయిందని, మిగిలిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.



డయాఫ్రం వాల్ నిర్మాణంలో ట్రెంచ్ కటింగ్ పనులు

జి.మాడుగులలో 4.7 డిగ్రీలు

మన్యంలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, పాడేరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి ప్రభావం తీవ్రంగా ఉంది. సోమవారం అల్లూరి జిల్లా జి.మాడుగులలో 4.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గూడెంకొత్తవీధిలో 5.5, పెదబయలులో 5.8, డుంబ్రిగుడలో 6, పాడేరులో 6.1, అరకులోయలో 6.6, చింతపల్లిలో 7, ముంచంగిపుట్టులో 7.8, హుకుంపేటలో 8.3, అనంతగిరిలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం పది గంటల వరకూ పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి. ఉత్తరకోస్తా, తెలంగాణకు ఆనుకుని ఉన్న కోస్తా ప్రాంతాల్లో చలి కొనసాగింది. దీనికితోడు మంచు కురుస్తోంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల చలి ప్రభావం నెలకొంటుందని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు.



ముంచంగిపుట్టులో ఆవరించిన మంచు



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హీరోయిన్లు కృతిశెట్టి, సంయుక్త మీనన్

జగన్ దెబ్బకు పరిశ్రమలే కాదు.. పక్షులూ పారిపోయాయి!

- ఫ్లెమింగో ఫెస్టివల్ సభలో మంత్రి అనగాని

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌ను చూసి పరిశ్రమలతోపాటు, పక్షులు కూడా పారిపోయాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కేంద్రంగా సోమవారం జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబు ఆలోచనతో 2014లో హ్యాపీ సండే కార్యక్రమాలను ప్రవేశపెట్టామని, అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చీరాగానే ఆ కార్యక్రమాన్ని విస్మరించిందని తెలిపారు. కానీ, ఇదే హ్యాపీ సండే కార్యక్రమాన్ని పలు దేశాల్లో అమలు చేస్తున్నారని, ఇదీ చంద్రబాబు విజన్ అని వెల్లడించారు. జగన్ ప్రభుత్వంలో నిలిచిపోయిన పక్షుల పండుగను తిరిగి అద్భుతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారని చెప్పారు. పులికాట్ ముఖద్వారాల పూడికతీత కోసం 100 కోట్లు కేటాయించామని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు సినీ కథానాయికలు కృతిశెట్టి, సంయుక్త మీనన్ బహుమతులు అందజేశారు. ఫెస్టివల్ ముగింపు సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మూడోరోజు పక్షుల పండుగకు జనం పోటెత్తారు. నేలపట్టు, అటకానితిప్పలో పక్షులను చూడ్డానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బీవీపాలెం పడవల రేవు కిటకిటలాడింది.

సంజయ్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

- అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంది.. హైకోర్టుకు సీఐడీ మాజీ చీఫ్ వెల్లడి

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం కేసులో సీఐడీ మాజీ చీఫ్ ఎన్. సంజయ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. సోమవారం ఈ పిటిషన్ విచారణకు రాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. "ఈ వ్యవహారంలో అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారు. విచారణను మంగళవారానికి వాయిదా వేయండి" అని కోర్టును కోరారు. సంజయ్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌ను అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంది. వ్యాజ్యం నిరర్థకమయ్యే ప్రమాదం ఉంది. ఆధారాలన్నీ నివేదికల(డాక్యుమెంట్ల) రూపంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలి" అని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. వైసీపీ హయాంలో సీఐడీ చీఫ్‌గా, అగ్నిమాపకశాఖ డీజీగా వ్యవహరించిన సంజయ్ 150 ట్యాబ్‌ల సరఫరా, 'అగ్ని' ఎన్‌వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి కోసం సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సుల నిర్వహణకు క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నారు. అయితే.. ఈ ఒప్పందాలు నిబంధనలకు విరుద్ధమని, మోసపూరితంగా బిల్లులు చెల్లించడం ద్వారా రూ.1.75 కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంటూ ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సంజయ్ హైకోర్టును ఆశ్రయించారు. మరో వైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్లు శరణు వినయ్‌కుమార్, పాలవలస వెంకట తులసిరామ్, సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రాకు చెందిన డైరెక్టర్లు శరణు సూర్య లలిత, వీరమాచనేని శ్రీహరిత వేర్వేరుగా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

ప్రాథమిక దశలో దావాను తిప్పికొట్టొద్దు!

- దావాలపై అభ్యంతరాలు తేల్చేది రిజిస్ట్రీ కాదు: హైకోర్టు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ట్రయల్ కోర్టుల్లో సివిల్ వివాదాలకు సంబంధించి దాఖలయ్యే దావాలకు నంబర్ ఇవ్వకుండా ప్రాథమిక దశలోనే రిజిస్ట్రీలు వాటిని తిప్పికొట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నంబర్ కేటాయించకుండా దావాను వెనక్కికొట్టడానికి.. కోడ్ ఆఫ్ సివిల్ ప్రొసీజర్/ఏపీ సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్‌లో వెసులుబాటు లేదని తెలిపింది. దావాపై అభ్యంతరాలను సంబంధిత న్యాయాధికారి మాత్రమే తేల్చగలరని, రిజిస్ట్రీ కాదని స్పష్టం చేసింది. న్యాయం కోసం కక్షిదారు కోర్టును ఆశ్రయిస్తారని, అభ్యంతరాలు లేవనెత్తుతూ పదేపదే దావాను వెనక్కి ఇచ్చేయడం వల్ల కక్షిదారుడికి న్యాయం చేయడంలో జాప్యం జరుగుతుందని పేర్కొంది. ఈ తీర్పు ప్రతిని అన్ని జిల్లాల పీడీజేలకు(జిల్లా ప్రధాన జడ్జిలు) పంపించాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి కీలక తీర్పు ఇచ్చారు. ఆస్తుల విభజన కోసం విశాఖ పీడీజే కోర్టు రిజిస్ట్రీ వద్ద జి.వీరవెంకటరావు దావా దాఖలు చేశారు. దాని విచారణార్హతపై వివరణ ఇవ్వాలని కోరడంతో పాటు నంబర్ కేటాయించే విషయంలో రిజిస్ట్రీ పలు అభ్యంతరాలు లేవనెత్తుతూ గత ఏడాది జూలైలో దావాను రిటర్న్ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వీర వెంకటరావు హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రవినాథ్ తిల్హరి విచారణ జరిపారు. "అత్యవసర న్యాయం కోసం కక్షిదారులు చాలా సందర్భాల్లో దావాలు వేస్తుంటారు. ఈ విషయాన్ని రిజిస్ట్రీ విస్మరించడానికి వీల్లేదు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించే కక్షిదారుల హక్కులను కాపాడేందుకు రిజిస్ట్రీ అప్రమత్తంగా ఉండాలి. సివిల్ ప్రొసీజర్ కోడ్ లేదా సివిల్ కోడ్ ఆఫ్ ప్రాక్టీస్‌లో నిర్దేశించని అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తి, వాటిని అమలు చేయాలని కక్షిదారుడిని ఒత్తిడి చేయడానికి వీల్లేదు. రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలు చట్టనిబంధనలు లోబడి ఉన్నా, వాటిని కక్షిదారుడు కట్టుబడి వ్యవహరించకపోయినా దావాను పదేపదే వెనక్కిచ్చేయడానికి వీల్లేదు. అభ్యంతరాలు/కక్షిదారుడు ఇచ్చిన వివరణతో ఓ నోట్‌ను తయారు చేసి రిజిస్ట్రీ తగిన ఉత్తర్వుల కోసం సంబంధిత న్యాయాధికారి ముందు ఉంచాలి. చట్ట ప్రకారం నిషేధం ఉంటే తప్ప దావా విచారణార్హతపై రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తడానికి వీల్లేదు. విచారణార్హత తేల్చాల్సింది సంబంధిత న్యాయాధికారి మాత్రమే" అని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత కేసు విషయంలో దావాకు నంబర్ కేటాయించి సంబంధిత న్యాయాధికారి ముందు ఉంచాలని విశాఖ పీడీజే కోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు.

లంకె బిందెల పేరిట బురిడీ

పూజల కోసం రూ.28 లక్షలు వసూలు

- విశాఖ జిల్లాలో దొంగబాబా గుట్టు రట్టు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- దొంగబాబా సహా ఏడుగురు అరెస్టు



దొంగబాబా యోగేంద్రబాబా

ఆనందపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పూజలు చేస్తే లంకె బిందెలు లభిస్తాయంటూ రూ.28 లక్షలు వసూలు చేసి ఉడాయించాడో దొంగబాబా. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో వెలుగుచూసిందీ మోసం. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 1.75 లక్షల నగదు, మొబైల్ ఫోన్స్, ఒక కారు, పాత ఇత్తడి బిందెలు, బంగారం పూత వేసిన నాణేలు, స్ప్రేలు స్వాధీనం చేసుకున్నారు. ఆనందపురం పోలీసుస్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలను సీఐ వాసునాయుడు వెల్లడించారు. ఆనందపురం మండలం బంటుపల్లివారి కల్లాలుకు చెందిన అప్పలరాజుకు రెండు నెలల క్రితం బంధువుల ద్వారా విశాఖ నగరం కంచరపాలెం బర్మాక్యాంపునకు చెందిన యోగేంద్ర బాబా అలియాస్ పైడిపాటి వెంకటభార్గవ్ రాఘవ(35), అతడి బృందం పరిచయమయ్యారు. పూజలు చేస్తే లంకెబిందెలు లభ్యమవుతాయని వారు అప్పలరాజును నమ్మించారు. అందుకు రూ.లక్షలు ఖర్చు అవుతాయనడంతో అప్పలరాజు మరో ముగ్గురు స్నేహితులను కలుపుకున్నాడు. నలుగురూ కలిసి దఫదఫాలుగా యోగేంద్రబాబాకు రూ.28 లక్షలు ఇచ్చారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం యోగేంద్రబాబా ఆనందపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. మండలంలోని గుడిలోవలో ఒకచోట రాళ్లతో నింపిన రెండు బిందెలను తన బృందంతో పాతిపెట్టించాడు. ఆ తరువాత అప్పలరాజు తదితరులను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి పూజలు నిర్వహించాడు. బిందెలు పాతిపెట్టించిన ప్రాంతంలో వారితో తవ్వించి లంకె బిందెలు లభించాయని నమ్మించారు. వాటిని ఆనందపురంలో యోగేంద్రబాబా అద్దెకు తీసుకున్న ఇంటికి తరలించారు. లంకె బిందెలను మరోమారు పూజలు నిర్వహించిన తర్వాత తెరవాలని యోగేంద్రబాబా చెప్పాడు. అందుకు కొంత డబ్బు తీసుకురావాలని ఆ నలుగురికి సూచించాడు. పూజలు చేయకపోతే రక్తం కక్కుకుని చస్తారంటూ బెదిరించాడు. దీంతో మిగతా డబ్బులు ఇచ్చేందుకు అప్పలరాజు, అతని మిత్రులు సిద్ధపడ్డారు. అయితే ఫోన్ చేసినా యోగేంద్రబాబా తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆనందపురం సీఐ వాసునాయుడు దర్యాప్తు చేపట్టి యోగేంద్ర బాబాతోపాటు అతని బృందంలో గాజువాక బీసీ రోడ్డుకు చెందిన డేరంగుల కుచేల్‌కుమార్(26), ఆనందపురం మండలం వేమగొట్టిపాలేనికి చెందిన కోండ్రోతు తాతారావు(32), పెందుర్తి మండలం చీమలాపల్లికి చెందిన ధరణిసింగ్ హేమంత్‌కుమార్(25), గాజువాక షీలానగర్‌కు చెందిన బత్తుల భరత్‌కుమార్(39), శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుం గ్రామానికి చెందిన కరకవలస వసంతరావు(22), విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన హరిపల్లి ప్రకాశ్(58)లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. యోగేంద్రబాబాపై ఇప్పటికే కశింకోట, పెందుర్తి, శ్రీకాకుళం, కంచరపాలెం, మల్కాపురం తదితర పోలీస్‌స్టేషన్‌లలో ఏడు కేసులు ఉన్నాయి. అలాగే, కోండ్రోతు తాతారావు, వసంతరావులపై రెండేసి కేసులు, భరత్‌కుమార్‌పై ఒక కేసు ఉన్నాయి.

ఉద్యోగం కోసం విడాకుల నాటకం!

విద్యుత్‌శాఖ ఇంజనీరు భార్య నిర్వాకం

- జైళ్లశాఖ అధికారులను బురిడీ కొట్టించే యత్నం
- విచారణలో గుట్టు రట్టు.. చీటింగ్ కేసు పెట్టే యోచన
- తప్పించుకునేందుకు కోర్టులో నిజంగానే విడాకుల పిటిషన్

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): భర్త విద్యుత్ శాఖలో ఇంజనీరు.. నెలకు లక్షన్నరకు పైగా జీతం.. ఉన్నది ఒకే కుమారుడు.. కానీ ఆ గృహిణి అత్యాశకు పోయి చిక్కుల్లో పడింది. సర్వీసులో ఉండగా మరణించిన తండ్రి ఉద్యోగం కోసం.. భర్తతో విడిపోయినట్లు నాటకమాడింది. తల్లితో కలిసి జీవిస్తున్నానని, అమ్మను చూసుకోవడానికి కారుణ్యం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరింది. క్షేత్రస్థాయి అధికారులను ఒప్పించి ఉద్యోగం అందుకునే స్థాయికి వచ్చేసింది. కానీ ఉన్నతస్థాయిలో ఒక అధికారికి వచ్చిన అనుమానంతో కూపీ లాగితే మొత్తం గుట్టు రట్టైంది. ఆమెపై చీటింగ్ కేసు పెట్టేందుకు సిద్ధపడటంతో.. నిజంగానే భర్తతో విడాకులు కావాలంటూ ఆమె కోర్టును ఆశ్రయించింది. అధికారుల కథనం మేరకు.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో హెడ్ వార్డర్‌గా పనిచేస్తున్న లంకా బుజ్జి బాబు 2020 జూలై 17న మరణించారు. ఆయన ఇద్దరు కుమార్తెల్లో ఒకరైన చిన్న కుమార్తె ఎం.శాంతి కుమారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని బుజ్జిబాబు భార్య లంకా విక్టోరియా రాణి జైళ్లశాఖకు విన్నవించుకున్నారు. అయితే, కారుణ్యం కింద పెళ్లయిన కుమార్తెకు ఉద్యోగం ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించబోవని జైలు సూపరింటెండెంట్ చెప్పారు. దీంతో.. తాను భర్తతో విడాకులు తీసుకున్నానని, ఎనిమిదేళ్ల కుమారుడితో కలిసి పుట్టింట్లోనే ఉంటున్నానని శాంతి కుమారి చెప్పారు. అంతేగాక అప్పటి హోంశాఖ మంత్రి తానేటి వనితతో సిఫారసు చేయించినట్లు తెలిసింది. దీంతో జైలు సూపరింటెండెంట్ ఆమె దరఖాస్తుతో పాటు తన విచారణ వివరాలను హోంశాఖ కార్యదర్శికి పంపారు. జైళ్లశాఖ ఇన్‌చార్జి డీజీగా ఉన్న హోంశాఖ కార్యదర్శి శాఖాపరమైన సమీక్ష సందర్భంగా శాంతి కుమారి కారుణ్య నియామకం గురించి ఉన్నతాధికారులతో ప్రస్తావించారు. పెళ్లైన కుమార్తెకు కారుణ్య నియాయం కింద ఉద్యోగం ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించబోవని ఒక అధికారి చెప్పడంతో ఫైలు పక్కన బెట్టేశారు. దీంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక చోటా నాయకుడి ద్వారా జైలు అధికారులపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయించారు. మరోసారి విచారణ చేపట్టాలంటూ ఒక ఉన్నతాధికారికి హోంశాఖ అప్పగించడంతో బుజ్జిబాబు భార్య విక్టోరియా రాణితో మాట్లాడారు. తన కుమార్తె భర్తతో విడాకులు తీసుకుని తన ఇంట్లోనే ఉంటోందని ఆమె చెప్పడంతో ఆ అధికారి శాంతి కుమారి భర్త వివరాలు సేకరించారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ(ఏపీఈపీడీసీఎల్)లో ఇంజనీరుగా ఉద్యోగం చేస్తూ నెలకు లక్షన్నర జీతం తీసుకొంటున్నారని, అతని పేరు ప్రదీప్ కుమార్‌గా నిర్ధారణకు వచ్చారు. ఆ వివరాలతో మరోమారు బుజ్జిబాబు భార్య, ఉద్యోగం ఆశిస్తున్న శాంతి కుమారితో మాట్లాడి.. కోర్టు నుంచి విడాకులు తీసుకున్నట్లు సర్టిఫికెట్ కావాలని, అలాగే, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న భర్త నుంచి భరణం ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. మీరు ప్రదీప్ కుమార్‌తోనే కలిసి ఉన్నట్లు తాజాగా ఆయన విద్యుత్ శాఖకు అందజేసిన కుటుంబ సభ్యుల వివరాలు చెబుతున్నాయంటూ ఆధారాలు చూపించారు. అయినా వెనక్కి తగ్గని తల్లి, కుమార్తె ఆ ఉన్నతాధికారిని ఎమోషనల్‌గా బ్లాక్ మెయిల్ చేయడంతో చీటింగ్ కేసు నమోదు చేయాలంటూ ఆయన ఏలూరు జైలు అధికారులకు జైళ్ల శాఖ ఉన్నతాధికారి సూచించారు. విషయం తెలిసిన శాంతి కుమారి, ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి తాజాగా భర్తతో విడాకుల కోసం కోర్టులో పిటిషన్ వేయడం జైళ్లశాఖలో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అయితే మొదట్లోనే సరైన విచారణ చేపట్టకుండా ఉన్నతాధికారులకు ఫైలు పంపిన జైలు అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జగన్ బెయిల్ రద్దు పిటిషన్ వేరే బెంచ్‌కు

- సుప్రీం విచారణ 27కి వాయిదా


న్యూఢిల్లీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి బెయిల్‌ను రద్దుచేయాలని.. ఆయనపై నమోదైన అక్రమాస్తుల కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని మాజీ ఎంపీ, ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మరో ధర్మాసనానికి బదిలీ అయింది. ఇప్పటి వరకూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం దానిని విచారించగా.. సోమవారం ఆ పిటిషన్ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసులో ఏళ్ల తరబడి పురోగతి లేదని రఘురామరాజు తరఫు సీనియర్ న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పదేళ్లుగా జగన్ బెయిల్‌పైనే ఉన్నారని, సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని.. సీబీఐ, నిందితులు అవగాహనతో ఉన్నారనిపిస్తోందని తెలిపారు. డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విన్నాక.. నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు న్యాయాధికారులు బదిలీ అయ్యారని ప్రస్తావించారు. వాదనలు వినిపించేందుకు సమయం కావాలని.. అదనపు సొలిసిటర్ జనరల్ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున వాయిదా వేయాలని సీబీఐ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను 27కి వాయిదా వేసింది.

కాకినాడ పోర్టు డీల్ 'రివర్స్'!

(మొదటి పేజీ తరువాయి)

'కాకినాడ సెజ్ గురించి మరిచిపోండి. అది అరబిందోకే! పోర్టులో మీ నుంచి తీసుకున్న వాటాలు మీకే వచ్చేస్తాయి" అని డీల్ కుదిరింది. దీని ప్రకారం 3 రోజుల కిందట అరబిందో పేరుతో ఉన్న 2.15 కోట్ల షేర్లు కేవీరావుకు బదిలీ అయిపోయాయి. దీనికి సంబంధించి అప్పట్లో తనకు చెల్లించిన డబ్బులను కేవీరావు అరబిందోకు తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది. దీంతో కాకినాడ పోర్టు పూర్తిగా కేవీరావు వశమైంది. సీపోర్టుకు స్టాక్ ఎక్స్ఛేంజీతో సంబంధం లేకపోవడంతో గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగిపోయింది. ఇక... కాకినాడ సెజ్‌లో తన వాటాగా రూ.1104కోట్లు రావలసి ఉండగా, రూ.12 కోట్లతో సరిపెట్టారని కేవీరావు సీఐడీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోర్టు వాటాలను తిరిగి ఇచ్చేసినందున.. ఇక సెజ్ గురించి మరిచిపోయేలా డీల్ కుదిరినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కేవీరావు మాత్రం, సెజ్‌లో వాటాలను వదులుకునేది లేదని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా కోటేశ్వరరావు బాధ్యతలు



అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతో గ్రంథాలయాలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.